

# నిరాడంబరత మాటున
# SIMPLICITY AT DAWN



కస్తూరి బెహన్


నిరాడంబరత మాటున
SIMPLICITY AT DAWN
కస్తూరి బెహన్

## వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# నిరాడంబరత మాటున

# सादगी की ओट से

# SIMPLICITY AT DAWN

కస్తూరీ బెహెన్

## విషయ సూచిక


| | పేజీ నెం. |
|---|---|
| 1. సందేశం (శ్రీ బాబూజీ మహరాజ్) | 3 |
| 2. రెండు మాటలు | 6 |
| 3. దివ్య విభూతి పరిచయం | 7 |
| 4. శ్రీరామచంద్ర మిషన్ | 10 |
| 5. సహజమార్గ సాధనా పద్ధతి | 12 |
| 6. ప్రశిక్షకుడు | 21 |
| 7. శ్రీ బాబూజీ దైవిక శిక్షణ | 23 |
| 8. శ్రీ బాబూజీ యొక్క అనుపమానమైన కృప మరియు అద్వితీయమైన దివ్యశక్తి | 27 |
| 9. భూమా | 29 |
| 10. నిరాడంబరత మాటున | 33 |
| 11. అభ్యాసుల ప్రశ్నలు – బాబూజీ జవాబులు | 38 |

# 1. సందేశం
## (శ్రీ బాబూజీ మహరాజ్)

నా ప్రియ సోదరీ సోదరులారా!

యోగం అనేది భారతదేశపు ప్రాచీనమైన విషయం. కాని కొంతకాలంగా దీని వికాసం నిలిచిపోయింది. ఎందుకంటే, అస్థికల నుంచి భాస్వరం (ఫాస్ఫరస్)ను వెలికితీసే పద్ధతి మర్చిపోయారు. అనగా స్థూలత్వం నుండి సూక్ష్మత్వం సాధించే ప్రయత్నం మరుగున పడిపోయింది. భారతదేశం ఇప్పుడు స్వాత్మమయంగా అనగా తన స్వంత తత్త్వమయంగా తయారైపోయి, ఆ తత్త్వమే బాహ్యంగా కూడా ప్రసరిస్తున్నది. అందువలన భారతీయ ప్రజానీకం యొక్క అసలైన అంతర చైతన్యం, బాహ్యంగా వృద్ధి చెందటానికి కూడా సన్నద్ధమైంది. రానున్నది మంచికాలం కనుక ఆ విధంగా మార్పు చెందటం తప్పనిసరి అయ్యింది. మారుతున్న అనేక విషయాల నుంచి ఆంతరికమై ఉన్న (ఒకటియే అయిన) విషయాన్ని గుర్తించలేకపోవటం మన దురదృష్టం. అందువలన మన చైతన్యాన్ని, మనం మన బాహ్యానుభూతి ద్వారానే (Measure) కొలుస్తున్నాము. భారతీయ పూర్వ ఋషులు మానవ కళ్యాణం కోసమని చాలా శ్రమించారు. కాని వారు ఆవిష్కరించినవాటిని విస్తృతంగా కాకుండా వారు ఎంచుకున్న కొద్ది మందికి మాత్రమే పరిమితం చేశారు. నా సమర్థ సద్గురు ఆదేశానుసారంగా నేను వాటిని ప్రకటించటానికి మరియు జనసామాన్యానికి ప్రదానం చేయాలని కోరుకుంటున్నాను.

ఈ ప్రపంచం మనలో ఉంది, మనం ఈ ప్రపంచంలో ఉన్నామనటంలో సందేహం లేదు. కాని మనం ఈ బాహ్యరూపం వెనుక ఉన్న శక్తి ఏమిటో వెదకాల్సి ఉంది. ధ్యానం మరియు ఇతరములైనవన్నీ కేవలం ఇది కనగొనటానికే. అది (అనగా పరమాత్మ) మనకు కనిపించకుండా ఉంటున్నాడు అని మనం భావిస్తాం, కాని అలా కాదు. మనం ఎప్పుడైనా నక్షత్రాలను చూస్తాం. కాని కొంచెం ముందుకుపోతే, మనకు సూర్యకాంతి అనుభవమవుతుంది. ఆ తర్వాత మనం నేరుగా సూర్యుడినే దర్శించటానికి యోగ్యులమయ్యే సమయ మాసన్నమవుతుంది. మనం సూర్య తేజస్సును గురించే ఆలోచిస్తూ ఉన్నంతవరకూ అసలైన సూర్యుడు మన దృష్టి నుంచి కనుమరుగై ఉంటాడు. మన అస్తిత్వానికి మూలకారణమైన ఆ లక్ష్యంవరకు అందరూ చేరుకోవాలని నేను హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

ఒకవేళ (Not-to be) 'ఏదీ ఉండకుండా' (అస్థిత్వం లేకుండా) ఉంటే, ప్రపంచం యొక్క అస్థిత్వమే ఉండేది కాదు. దీనిని ఆధ్యాత్మికంగా తీసుకున్నట్లయితే, 'ఉన్నది' (అస్థిత్వం) యొక్క అర్థం (Self) 'స్వత్వం' (ఆత్మ) అవుతుంది. ఒకవేళ మనం (Non-Self) 'స్వత్వలేమి' (ఆత్మలేని క్షేత్రం)లో ప్రవేశించాలనుకుంటే, మనం ఆలోచనల స్థానంలో 'ఉన్నది' (To be) అను దానిని సమాప్తంచేసి 'ఏమీలేదు ' (Not-to be) అను దాని వాస్తవిక రూపాన్ని చేరుకోవాల్సి ఉంటుంది. దీని అర్థం ఏమిటంటే, (Life without life) జీవనంలేని జీవనం అనగా "మనం ఉన్నాము మరియు మనం లేము" అని, అలాగే "మనం లేము మరియు మనం ఉన్నాము" అని. "తనలో తను ఒక్కడు" (One in Himself) అను ఒక ఆలోచన ఎలాంటి స్థితికి తీసుకువస్తుంది అంటే, "తెలుసుకున్నది ఏమిటంటే, ఏమీ తెలుసుకోలేదు (When knowledge revealed itself, it was only knowledgelessness)" అని. అప్పుడింక ఆ స్థితిలో కోరికల యొక్క ఆవాసం శిథిల స్థితికి చేరుతుంది. ఇంకా చెప్పాలంటే, విషయాలతో కూడియున్న వ్యక్తిత్వం అనే గిన్నె –

పాత్ర పగిలిపోయి దానిలో ఏమీ నిలుపుకోలేని అయోగ్యమైనదిగా అయిపోతుంది. **"ఉజడీ హుయీ బస్తీ హై, ఫూటా హువా పైమానా"** అనగా రూపు రేఖలు చెడి పాడుబడిన 'బస్తీ' వంటిది అవుతుందని అర్థం.

ఆధ్యాత్మికత యొక్క అంతం దివ్యత్వం సిద్ధించటంలో సమాప్తమవుతుంది. ఆ దివ్యత్వం యొక్క పర్యవసానం దాని మూలమైన (Real Essence) 'అసలు' తత్వంలో ఉంటుంది. ముక్తి (Liberation) తర్వాత మానవుడు పరమాత్మ (ఈశ్వరుని) యొక్క సామీప్యతను పొంది, మౌనమే –మౌనంగా ఉన్నటువంటి క్షేత్రంలోకి ప్రవేశిస్తాడు. జీవన్ముక్తి (అనగా శరీరం ధరించియే ముక్తి పొందటం –దీనినే బొందెతో స్వర్గానికి వెళ్ళటమంటారు) కూడా ఆధ్యాత్మికతకు చెందిన ఒక (Chapter) అధ్యాయం. భౌతికత్వం నశింపు అయ్యాక భౌతిక శాస్త్రం (Material Science) ఇంకా ఏమీ చెప్పజాలదు. ఆధ్యాత్మికత అనేది అత్యంత శ్రేష్ఠమైన (పరాత్పర) తత్వానికి చెందిన ఒక రకమైన చైతన్యం (Consciousenss) లేదా అనుభూతి. ఇది స్వచ్ఛం మరియు సంపూర్ణ దివ్యత్వంతో, అంతటా సమత్వమై ఉన్న అత్యంత ఉన్నత క్షేత్రంలోకి ప్రవేశించు సింహద్వారం. వాస్తవికత (రియాలిటీ – అసలీయత్)తో పోల్చుకుంటే సర్వశక్తివంతమైన సాగరంలో మనం కేవలం ఒక్క బిందువు మాత్రమే! మనం ఏదో ఒక రకంగా బిందు రూపం (నీటిబొట్టు) నుంచి ఒక నదిగా మారేట్లుగా ప్రయత్నించాలి.

నేను నాలో ఇతరులకు సేవచేసే అభిలాషను పెంపొందించుకున్నాను. అందువలన ఆలోచనలు మరియు కర్మల మూలంగా అస్థిరత్వం మరియు ఆవేదనతో కృంగిపోయినవారి సేవా నిమిత్తం శ్రేష్ఠమైన సాధనల కోసం నిరంతరం అన్వేషిస్తూ ఉంటాను. ఎక్కడైనా విషం ఉన్నట్లయితే అక్కడే అమృతం కూడా ఉంటుంది. మనం సూర్యునికి ఎదురుగా నిలబడినట్లయితే మన మీద కాంతి (వెలుతురు) పడుతుంది. అలా కాకుండా వెనుదిరిగి నిలబడినట్లయితే మనకు చీకటి అనుభవమవుతుంది. దీని అర్థం ఏమిటంటే, మనం మన కర్మలవల్లనే చీకటి, వెలుతురును సృష్టించుకుంటున్నాము. మనమే అందుకు కర్తయని తెలుసుకున్నప్పుడు కష్టాలు ఎదురవుతాయి. **వాస్తవానికి ముళ్ళతో కూడిన మొక్కలమీద కూడా సుందరమైన పుష్పాలు వికసిస్తాయి. అవి కళ్ళకు సుఖాన్ని, హృదయానికి సంతోషాన్ని కలిగిస్తాయి. ఇదే విధంగా పరమాత్ముడు (ఈశ్వరుడు) తన వృక్షానికి (అనగా సృష్టికి) పుష్పమైతే మనం ఈశ్వరుడు నుండి 'అనుగ్రహం' అను లాభాన్ని పొందుతాము. అంతేగాని ఆ వృక్షం (అనగా సృష్టి) వలన కాదు.** ఇంటిలో మరుగు గొట్టాలు, కుళాయిలు ఉంటాయి. అవి మనం ఉపయోగించుకుంటామే కాని, తొలగించము. వాటిని మంచిగా ఉండేట్లు ఆధునీకరించాలని అనుకుంటామేగాని వాటిని పూర్తిగా ధ్వంసం చేయము. ఇంకో మాట చెప్పాలంటే, సమాజంలో మంచి మనుషులు ఉంటారు, కాని వారికి ఆధ్యాత్మికత అంతగా పట్టకపోవచ్చు. ఆ సుగంధమే (ఆధ్యాత్మికత) కనుక వారికి లభించినట్లయితే, అనగా ఆధ్యాత్మికతవైపు వారి దృష్టి మరలినట్లయితే వారు త్వరగా తమ వ్యక్తిత్వాన్ని మార్చుకునే దిశగా మరలుతారు. **మనం పుణ్యవంతులుకానివారిపైన కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అటువంటివారిని ఆ దశ నుంచి ఉన్నతంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. అనగా వారిలో సత్యత్వం (రియాలిటీ)పట్ల తపన జనించేట్లుగా చేయాలి. సమర్థ సద్గురువుపట్ల భక్తి ప్రపత్తులు వికసించేట్లుగా చేయాలి.**

నా అభిప్రాయం ప్రకారం తూర్పు పడమటి దేశాల సంస్కృతిలో (మనకు వారికి మధ్య) కొంత భేదం ఉంది. ఇక్కడ మనం మన ఆంతరికాన్ని మాత్రమే మన అంతర్ దృష్టి రూపంలో ప్రయోగించటానికి ప్రయత్నిస్తాము. కాని వారైతే తమనే తమ ఆంతరిక దృష్టిగా తయారవుతారు. ఆధ్యాత్మికత కేవలం భారతీయుల

స్వంతం మాత్రమే కాదు, అది అందరి జన్మహక్కు. ప్రపంచం యొక్క వివిధ ప్రాంతాలలోని మన సాటివారికి ఆధ్యాత్మిక ప్రాప్తికోసం, మనవైపు చూడాల్సిన అవుసరం ఉండకూడదు అనేది నా ప్రబలమైన కోరిక. ఇందుకే నేను శిష్యులను కాకుండా గురువులనే తయారు చేస్తున్నాను. ప్రపంచపు ప్రతి దేశం కూడా ఆధ్యాత్మికతలో తమ భాగాన్ని ప్రాప్తించుకోవాలని నేను ఆశిస్తున్నాను. ఇప్పుడు ప్రపంచం అంతటా ఆధ్యాత్మికంగా జాగృతమై ఉంది. సామ్యవాదులు (కమ్యూనిష్టులు) కూడా సమయం వచ్చినప్పుడు ఈ విధానాన్ని అనుసరిస్తారు. దాదాపు మన అందరమూ ఆధ్యాత్మికతకు ఆధారమైన ఆ శాంతికి సమీపంగా చేరుకున్నాము. ఇది ప్రారంభమై ప్రపంచం అంతటా విస్తరించినప్పుడు, అది వారిని శాంతికి ఆవల ఏదైతే ఉన్నదో అక్కడకు చేర్చుతుంది. ఇప్పుడు మనకు శాంతి ముందు ఏదైతే ఉందో అది తెలుసు, కాని శాంతి తర్వాత ఏమున్నదో బహు కొద్దిమంది మాత్రానికే తెలుసు. ఇది దివ్య విధానం లేదా దివ్యాదేశం (Divine Dictate) కనుక నా పని రోజురోజుకూ సులభమవుతున్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరు శాంతిని కోరుకుంటున్నారు. ఈ శాంతి పరాకాష్టకు చేరినప్పుడు అంతిమ సత్యంలో ప్రవేశించటమే అవుతుంది. **మన ప్రిసెప్టర్లు కనుక ప్రజలందరిని ఉద్ధరించాలను కోరిక కలిగి ఉంటే, ఆధ్యాత్మికత అనేది మన వెంటబడు రోజు వస్తుందని నేను ఆశిస్తున్నాను.** నేను స్వయంగా అత్యంత దుర్బలుడనే కాకుండా వృద్ధాప్యం కారణంగా కృశించిపోయి ఉన్నాను. అయినప్పటికి నిజమైన శాంతిని మానవులకు దరిజేర్చటానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నాను. నేను చేయదలచిన పనిలో యోగ్యులైన పురుషులు, స్త్రీలు సహకరించాలని కోరుతున్నాను. దీని కోసం మనం బాగా శ్రమించినట్లయితే ఈ ప్రపంచం స్వర్గతుల్యమవుతుంది అని అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. మనం చేయవలసినదంతా ఏమిటంటే, మనం దివ్యత్వం మీద సదా పట్టుబిగించి ఉండాలి. నేను ఎప్పుడూ నిరుత్సాహపడకుండా ఒంటరిగానే నా పనిలో నిమగ్నమై ఉన్నాను. దాని పరిణామం మన ఎదుట ప్రత్యక్షంగా ఉంది. నా వీపు తట్టిన సమర్థ సద్గురువు యొక్క అభయహస్తం వలన నాకు సదా సంపూర్ణ విశ్వాసం ఉంటుంది. దాని వలన నాకు సర్వదా సాఫల్యం చేకూరుతోంది. మీ అందరి విషయంలో కూడా నేను ఇదే కాంక్షిస్తున్నాను.

చివరిగా ఏమిటంటే, ప్రేమ అనేది ప్రతి పనినీ సులభతరం చేస్తుంది. అంతేకాదు, అంతిమ లక్ష్యం చేరు మార్గాన్ని సమర్థ సద్గురువు కృపా ధారతో సానుకూలం, సులభతరం చేయటానికి తోడ్పడుతుంది. "ప్రేమ అనేది దివ్య సౌందర్యం కొరకు మానవుని ఆత్మయొక్క ఆకలి (ఆర్తి)" అని సోక్రటీసు నిర్వచించాడు. **"ప్రేమ అనేది సత్యత్వం (రియాలిటీ)పట్ల ఆంతరిక మేలుకొలుపు. (Love is the inner awakening to Reality)"** అని నిర్వచిస్తాను. **ఎవ్వరైతే అందరినీ ప్రేమిస్తారో వారిని ప్రేమించండి. ఇదే విధంగా ఆతని ద్వారా అందరిపట్ల దానంతట అదే ప్రేమ కలుగుతుంది.** తథాస్తు!!

ప్రెసిడెంట్

**తేది: 30.04.1980** **శ్రీరామచంద్ర మిషన్,**

**షాజహాన్‌పూర్ (యు.పి)**

## 2. రెండు మాటలు

ఈరోజు ఈ పుస్తకానికి రెండు మాటలు వ్రాయబోయే ముందు  ఉత్తరం సంఖ్య 843 (అనంత యాత్ర 4వ భాగం)లో శ్రీ బాబూజీ మహరాజ్ ఈ వాక్యం వ్రాయడం నాకు చాలా సంతోషంగా ఉంది. అది ఏమిటంటే, "నీ ఉత్తరం చేరింది. నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే, లాలాజీ సాహెబ్ నిన్ను ఆధ్యాత్మిక పరిశోధన కొరకు ఎంపిక చేశారు" అని. ఇంకా 'వారు' ఏమి వ్రాశారంటే, "సాధ్యమైనంతవరకు నీవు ప్రతి స్థితిని గురించి చాలా బాగా వ్రాస్తావు" అని. అలా జరిగి తీరవలసిందే కదా! ఈ రచనలో 'వారి' కృప మరియు ప్రేమతోపాటుగా 'వారి' దివ్య సంకల్పాన్ని పూర్తి చేయటంలో సంతృప్తినిచ్చే శుభ సూచన కూడా లభిస్తూ ఉన్నప్పుడు ఎందుకు కాకుండా ఉంటుంది!

అరెరే! ఇప్పుడు నిరాడంబరత మాటు నుంచి నన్ను ఎవరు పిలిచారు? అయితే వినండి. "రెండు మాటలు" నన్ను పిలిచి ఏదో చెబుతున్నాయి. **'ప్రేమ' అనే శబ్దం ఒక్కటేగాని అర్థాలు రెండుగా ఉన్నాయి. అనగా దాని అర్థాన్ని అదే స్వయంగా వ్యాఖ్యానిస్తున్నట్లుగా ఉంది. ఇదేమి శబ్దమో కాని, ఒక్కటే అయి ఉండి కూడా రెండు అర్థాలను స్ఫురింపజేస్తున్నది! హిందీలో 'ప్యార్' (ప్రేమ) అనగా పా + యార్ ('పా' అంటే పొందు, 'యార్' అంటే ప్రియుడు) అనగా ప్రియుని పొందుము అని. అనగా నీ ప్రియుని పొందితేనే నీ ప్రేమ సార్థకమవుతుంది. ఇప్పుడింక మీరు అర్థం ద్వారా శబ్దాలు తయారుచేసి నట్లయితే రెండు శబ్దాలు మాత్రమే వెలువడుతాయి. అవి ఏమిటంటే, భక్తుడు, భగవానుడు; సాధకుడు, సాధ్యం. ప్రతి శబ్దం ఏమి సూచిస్తున్నాయి అంటే, నీవు భక్తుడవు అయితే భగవంతుణ్ని పొందు, సాధకుడు అయితే సాధ్యాన్ని (సాధించవల్సింది) ప్రత్యక్షం చేసుకో, అభ్యాసీవై ఉంటే హృదయంలో విరాజిల్లుతున్న ఈశ్వరాంశను పొందు అని. ఎందుకంటే, ప్రేమ అనేది ప్రియతముని పొందటానికే అయి ఉంటుంది. ఎలా అంటే, ప్రియతముడు ప్రేమ మాటునే ఉన్నాడు కాని, వేరెక్కడో లేదు. భగవానుడు భక్తి మాటునే ఉన్నాడు కనుక పొందటానికి ఆలస్యం ఎందుకు? ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు అని సహజమార్గ సాధన నిర్దేశిస్తుంది. మరైతే పొందటానికి ఆలస్యం ఎందుకు?** నిజమే కదా! అయితే వినండి. నిరాడంబరత మాటు ఏమి చెప్పింది అంటే, "నా మాటున దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్, సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క ప్రియతమ బిడ్డ ఉన్నారు. ప్రేమ శబ్దం యొక్క అర్థ స్వరూపంగా 'వారి'ని సమస్త మానవాళి హితం కొరకు ఈ ధరణిమీదకు ఆహ్వానించింది" అని చెబుతోంది. కాని నా పాటలోని ప్రతి పంక్తి యొక్క శబ్దాలు ఏమి చెబుతున్నాయి అంటే, "సపన్ కీ వోఢినీ" అనగా స్వప్నపు ముసుగులో  నా జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీలో కలవడానికి నన్ను ముసుగులోనే కలిపివేశాయి, అనగా లయం చేసివేశాయి. తర్వాత ప్రేమతో  ప్రియతముని నేను ఎలా పొందానో దానిని ఎలా వ్రాయాలి, ఏమని వ్రాయాలి! కాని తర్వాత ఏమైందంటే, ఊగిసలాడే దైవిక ప్రేమ పారవశ్యం సన్నని పొరలాగా 'వారి'కి నాకు మధ్య అడ్డుగా నిలిచినప్పుడు 'వారి' ఈ కుమార్తె, "బాబూజీ! ఈ కొంచెం దూరం మీరు ఎందుకు ఉంచారు. నేను నిరంతరం తపించిపోవటానికి కాదు కదా!" అని ఎలా అడుగుతుంది? అలా కానేరదు. ఎందుకంటే, అటువంటి తపన ఎవ్వరూ భరించలేరని 'వారి'కి తెలుసు. తర్వాత రెప్పపాటు వ్యవధిలోనే శబ్దం యొక్క అర్థం మారినట్లయ్యింది.

నిరాడంబరత మాటు నుంచి కలిగిన ఈ దర్శనం నాలో జీవించాలను ధైర్యం మరియు జీవితం యొక్క అనుభూతి ఇచ్చింది. అంతే, ఒక రోజున! సమస్త మానవాళి యొక్క ఆత్మోద్ధరణ కోసం నిరాడంబరత మాటు నుంచి ఆ దివ్యదర్శనం అందరకూ సులభతరం చేయబడింది. ఆ దివ్యానందంతో సమస్త భూమండలమూ పులకించిపోయింది. ఆకాశం అర్పితమైపోయి 'వారి'ని తన గానంతో కీర్తించసాగింది. ఏమని అంటే, **"ఓ బాబూజీ! ఎవ్వరైతే మీ చరణాలకు అర్పితమై పోయారో, వారు (ఆటల మైదానంలో ఖ్యాతిపొందిన ఆటగాళ్ళు వెలుగుతున్న జ్యోతి అనగా కాగడాని పట్టుకుని ఉత్సాహంతో పరుగులు తీస్తున్నట్లు) ఆధ్యాత్మిక పథంలో ప్రకాశిస్తున్న ఆ దివ్య జ్యోతిని పొంది, దానితో విజయం సాధిస్తారు"** అని. ఓ బాబూజీ! క్రమంగా నిరాడంబరత యొక్క మాటు (తెరచాటు) కూడా దివ్య విభూతి (బాబూజీ)కి ప్రేమతో సమర్పితమైపోయింది. అప్పుడింక ప్రేమ శబ్దం యొక్క ప్రేమ, సమస్త హృదయాలను తన మాధుర్యంతో నింపుతూ ఇలా చెప్పింది –**"నేను ఉన్నప్పుడు నీవు లేవు, ఇప్పుడు నీవు ఉన్నావు, నేను లేను"** అని. ఇప్పుడు మీరు ఏమంటారు? నిరాడంబరత మాటు నుంచి దివ్య మృదుహాసం తిలకించి ప్రకృతి పులకించిపోయింది, వాతావరణం ఆనందంతో నృత్యం చేసింది.

## 3. దివ్య విభూతి పరిచయం

ఇంతకూ నేడు నేను ఎవ్వరి పరిచయం పొందాలని అనుకుంటున్నాను? ఎవ్వరి పరిచయం వ్రాయటానికి నా ఈ కలం నా బాబూజీ ఎదుట శిరస్సు వంచి 'వారి' దివ్య చరణాలవైపు చూస్తూ ఉంది? ఎవ్వరి పరిచయం నేడు స్వయంగా తన ఎదుట ప్రకటించబోతుందో కదా, అని ఆలోచనా నిమగ్నమైపోయిన నా ఈ కలం దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్ అవతరణ యొక్క సమక్షంలో, కనురెప్పలు కూడా వాల్చకుండా దృష్టిని నిలిపి ఉంచి నిరీక్షణలో ఉండిపోయింది. **"ఆధ్యాత్మిక ఖజానా ఏదైతే అందరి హితం కొరకు తీసుకొని వచ్చానో, అది అంతా నేను ఇక్కడనే (భూమి మీదనే) వెదజల్లి వెళ్తాను. వాతావరణం దీని నంతటినీ సంతరించుకుని పూర్వీకుల సంపదలాగా తనలో సురక్షితంగా అందరికోసం భద్రపరచి ఉంచుతుంది. సమయానుకూలంగా అది స్వయంగా ప్రకటించబడుతూ ఉంటుంది"** అని ఎవరైతే చెప్పారో ఆ దివ్య పురుషుడు, శ్రీ బాబూజీ మహరాజ్ పరిచయం ఇది. ఆ దివ్య విభూతి పరిచయాన్ని వాతావరణం స్వయంగా జీర్ణించుకోలేకపోవటం వలన, కేవలం అందరి హితంకొరకు నా కలం ద్వారా మాత్రమే ప్రకటితమవ్వాలని కోరుకుంటున్నది. ఎందుకో తెలుసా? ఎందుకంటే, వాతావరణమే కానివ్వండి, సమయమే కానివ్వండి, ఈ దివ్య సందేశాన్ని ఎక్కువకాలం వరకు తనలో ఇముడ్చుకొని ఉండటానికి వాటికి సామర్థ్యం లేదు. ఎందుకంటే, సమయం అనేది సత్యం, ఆ సత్యం ప్రకటితమవుతూనే ఉంటుంది. ఇప్పుడు సమయం మరియు వాతావరణం తమ అసమర్థత ఫలితంగా ఆ దైవిక సత్యాన్ని ఎలా ప్రకటిస్తాయి అనేది మనం వేచి చూడాల్సి ఉంది.

ఎంత కష్టమో కదా 'వారి' పరిచయం! అవనిమీద ప్రకటితమై మనకు ఇస్తూనే ఉంటున్నారు, ఎల్లప్పుడూ ఇస్తూనే ఉంటారు, కాని ఏమి కూడా తీసుకోరు. ధరణి ప్రార్థించి 'వారి' దివ్య చరణ స్పర్శను మాత్రం ప్రసాదంగా పొందింది. కాని ఇక్కడ ఉంటూనే ఉన్నా కూడా, ఈ ధరణి మీద ఉంటున్నాను అను 'వారి' భావ స్పర్శను పొందలేకపోయింది. అయితే ఈ పృథ్వి యొక్క వాతావరణం మాత్రం 'వారి' దివ్య ప్రాణాహుతి శక్తి ప్రవాహాన్ని ఆకాశం వరకు విస్తరింపజేసి పవిత్రవంతంగా చేస్తున్నది. అలాగే 'వారి' దివ్య పరిశుద్ధమైన సహజ చిరునగవు వాతావరణాన్ని సహజ ఆనందం అను ప్రసాదంతో నింపుతూనే ఉంది. ఈ భూమి మీద నడయాడుతూనే ఉన్న ఆ దివ్య పురుషుని యొక్క శూన్య దృష్టి, అవని నుండి ఆకాశం వరకుగల వాతావరణాన్ని అహం యొక్క భారం నుండి తేలికపరుస్తూ, శూన్య దశవైపుగా మానవాళిని తీసుకువెళ్ళగల సామర్థ్యంతో అలంకరిస్తూనే ఉంటుంది. బహుశా, ఆ దివ్య విభూతి యొక్క స్వల్ప పరిచయం మాత్రమే చేయగలగటం నా కలం యొక్క అదృష్టంగా లభించింది. "తండ్రి యొక్క గొప్పదనం తనయునికి సంక్రమిస్తుంది" అను నానుడి ప్రకారం ఇకమీదట నా లేఖిని తన వ్రాతలో ఏమి చెప్పబూనినా అది 'వారి' అనగా ఆ దివ్య పురుషుని కృపయే సహాయకారిగా అవుతుంది. నేటివరకు స్వయంగా తన పరిచయంతోనే తాను అపరిచతంగా ఉన్న శూన్యావస్థకు కూడా ఇప్పుడు చెప్పవలసి ఉంటుంది. అలా ఎందుకంటే, దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్ గారి మిషన్‌లో ప్రతి ఒక్కరి కోసం 'వారి' స్వాగతం ఉంటుంది. మానవ మాత్రులలో ఈశ్వర ప్రాప్తి అను కోరికను జాగృతం చేయటం కోసం 'వారు' తమ సంకల్పాన్ని పూర్తి చేయటానికి తమంతట తామే సమర్పితమైపోయారు. బహుశా ఇది 'వారి' దివ్య సంకల్పం యొక్క సూక్ష్మ పరిచయం మాత్రమే.

శబ్దాలు మౌనంగా ఉన్నాయి. ఎందుకంటే, బహుశా ఆఖరికి నేడు ఆ పరమ జీవన సర్వస్వం యొక్క దైవిక సంకల్పమే, ఇంతవరకు వెల్లడికానటువంటి భూమా యొక్క జాడను చెప్పవలసి వచ్చింది. యదార్థం ఏమిటంటే, 'వారి' దైవిక ఆహ్వానం మరియు అవతరణయే సమస్త ఆధ్యాత్మిక దశలను అనుభవింపజేయటానికి, మానవ మాత్రుల హితం కొరకు దివ్య సాక్షాత్కారం పొందటానికి, 'వారు' ఒక సరళమైన సహజమార్గాన్ని ప్రవేశపెట్టి ప్రశంసనీయంగా వ్యాప్తి చేశారు. ఆ సహజమార్గం ద్వారా మానవ హృదయాలలో (ప్రాణాహుతి) ఈశ్వరీయ ధారను (Transmission) ప్రవహింపజేసి వారి సాధనకు సిద్ధి కల్పించటం కోసం హృదయంలో దివ్య సాక్షాత్కారం యొక్క సౌందర్యంతో అలంకరించారు. అంతిమ సత్యం (భూమా)లో ప్రవేశపెట్టే 'వారి' ప్రేమతో నిండిన దివ్య సంకల్పమే సహజమార్గ సాధన ప్రారంభంలోనే దాని (భూమా) యొక్క మహత్ దర్శనాన్ని కల్పించటానికి ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశింపజేస్తూ ఉంటుంది. **సాధనలో అభ్యాసీకి ప్రథమ సిట్టింగ్ నుండియే ఈశ్వరీయ ధార యొక్క నిరంతర ప్రవాహంతో హృదయాన్ని నిర్మలంజేస్తూనే 'వారి' ప్రేమ మరియు (Divine light) దివ్య ప్రకాశంతో కూడిన ఆంతరిక వెచ్చదనంతో అహం యొక్క బంధనాలను ఒక్కటొక్కటిగా కరిగించి బయటకు విసరివేస్తూ, క్రమంగా అభ్యాసీ హృదయాన్ని అహం యొక్క బంధనం నుంచి విముక్తంచేస్తూ ఉంటుంది.** అలా జరుగుతూ ఉండగా, ఒక రోజున 'అహం' యొక్క ఆవరణను తొలగించి (అనగా 'నేను లేను' అను దానిని కల్పిస్తూ)

క్రమంగా మనల్ని శ్రేష్ఠమైన ఆధ్యాత్మిక స్థితులతో అలంకరించి తాము చెప్పిన దానిని ధృవపరుస్తూ అనగా 'జీరో' (శూన్య) స్థితిలోకి ప్రవేశం కల్పిస్తారు. ఇది మన శ్రీ బాబూజీ స్థాపించిన "శ్రీరామచంద్ర మిషన్"లో ఉన్న సహజమార్గ సాధన యొక్క సూక్ష్మ పరిచయం మాత్రమే.

దివ్య విభూతి అయిన నా బాబూజీ, నా ఈ కలంలో ఎటువంటి శక్తి, సామర్థ్యాలను నింపారంటే, నా రచన కేవలం ఒక రచనలాగా కాకుండా దివ్య దృష్టి యొక్క చిహ్నంగా (Symbol of Divine Sight) ఉండాలి అని. ఈ రచన ద్వారా సాధనలోని ఆది నుంచి అనంతం వరకుగల యాత్ర యొక్క దశల వివరణ విషయంలో 'వారు' తమ దివ్య పరిశోధన (Divine Research) ద్వారా ఏవైతే స్థితులు స్పష్టంగా నాలో కల్పించారో, అవి అనంతం లేదా భూమా వరకుగల రహస్యాలను సమస్త మానవాళి ప్రయోజనం కొరకు ప్రకాశింపజేసి ధన్యంజేశాయి. ఏ రోజునైతే దివ్యత్వంతో పరిపూర్ణంగా ఉన్న 'వారి' మానవ రూపం నేను నా ఇంటి ప్రాంగణంలో దర్శనం పొందానో ఆ రోజునే నా మానవ జన్మ ధన్యమయ్యింది. ఆ రోజున "బిటియా! నేను కూడా నీ కొరకు వెదుకుతూ ఉన్నాను" అన్న 'వారి' దివ్య వాక్కును అందరూ వినాలని మరొక్కసారి అలాగే 'వారు' అనాలని నా హృదయవాణి ఈ రోజున కూడా 'వారి' సమక్షంలో ప్రార్థితురాలిగా నిలబడి ఉంది. నా ప్రార్థనలోని ఈ మాటలు 'వారి' ఎదుట శిరస్సు వంచి ఏమి అంటున్నాయని అంటారా! అయితే వినండి. ఆధ్యాత్మిక క్షేత్రంలో **సహజమార్గ సాధన యొక్క మొదటి సిట్టింగ్‌లోనే, "హృదయం ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశిస్తోంది" అని బాబూజీ అభ్యాసులకు చెప్పారు.** అక్కడి నుండి సాక్షాత్కారం యొక్క పరమానందం, ఆ తర్వాత 'భూమా' యొక్క వైభవ దేశం (సెంట్రల్ రీజియన్)లో ఈదటం (స్విమ్మింగ్) వంటి దివ్య స్థితిని అనుగ్రహిస్తారు. ఆ అనంత స్థితిలో బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పం అను నావలో పయినింపజేస్తూ భూమా యొక్క ద్వార స్పర్శను కల్పిస్తారు. ఆ స్పర్శలో అభ్యాసీకి తన స్వంత ఉనికి కూడా తెలియలేనంత స్వేచ్ఛగా అతడు మరపుస్థితిలో ఉంటాడు. ఓ బాబూజీ! అటువంటి ఆ రోజు తప్పక వస్తుంది. ఎందుకంటే, ఈ అవని మీద తమ అవతరణ సమస్త మానవాళి యొక్క సంక్షేమం కోసమే జరిగింది. మిమ్మల్ని తమలో ఇముడ్చుకొని హృదయం యొక్క ఆంతరిక ఆర్తి సార్థకమైంది. మీ దివ్యాగమన ప్రభావం కారణంగా ఇప్పుడింక మానవ హృదయాలు నిరంతర స్మరణ యొక్క స్థావరాలుగా అయిపోతాయి. సహజమార్గం యొక్క దశ నియమాల ఔన్నత్యంలో మునిగి ఇప్పుడు అందరికీ దివ్య సాక్షాత్కారం సంభవమవుతుంది. మీరు చెప్పిన ఈ దివ్య వాక్కు– **"మానవ హృదయం ఆదిశక్తి యొక్క అంశ రూపం (Part of Adi-Shakti)"** అన్నది ఇప్పుడు సహజంగానే సిద్ధి పొందుతుంది. "హృదయం అన్నింటికీ మించిన మిత్రుడు" అని శ్రీ బాబూజీ మహరాజ్ వచించిన దివ్య వాక్కు. ఈ హృదయం ఎప్పుడైతే సహజమార్గ సాధన ద్వారా ఉన్నత దివ్య దశకు చేరుకుంటుందో, అప్పుడు ప్రతి ఒక్కరి ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు సహాయకారిగా ఉండి, మానవ జీవితంలో సత్యయుగాన్ని అనగా ఈశ్వరీయ జీవనాన్ని ప్రవేశపెట్టుంది. సమర్థ లాలాజీ సాహెబ్ యొక్క ప్రార్థనా ఫలితంగా శ్రీ బాబూజీ మహరాజ్ భూమా యొక్క అనంత శక్తికి ప్రతిరూపంగానే ఈ పృథ్వీమీద అవతరించారు. ఈ కారణంగానే, ఆదిశక్తి యొక్క శ్రేష్ఠతలో మునిగియున్న 'వారి' దైవిక సంకల్పమే, 'వారి' ఆది–మనస్సు రూపంలో మానవ మాత్రుల హృదయాలతో దివ్య యోగం

చెందింది. అరే! ఇదేమిటి? నా కలం నా చేయి విడిచిపెట్టుకుపోయింది, అంటే, నేను మున్ముందు ఇంకేమి వ్రాయగలను? అయితే ఇది గమనించండి –నా కలం నా చేయి విడిచిపెట్టి దివ్య పురుషుడు, నా బాబూజీ చేతిలో ఇమిడిపోయింది.

భూమా అంశ రూపుడైన ఆ మహనీయుని అవతరణ యొక్క మహిమాన్విత పరిచయాన్ని, ఆ దివ్య విభూతియే స్వయంగా మన ఎదుట ప్రత్యక్షమై స్వయంగా తన పరిచయాన్ని కల్పించకపోతే దానిని వ్రాయటం ఎవరికి సాధ్యమవుతుంది. అవతార పురుషుల పరిచయమైతే మనకు ఋషులు, మునులు ద్వారా లభిస్తూనే ఉంది. శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క దివ్య పరిచయం, తమ దైవిక సాహసంతో భూమా (అల్టిమేట్) సంపన్నులైన ఆదిశక్తి అంశాన్ని ధరిత్రిమీదకు తీసుకువచ్చిన ఆ మహానుభావుని రూపంలో ఉంది. ఇంకా చెప్పాలంటే, సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ (ఫతేఘర్, ఉత్తర ప్రదేశ్)గారి పవిత్ర నామం శ్రీ రామచంద్రజీ మహరాజ్. బహుశా **వారి** జననం ఈ దివ్య కార్యం పూర్తి చేయటానికే అయి ఉంటుంది. ఆ మహనీయ సద్గురువు కేవలం 'సంత్‌మత్'కు అలంకారంగానే కాకుండా వాస్తవానికి **వారు** ఒక సెయింట్‌గానే జన్మించారు. ఈ విషయం నేను **వారి** జీవిత చరిత్ర చదివిన తర్వాతనే గ్రహించాను. **వారు** దృఢ సంకల్పం కలిగినవారే కాకుండా చాలా సమతుల్యం (Balanced), వినమ్రత మరియు మధుర కంఠస్వరం కలిగినవారు. ప్రకృతి ద్వారా **వారి** గురువుకు నిర్దేశించిన దైవకార్యాన్ని పూర్తిచేసే పనిని **వారు** (లాలాజీ) తమ భుజస్కంధాలమీదకు మోపుకున్నారు. స్వయంగా ఏడు నెలలు అలుపు ఎరుగని తపస్సులో లీనమైన **వారి** ప్రార్థన ఎప్పుడైతే భూమా చరణాలను స్పర్శించిందో, అప్పుడే దాని ఫలితంగా భూమా అంశతో ఉన్న శ్రీ బాబూజీ మహరాజ్, ఆదిశక్తి యొక్క వైభవంతో కూడిన దివ్య సౌందర్యంతో ఈ పుడమిని ప్రకాశవంతం చేసింది. ఆ దివ్యత్వం **వారికి** వరప్రసాదంగా ఆది-గురు, సమర్థ, సద్గురువు అను బిరుదులతో సత్కరించటం అప్పుడే సంభవమైంది. ఇంకేమి వ్రాయను! ఇది ఆధ్యాత్మిక సౌందర్యంతో యుగాన్ని అలంకరించటానికి ఈశ్వరీయ శక్తి ధారతో సంపన్నంగా ఉన్న 'వారి' దివ్య సంకల్పం యొక్క స్వల్ప పరిచయం మాత్రమే!

## 4. శ్రీ రామచంద్ర మిషన్

శ్రీ రామచంద్ర మిషన్ యొక్క వైభవం అంతా దివ్య పరిచయంలోనే ఇమిడి ఉంది. మిషన్‌కు చెందిన ఆంతరిక సహజమార్గ సాధన ద్వారా పొందబడిన దశల గురించి 'వారు' నా ఉత్తరాలకు ఇచ్చిన జవాబుల్లో సూక్ష్మాతి సూక్ష్మమైన దశల గురించి స్పష్టంగా వివరించి, ఆధ్యాత్మిక సాహిత్యాన్ని ఐదు భాగాల **"అనంత యాత్ర"** పుస్తక రూపంలో సమస్త మానవాళి హితంకొరకు ఒక అమూల్య నిధిగా శ్రీ బాబూజీ మహరాజ్ సమర్పించారు. (ఆధ్యాత్మిక విషయాలు కస్తూరీ బెహెన్ మరియు శ్రీ బాబూజీల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు అనంత యాత్ర యొక్క 5 భాగాలుగా రూపొందాయి.) శ్రీ బాబూజీ యొక్క దివ్య పాదపద్మాల స్పర్శను పొందిన ఈ అనుభవసరిత, మానవ హృదయాలను పరిశుద్ధం చేస్తూనే మెదడులో శ్రేష్ఠమైన ఆలోచనలను కల్పిస్తుంది. అంతే కాకుండా, భావనల్లో ఏకత్వం యొక్క మాధుర్యాన్ని (Sweet-ness of oneness) నింపుతుంది. సహజమార్గ సాధన యొక్క ప్రతి గడపనూ అనగా అది ధ్యానం

కావచ్చు, నిర్మలీకరణ కావచ్చు, రాత్రి సమయంలో ప్రార్థన కావచ్చు –వాటిని దాటడంతోనే కలిగిన అనుభవంలో నేను ఆ అనంతం యొక్క దైవిక పరిచయానికి చెందిన దర్శన్నానే పొందాను. ఆంతరికంలో దైవిక సామీప్యత యొక్క వెచ్చదనం పొందుతూ ఉండగా, "నీవు వారి సామీప్యతలో పెరుగుతున్నావు" అని అది నాకు చెప్తున్నట్లు ఉంది. ధ్యానం యొక్క ద్వారంలో ప్రవేశించగానే మన అంతరంగంలో తొణికిసలాడుతున్న ఈశ్వరీయ ప్రకాశంలో మునిగి ఉన్న ఈశ్వరీయ మెరుపు, సహజమార్గపు ధ్యానం యొక్క యదార్థతను సజీవ పరిచయాన్ని ప్రదానం చేస్తుంది. సాయంకాలపు నిర్మలీకరణ గడప దాటగానే, మనకు హృదయం యొక్క విశుద్ధ దర్పణంలో దైవిక దర్శనం యొక్క మాధుర్యపు పరిచయం లభిస్తుంది. రాత్రి చేసే ప్రార్థన యొక్క గడప దాటగానే ప్రార్థన, దాని నిండుదనాన్ని తెలియజేసి, మనకు సంపూర్ణతకు చెందిన పరమ స్థితి యొక్క పరిచయాన్ని ప్రదానం చేస్తుంది. ఆ తర్వాత ఏమి జరుగుతుందో తెలుసా? అయితే వినండి! ధ్యానం, మనలో దర్శనం అనగా సాక్షాత్కారం యొక్క క్షణిక దృశ్యాన్ని నింపుతుంది. నిర్మలీకరణ, ఈశ్వరీయ దర్శనపు సవ్వడి యొక్క సంతోషకరమైన వార్తను ఇస్తుంది. ఆ తర్వాత ప్రార్థన, మన ఆంతరికాన్ని 'వారి'ని కలిసే సమాచారం యొక్క (Intense craving) తీవ్ర తపనలో లయంచేసి హృదయమను స్వచ్ఛ దర్పణంలో దైవ సాక్షాత్కారం కొరకు సంపూర్ణంగా తయారుజేస్తుంది. ఈ దైవిక దశ ప్రాప్తించిన తర్వాతనే బాబూజీ నాకు ఏమి వ్రాశారంటే, "ఇప్పుడు 'సహజ–మార్గం' యొక్క దర్శనమైతే పూర్తయ్యింది. ఇంక సత్యపద్‌తో అనుసంధానమైన సహజ–ధారలో ప్రవేశం పొందిన అభ్యాసీ యొక్క యాత్ర స్వయంగానే (శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పానుసారంగా) భూమా యొక్క దివ్య వైభవ కేంద్రమైన సెంటర్ రీజియన్ అనగా కేంద్ర మండలంవైపు ముందుకు సాగిపోతుంది" అని.

ప్రస్తుతం 'వారు ఎవరంటే' అనే యదార్థత యొక్క విషయం కూడా నా సమక్షంలో వ్యాపించి ఉంది. నా ఈ పుస్తకంలో శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క గుణ విశేషాల పరిచయం, నా బాహ్య చక్షువుల ద్వారానే సంపూర్ణంగా గ్రహించబడింది. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఈ పరిచయం ముఖ్యంగా 'వారి' భౌతిక స్వరూప దర్శనానికి సంబంధించినది అని చెప్పవచ్చు. అయితే 'ఆ దివ్య సౌందర్యం' అను పేరుతో ఉన్న నా పుస్తకం మాత్రం నా అంతః చక్షువుల ద్వారా మాత్రమే 'వారి' దివ్యత్వ పరిచయాన్ని కూడా అందరి కోసం సమక్షంలో ఉంచగలిగింది. ఇంకా చెప్పాలంటే, అంతిమం లేదా భూమా యొక్క వైభవ కేంద్రం సెంటర్ రీజియన్ (కేంద్ర మండలం)లో ఈత (స్విమ్మింగ్) గురించి వ్రాయటానికి నా కలం 'వారి' చరణాల ముందు తల వంచి 'వారి' దివ్య సంకల్పంతో దివ్య దృష్టిని సహాయంగా పొంది ప్రాణిమాత్రులకు వెల్లడి చేసింది. ఇప్పుడు నా కలం మూగపోయింది. ఎందుకంటే, ఎప్పుడైతే దృష్టివిహీన దృష్టి (అనగా కనుచూపుకు అందని చూపు) భూమా యొక్క వ్యాప్తి పొందటం కోసం దాని సప్త వలయాలలో ప్రవేశించిందో, అప్పుడు శ్రీ బాబూజీ దివ్య దృష్టిని ప్రసాదించారు. దాని మూలంగా నా కలం అక్కడి తమ్ అవస్థ యొక్క సమస్త పరిచయాన్ని వ్రాసిన తర్వాత స్వయంగా అంతర్నేత్రాలను కోల్పోయినట్లుగా సంకేతాన్ని ఇచ్చి, మౌనం వహించింది. ఇప్పుడు నిస్సహాయ కలం ఏమి వ్రాయగలదు? ఎందుకంటే, ఇప్పుడు ఆ భూమా యొక్క సజీవ అంశ అయిన శ్రీ బాబూజీ పరిచయాన్నే పొంది, నిరాడంబరత మాటునే దాగి ఉండిపోయింది.

# 5. సహజమార్గ సాధనా పద్ధతి

సహజమార్గంలో సాధన ద్వారా మొదటి రోజు, మొదటి సిట్టింగ్ నుండియే, నేను పొందిన అనుభవం ఏమిటంటే, ఇది ఈ మార్గం యొక్క సహజ దర్శనం అంటే తాత్త్వికత (Philosophy) మరియు సాధనకు ప్రాణం, అని. **అభ్యాసంలో మనకు "ఈశ్వరుడు నీ హృదయంలో కొలువై ఉన్నాడు. 'అతని' ప్రకాశంతోనే నీ హృదయం అంతా వెలుగుతో నింపబడింది. నీవు దానిలో మునిగి ఉన్నావు" అని ధ్యానంలో ఉంచమని చెప్పబడింది.** ఈ అభ్యాసం యొక్క సహజ సూక్ష్మత, 'సాధ్యం' అనగా మనం సాధించవలసిన దైవ సాన్నిధ్యం అయి ఉంది. దీని సాక్షాత్కారం కొరకే మనం సహజ సాధన లేదా దానిని ధ్యానంలో నిలుపుకోవటం ఆరంభించాము. దానితోపాటుగానే **"హృదయం ఈశ్వరీయ ప్రకాశంలో మునిగి ఉంది" అని అభ్యాసం చేయటం చాలా మహనీయమైనదిగా ఉంటుంది.** ఈశ్వరీయ ప్రకాశం యొక్క ధ్యాస ఎంతెంత గాఢంగా ఉంటుందో, అంతంతగానే ఈశ్వరుని కొరకైన తపన, హృదయం మరియు సంపూర్ణ శారీరిక వ్యవస్థ నుంచి భౌతికత్వాన్ని కరిగించి బయటకు పారద్రోలుతూ ఉంటుంది. దాని వలన మన హృదయం మరియు శారీరిక వ్యవస్థ దివ్య ప్రకాశంతో ప్రకాశించ నారంభమవుతాయి. అప్పుడింక ఈశ్వరీయ సామీప్యత యొక్క వెచ్చదనం మరియు ఆనందం నిరాఘాటంగా అనుభవమవుతూ ఉంటాయి. ఈ కారణంగానే సాధన ప్రారంభించిన కొద్ది కాలంలోనే ఈశ్వరుడు మన లోపలనే ఉన్నాడు అని ధ్యానంలో నిలుపుకోవటం ద్వారా అంతరంగంలో మనకు **దివ్య ఆకర్షణ (Divine attraction)** యొక్క అనుభూతి కలుగుతుంది. ఈశ్వరీయ ప్రకాశం మన ఆంతరికంలో వ్యాపించి ఉండటం వలన ఆ ఆనందం మరియు పవిత్రత, మన ధ్యానం యొక్క (Attention) ధ్యాసను నిరంతరం అంతర్ముఖంగా చేస్తూ ఉంటుంది. వృత్తులు అంతర్ముఖమవుతూనే సాధన సిద్ది పొందటం అనేది ఒక గొప్ప విషయం.

క్రమంగా ఇప్పుడు ధ్యానం యొక్క శాశ్వత కేంద్రం, అంతరంగంలో ఉన్న ఈశ్వరుడే అవుతాడు. ఇంక అప్పటినుండి బాహ్య ఆకర్షణలు బలహీనపడుతూ ఉంటాయి. ఈ బాహ్య ఆకర్షణలు బలహీనపడిపోవటం మూలంగా ప్రాపంచికమైన కోర్కెలు తగ్గిపోతూ ఉంటాయి. అప్పుడు ఆంతరిక ధ్యానంలో నిరంతరం మునిగి ఉండే అభ్యాసం సహజంగానే అలవడుతుంది. ధ్యానంలో కలిగే ఆనందం మరియు ఆ ఆనందంలో కూడా ఈశ్వరీయ ధ్యానం నిలుపుకునే ఆంతరిక చైతన్యం, మనకు ఇప్పుడు **–"అతడు మనవాడు, మన హృదయంలోనే ఎంతో సమీపంగా నెలవై ఉన్నాడు" అని 'వారి' ఆత్మీయత యొక్క స్వచ్ఛమైన అనుభూతిని ప్రదానం చేస్తుంది.** మనతో ఇంత సన్నిహితంగా ఎవ్వరైనా ఉంటూ ఉన్నప్పుడు ఆనందానుభూతి నేరుగా అతని జాడ తెలుపుతూ ఉంటుంది. ఆంతరిక తపన వారి జ్ఞాపకాన్ని అంటిపెట్టుకునేట్లుగా చేస్తుంది. చివరకు దైవం యొక్క ఆత్మీయ అనుభూతితో ముడిపడిన జ్ఞాపకంతో హృదయంలో దైవాన్ని కలవాలను కోర్కెను ఉత్పన్నం చేస్తుంది. ఇప్పుడు 'సాధన' అను శబ్దం యొక్క అర్థం అంతర్ దశా రూపంలో మన హృదయంలో వెల్లడవుతుంది. 'సాధ్' యొక్క అర్థం కోరిక అయితే 'న' యొక్క అర్థం 'లేదు' అని. పూర్తి శబ్దం 'సాధన' అంటే కోరిక లేకుండా ఉండటం అని. ఈ అంతర్ దశ అరుస్తూ ఏమి చెబుతుంది అంటే,

మీ సాక్షాత్కారం పొందటంతప్ప నాకు మరే కోరికా లేదు, అని. దాని ఫలితంగా హృదయం యొక్క కోర్కె అంతర్గతంగా ఎక్కడో తపనకు జన్మను ఇచ్చి దైవ సాక్షాత్కారంలో యోగింపజేస్తుంది. జన్మ అంటూ ఉన్నాక అభివృద్ధి అనేది తప్పనిసరి అనేది ప్రకృతి ధర్మంగా ఉంది. ఇటువంటి అంతర్దశ ప్రాప్తించటం వలన మన సహజమార్గ సాధన మనకు సహజసిద్ధంగా (Natural) ఉంటుంది. అనగా మనం ఇప్పుడు ధ్యానం నిలుపుకోనవసరం లేకుండా ఈశ్వర ధ్యానం స్వతహాగానే ఉంటుంది. ఇప్పుడు రెండింతల లాభం లభిస్తుంది. అవి ఏమిటో చూడండి! ఎప్పుడైతే ధ్యానం స్వతహాగానే ఉంటుందో, అప్పుడు దివ్య ఆకర్షణ (Divine attraction) దానిని స్వయంగా తనలో నింపుకుంటుంది. ఇంక అప్పటినుండి అంతరంగం అంతా ఈశ్వరీయ ప్రకాశంతో మెరిసిపోతుంది. ధ్యానమైతే దైవం యొక్క గుమ్మంమీదనే నిలకడగా ఉంటుంది. ఎప్పుడైతే ధ్యానం అక్కడే నిలిచి ఉంటుందో, అప్పుడింక ఆ దివ్యాకర్షణ మన ఆంతరికాన్ని దైవిక సౌందర్యంతో అలంకరిస్తూ ఉంటుంది. ఇంక అప్పటి నుండి మనం ధ్యానం నిలుపుకోవటం మరియు నిర్మలీకరణ అను ప్రక్రియల నుంచి క్రమంగా విముక్తులమైపోతూ ఉంటాము. అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ తమ ఉత్తరంలో నాకు ఇలా వ్రాశారు: “ధ్యానం అయితే ఇప్పుడు నీ నుండి జరగదు. ఎందుకంటే, ఎప్పుడైతే దశ అనేది అభ్యాసం కంటె తేలికైనదిగా ఉంటుందో, అప్పుడు అభ్యాసం యొక్క భారం సహింపలేనిదిగా ఉంటుంది. ఎప్పుడైతే ఆంతరికం అంతా ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశించ నారంభమవుతుందో, అప్పుడింక నిర్మలీకరణ అవసరం ఏమి ఉంటుంది?” అని. సహజమార్గ సాధనా పద్ధతి తన గురించి ఇంకా ఏమి వివరించగలదో మీరే చెప్పండి!

ఇంకా వినండి. దైవిక ఆకర్షణ మన ఆంతరికాన్ని దైవిక సౌందర్యంతో అలంకరిస్తూ ఉంటూ, అది మనల్ని ఈశ్వరునితో కలయిక కోసం సంసిద్ధం చేస్తూ ఉంటుంది. ఈ సంసిద్ధత యొక్క పేరు ‘భక్తి’ అనగా ‘భక్తి’ జనిస్తుంది. హృదయంలో భక్తి ఉత్పన్నమైన తర్వాత ధ్యానం అనేది తన స్థానాన్ని భక్తికి అర్పించి తాను స్వయంగా భక్తిలో లయమైపోతుంది. మన ఆంతరికం స్వయంగానే ఆత్మ నివేదన దశలో మునిగి ఉండి ఈశ్వరుని సమక్షంలో తన్మయం చెందుతూ ఉంటుంది. ఇంకా ఏమిటంటే, సాక్షాత్కారం పొందటం కోసం నిరంతరం ప్రార్థిస్తూ ఉంటుంది. ఈ విధంగా సహజమార్గ సాధన యొక్క మూడు మెట్లు –ధ్యానం, నిర్మలీకరణ మరియు రాత్రి ప్రార్థన, అన్నింటి యొక్క (Last-link) అంతిమ బంధాన్ని కూడా మరచిపోతూ ఉంటుంది. అనగా ఇప్పుడింక ప్రార్థన చేయాలను ధ్యాస కూడా లేకుండాపోతుంది. ఎందుకంటే, ప్రార్థన యొక్క సారాంశమైన ఆత్మ నివేదన దశలో ప్రవేశం పొందాక మన ఆంతరికం నిరంతరం ప్రార్థనలో నిమగ్నమైపోయి, తనను తానే మరచిపోయిన స్థితిలో జలకమాడుతూ ఉంటుంది. నేను గ్రహించిన యదార్థం ఏమిటంటే, ఈ సహజమార్గ సాధనకు వెన్నెముక మన బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సంకల్పం, అని. ఆ దివ్య సంకల్పమే మానవమాత్రుల హృదయాలను తన దివ్య ప్రాణాహుతి శక్తి ద్వారానే ఈశ్వర ప్రాప్తికి యోగ్యంగా తయారు చేస్తూ ఉంటుంది. ‘వారి’ దివ్య సంకల్పం వలన ప్రవహించే ఈశ్వరీయ ధార యొక్క నిరంతర ప్రవాహమే అభ్యాసీని దైవ సాక్షాత్కారానికి యోగ్యునిగా చేస్తుంది. ఇది మనం సహజమార్గ విధానంలో ప్రవేశం పొందటానికి మనకు ప్రథమ సిట్టింగ్ నుంచే ప్రాప్తిస్తూ

ఉంటుంది. ఇంతేకాదు, శ్రీరామచంద్ర మిషన్‌లో 'వారి'చేత తయారు చేయబడిన ప్రశిక్షకులే 'వారి' దివ్య శక్తి యొక్క శ్రేష్టతకు మరియు గొప్పదనానికి సజీవమూర్తులుగా నిలుస్తారు. ప్రథమంగా సంపూర్ణ దివ్య శక్తి ప్రవాహం ద్వారా అభ్యాసీ హృదయాన్ని పరిశుద్ధంగా చేస్తారు. ఆ తర్వాత హృదయాలలో భక్తి ప్రకాశాన్ని నింపి, ప్రశిక్షకుని హృదయాన్ని దివ్యశక్తితో యోగింపజేసి అభ్యాసులకు ఆధ్యాత్మిక శిక్షణ నివ్వటానికి అనుమతిని ఇచ్చే విషయం ఎంత గౌరవమైనదో కదా! హృదయంలో భక్తి యొక్క ప్రకాశాన్ని నింపిన తర్వాత, ఈశ్వర ప్రాప్తి కొరకైన కోరికను పవిత్రవంతంగా చేస్తూ అభ్యాసుల వ్యవస్థను ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశింపజేసి దివ్య శక్తితో అనుసంధానం చేయటమను విషయంలో ఆధ్యాత్మిక సాహిత్యం మరియు భక్తి సాహిత్యం పూర్తిగా మౌనంగా ఉండిపోయాయి. ఇప్పుడు దివ్య విభూతియైన శ్రీ బాబూజీ మహరాజ్ ఈ మౌనాన్ని శాశ్వతంగా సమాప్తం చేశారు. సమస్త మానవాళికి పవిత్ర ప్రాణాహుతి ద్వారా ఆధ్యాత్మిక శిక్షణ నివ్వడం కోసమని ప్రశిక్షకులను దివ్య శక్తి ద్వారా తయారుచేసిన 'వారి' సహజమార్గ సాధన పద్ధతి, ఆధ్యాత్మిక సాహిత్యం యొక్క శిరస్సును గౌరవాన్వితం చేసింది. ఈ యుగం 'వారి'ని దివ్య పురుషుని రూపంలో స్వీకరించి తన నుదుట మీద 'వారి' పవిత్ర పాద ధూళిని బొట్టుగా ధరించి తనను సౌభాగ్యవంతంగా చేసుకుంది. పతనావస్థలో ఉన్న నేటి యుగంలో మన ఆది గరువులు సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్, ఆదిశక్తి అనగా భూమా యొక్క ముఖ్య కేంద్రం నుంచి శ్రీ బాబూజీ మహరాజ్ వంటి దివ్య (విభూతి) పురుషుడ్ని ఈ అవని మీద అవతరింపజేశారు. ఆ ఆనందంతో వారిలోనే లయమైపోయారు. 'వారి' ప్రేమ యొక్క ఈ దృష్టాంతం దానికి అదే అనుపమానం, సాటిలేనిది, అద్వీతీయమైనది మరియు శాశ్వతంగా ఉంటుంది.

ఋషులు, మునుల యొక్క ప్రార్థన మూలంగా ఈ భూమిమీద అవతారాల అవతరణ అవతరించటమూ, ఏ పని కోసమైతే ఆ అవతారాలు అవతరించాయో ఆ పని ముగించుకుని అవి వెళ్ళిపోవటమూ జరిగింది. వారు సాధించిన ఘనకార్యాల ద్వారా వారి పరిచయం మనకు పవిత్ర గ్రంథాలైన 'శ్రీ రామచరితమానస్', 'సూరసాగరం' మొదలైన ఇతర గ్రంథాల ద్వారా తెలుస్తూ ఉంది. వాటిని మనం ఇప్పటికీ చదువుతూనే ఉన్నాం. ఎవ్వరైతే ఆ దివ్య అవతారాల గురించి తెలుసుకుని వారితో మమేకమయ్యారో వారికి భగవంతుడు లభ్యమయ్యాడు. అయితే ఇటువంటి ఆధ్యాత్మిక శిక్షణతోపాటుగా ప్రాణాహుతి శక్తి ప్రవాహంతో మానవమాత్రుల ఆత్మోద్ధరణ అను సంకల్పంతో వచ్చిన శ్రీ బాబూజీ మహరాజ్ వంటివారు ఇంతకు పూర్వం ఎవ్వరూ రాలేదు. అందువల్లనే ఆధ్యాత్మిక సాహిత్యం ఆ విషయంలో మౌనంగా ఉండిపోయింది. ఇటువంటి దివ్య పురుషుని యొక్క పరిచయం ఎన్నడూ, ఎవ్వరికీ లభించలేదు. దివ్య ఆధ్యాత్మిక స్థితుల అనుభవంలో మునిగి ఉండి ఎవ్వరు మాత్రం 'వారి' గురించి వ్రాయగలుగుతారు. **ఇప్పుడు ఆది నుంచి అంతిమ సత్యం (భూమా) వరకుగల శ్రద్ధ, భక్తి, ప్రేమ మరియు అనంత యాత్ర వరకు ఉండే దివ్య అనుభూతులతో నిండి ఉన్న నా ఉత్తరాలు, శ్రీ బాబూజీ సమాధానాల సంగ్రహం "అనంత యాత్ర" యొక్క 5 భాగాలు మానవులందరి హితం కొరకు, ఆధ్యాత్మిక క్షేత్రంలో నా బాబూజీ యొక్క దివ్య కానుకగాను, అనుపమానమైనవిగాను ఉన్నాయి. భూమా వరకుగల సంపూర్ణ అనుభూతులతో కూడిన "అనంత యాత్ర" అయిదు సంపుటాల రచనతో నా కలం ధన్యమైంది. నా బాబూజీ పాదాల**

**ధూళిని తన నుదుట దాల్చుకుని వారి హస్తకమలాల స్పర్శను పొందటంవల్లనే నా కలానికి ఇది సంభవమయ్యింది. దాని ఫలితంగానే సహజమార్గ సాధనా పద్ధతి ద్వారా దానిలోని ఆధ్యాత్మిక శిక్షణ యొక్క వైభవాన్ని కూడా రంగరించుకున్న నా ఈ రచన, అందరి ఆత్మ కళ్యాణం కొరకు ఈశ్వరీయ ద్వారంవద్ద ద్వారపాలకునిలాగ నిలిచింది. 'వారి' ప్రేమతో వెల్లడైన రహస్యాలను అందరి మేలుకొరకు విశదం చేయటానికి నా కలం దీక్ష బూనింది. ఇదంతా వ్రాయించేది నా బాబూజీ మాత్రమే.** ఈ యదార్థం కూడా ఎలా నిరూపితమైందో చూడండి! నా సమక్షంలోకి వచ్చిన దివ్య లేఖనాన్ని విశదపర్చటంలో నా మెదడు లేక హస్తం కూడా ఎప్పుడైనా అలసిపోతాయి. అయినప్పటికీ 'వారి' ఇష్టానుసార రూపంగా ఉన్న 'వారి' ఈ కుమార్తె తనపై రూపొందించబడిన 'వారి' దివ్య పరిశోధనలు, సహజంగానే ఎదుట ప్రత్యక్షం కావటం చూసి తన్మయత్వంతో మైమరచిపోయి కలంచేతబట్టి వ్రాయటానికి కూర్చుండిపోయింది. అంతేకాదు, అలా కూర్చుండి పోతుంది కూడ.

సహజమార్గ సాధనా పద్ధతి యొక్క వైభవం గురించి ఏమైనా చెప్పటం అసంభవమే. ఎందుకంటే, ఈ సాధనను తనదిగా స్వీకరించిన తర్వాత, మన ఆంతరికంలో మార్పు చెందుతూ ఉన్న దశ, ఆలోచనలసరళి మరియు ధ్యానంలో నిమగ్నమైన అనుభవం మాత్రమే చెప్పగలదు. ఎందుకో తెలుసా? ఎందుకంటే, సాధన ద్వారా పొందబడిన అనుభవమే చెబుతుంది. ఎలాగంటే, మానసిక వృత్తుల ఆత్మిక వికాసంలో ఊర్ధ్వముఖంగా మరలిన వృత్తులు తమలో తాము ఎప్పుడూ ఇదే చెబుతూ ఉంటాయి. ఏమని అంటే, "ఉత్తమ జాతికి చెందిన చాతక పక్షి నేలపై పడిన నీరు త్రాగదు. నీలిమేఘాల నుండి జాలువారిన నీటినే త్రాగుతుంది, దానితోనే శరీరం తడుపుకుంటుంది" అని. ధ్యానం చేయటం లేదా ధ్యానంలో మగ్నమై ఉండటంవలన కలిగే అనుభవం ఇలా చెప్పింది: ఇప్పుడు ఆంతరిక దృష్టి (Watchman) ద్వారపాలకునిలాగా తయారై, బాహ్య రంగులను ఆంతరికంలో ప్రవేశించకుండా నిరోధిస్తుంది. ఎందుకంటే, ఈశ్వరీయ రంగులో రంగరించుకున్న మన ధ్యానం మన ఆంతరికాన్ని దివ్య రంగుతో అలంకరిస్తూ ఉంటుంది. ఇంతే కాకుండా, ఇప్పటివరకు ప్రాపంచిక దృష్టితో రమించి ఉన్న ధ్యానంలో ప్రాపంచిక రంగు ఏదైతే నింపబడి ఉన్నదో అది అంతా క్రమంగా మన ఆంతరికంలో ఈశ్వరుని ధ్యానంలో నిలుపుకుంటున్న అభ్యాసం ద్వారా శీఘ్రంగా తొలగిపోతూ ఉంటుంది. ఇంక మన ఆంతరికం ఈశ్వరీయ రంగు అనగా ఈశ్వరుని జ్ఞాపకంతోనే రమిస్తూ ఉంటుంది. బహుశా ఇటువంటి సందర్భంలోనే భక్త మీరా "గిరిధర గోపాలుడే నా వాడు, ఇంకెవ్వరూ కాదు" అని గానంచేసి ఉంటుంది. ఈ భావనతోనే లేదా అనుభవంతోనే కవి సూరదాసు స్వరం –"(మహా జ్ఞాని ఉద్ధవుని జ్ఞాన బోధలకు బదులుగా గోపికలు ఇలా అంటున్నారు:) ఓ ఉద్ధవా! మా దగ్గర పది, ఇరవై హృదయాలు ఉంటే అది వేరే విషయం అనవచ్చు. కాని మా దగ్గర ఉన్న ఒకే ఒక్క హృదయం, శ్యామసుందరుడినే (కృష్ణుడినే) ప్రేమించి అది అతడికే అర్పితమైపోయింది. మరి ఈశ్వరునికి ఇవ్వడానికి హృదయం ఎక్కడ ఉంది" అని గానంచేసి ఉంటుంది. సోదరులారా! యదార్థం ఏమిటంటే, ఈశ్వరుని చేరాలను ఆంతరికంలోని బాధ, ఆంతరికంలో ఈశ్వరుని కలవాలనే ప్రేరణ ఇచ్చే అనుభవం మన రచనల్లో పెల్లుబుకుతూ ఉంటుంది. అప్పుడే ఒక సంత్ వ్రాసింది నా ఎదురుగా ప్రత్యక్షమై, అనుభవ

రూపంలో, "రాముడు వచ్చాడు ఇంటికి, తిరిగి వెళ్ళిపోయాడు. కాని నేను నిద్రలేచి పాదాలు పట్టుకోలేకపోయాను" అని వాపోయి ఉంటాడు. ఇలా ఎందుకు జరిగింది అంటారా! అయితే వినండి. ఎందుకంటే, "కన్నులు నిద్రమత్తులో మూసుకొని (వారి ధ్యానంలో ఉంటూ) మేల్కొనలేదు." ఇంకా బాగా ఇలా కూడా చెప్పవచ్చు: మన హృదయాంతరంలో నెలకొని ఉన్న ప్రియుని ఎప్పుడైతే మన అనుభవం చూస్తూ తన్మయత్వంలో మగ్నమై ఉండిపోతుందో, అప్పుడింక దానిని మరల (భౌతిక) స్పృహలోకి ఎవ్వరు తీసుకురాగలరు. స్పృహలోకి రానివాడు (భౌతికంగా) ఏమి దర్శించగలడు!

శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా సహజమార్గానికి ఈ శ్రేష్టతలు కూడా లభించాయి. **"సహజమార్గ విధానంలో నేను పవిత్ర సోదర భావాన్ని ప్రాణప్రదంగా పూరించాను" అని బాబూజీ చెప్పారు.** 'వారు' చెప్పిన ఈ మాటలు మన అభ్యాసీ సోదర సోదరీలు తమ ఉన్నతిని పరిశీలించుకోవటానికి ఈ అనుభవానికి ప్రాధాన్యత నిచ్చారు. మనలో ఈ విషయం స్వతస్సిద్ధంగానే ఉత్పన్నమవుతుంది అనగా అంతరంగంలో ఈ సోదర భావం దానంతట అదే వృద్ధి చెందుతూ ఉంటుంది. **ఈ సాధనలో ప్రవేశించినమీదట కూడా మన హృదయంలో ఈ భావం కలగటం లేదంటే మనం సహజమార్గ సాధనను సరిగ్గా స్వంతం చేసుకోలేకపోయామని అర్థం చేసుకోవాలి. మనల్ని మనం తూకం వేసుకోవటానికి ఇది ఒక తక్కెడ వంటిది (లేదా మనల్ని మనం కొలుచుకోవటానికి ఇది ఒక కొలబద్ద వంటిది) అని కూడా చెప్పారు.** ఎందుకంటే, అందరి ప్రయోజనార్థం బాబూజీ యొక్క దివ్య సంకల్పమే దీనిలో అనగా ఈ సాధనలో బీజరూపంలో ఉంది. ఈ సోదర భావం అనేది ఎటువంటిదో చెప్పాలంటే, బసంత పంచమి ఉత్సవానికి వెళ్ళి షాజహాన్‌పూర్‌లో ఎన్ని రోజులు గడిపినప్పటికీ, అభ్యాసులు (పరస్పరం) తమలో తాము ఈ ప్రేమ భావాన్ని పంచుకుని రమించిపోయిన కారణంగా తమ ఇంటి ధ్యాస ఎంత మాత్రమూ కలిగేది కాదు. మరి అలా జరిగితీరవలసిందే కదా! హృదయంలో ఈశ్వర ప్రాప్తి అనేది లక్ష్యమై ఉంది, దానిని పూర్తి చేయటానికి శ్రీ బాబూజీ యొక్క దివ్య ప్రాణాహుతి ప్రవాహం పొందుతూ ఉండగా, ఆ పరమానందానుభూతి యొక్క అనుభవం మనల్ని వైరాగులుగా తయారుచేసి వేస్తుంది. **మన సహజమార్గ సాధనా పద్ధతి యొక్క వైభవం, శ్రీ బాబూజీ యొక్క ప్రాణాహుతి శక్తి ప్రవాహంవల్లనే అని మన అనుభవంలో ప్రత్యక్షమవుతుంది.**

సహజమార్గ సాధనయే స్వయంగా ధ్యానం యొక్క విశిష్టతను నా రచన ద్వారా ప్రతిభావంతం చేసింది. ఈ పద్ధతిలో సర్వవ్యాపియైన ఈశ్వరునితో మన ధ్యానం లేదా ధ్యానం యొక్క సుఖానుభూతిని జోడించి ఉంచే అభ్యాసంతో, నిరంతర స్మరణతోపాటుగా నిరంతర ధ్యానంలో ఉండేట్లుగా కూడా అనుగ్రహం పొందగలుగుతాం. ఇంకొక రకంగా చెప్పాలంటే, **నిరంతర స్మరణ అను అభ్యాసం ద్వారానే నేను నా హృదయంలోను, నా అంతర్ దృష్టిలోను ఆ అంతర్యామియే వ్యాపించి ఉన్నట్లుగా ఒకరోజున అనుభూతి చెందాను.** ఆ తర్వాత ఇంక నా అనుభూతి నుంచి నా దృష్టి మరలనే లేదు. దాని ఫలితంగా ఎప్పుడైతే నాకు శ్రీ బాబూజీ మహరాజ్ కృపతో హృదయంలో దైవీయ సామీప్యత యొక్క వెచ్చదనం అనుభవం కలిగిందో, అప్పటి నుంచి 'కస్తూరీ' యొక్క పూర్తి అస్థిత్వమే కరిగిపోయింది. అప్పుడింక మిగిలింది ఈశ్వరుడు మాత్రమే. అప్పుడు ఈశ్వరుడు ఏమి చేస్తాడు? ఆఖరికి 'వారి' మహనీయ శక్తి, కరిగిపోయిన మొత్తం

భౌతికతను నా అస్థిత్వం నుంచి బయటకు విసిరేసింది. ఇంక మిగిలింది కస్తూరీ యొక్క నిర్మల హృదయమే. అప్పుడు ఈ మిగిలి ఉన్న దానియొక్క అవశేషాన్ని కూడా ధ్యానం ద్వారానే తమలో లయం చేసుకోవటం ఆరంభించారు. వాస్తవంలో ఈ దివ్య దశ, శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన ఈ మాట "ఇప్పుడు 'మాలిక్'లో జీవించు (Live in Master) అనగా ఈశ్వరీయ దశలో ప్రవేశం లభించింది" అనే దాని యదార్థతను సమస్త మానవాళికి ప్రకటితం చేసింది. ఇప్పుడింక ధ్యానం యొక్క దశ మనల్ని పరమానందంలో ముంచి ఉంచుతుంది. అప్పుడే శ్రీ బాబూజీ మహరాజ్ నాకు, "ఈశ్వరునిలో నీ లయావస్థ ప్రారంభమైంది" అని వ్రాశారు. "లాలాజీ నిన్ను ఇంకా ముందుకు తీసుకువెళ్తారు. నీకు ఇవే నా ఆశీస్సులు" అని చెబుతూనే "చివరకు ఆదికి అనంతంతో యోగం లభిస్తుంది (Beginning gets united with Infinite)" అని వ్రాశారు. ఇది దైవం పంపిన ప్రేరణ మరియు ధైర్యం అని నేను గ్రహించాను. ఇంకా చెప్పాలంటే, అది మాయాజాలంతో మంత్రముగ్ధులను చేసినట్లుగా హృదయాన్ని ప్రభావితం చేసిందని నేను గుర్తించాను. ఎందుకంటే, ఆ తర్వాత నేను నా అడుగులు వెనక్కి తీసుకోలేదు మరియు వెనక్కి తిరిగి చూడలేదు. శక్తిలో అనంత శక్తి ఎప్పటి నుంచి క్రమంగా కలిసిపోయిందో, ఈ దివ్య రహస్యం మరియు శ్రీ బాబూజీ మాయాజాలం అని నేను అర్థం చేసుకోలేకపోయాను. కేవలం ఇది మాత్రం అర్థం చేసుకోగలిగాను, ఏమిటంటే, 'వారు' ఇచ్చిన ధైర్యం, నాకు లక్ష్యానికి మధ్యనున్న దూరాన్ని తగ్గించుతూ పోయింది అని.

**"ప్రార్థనయే కాదు, సహజమార్గ విధానమే పై నుంచి దిగి వచ్చింది" అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు.** దీనిని అలంకరించటంగాని, సౌందర్యంగా తీర్చిదిద్దటంగాని జరగలేదు. అయితే దీనిలో ప్రవేశించాక ఎప్పుడైతే నా సాధన సాధించవలసిన దానితో యోగం చెందిందో, అప్పుడు నేను నా సహజమార్గం యొక్క వాస్తవిక పరిచయాన్ని తెలుసుకోగలిగాను. అది ఏమిటంటే, దివ్య శక్తి నుంచి ప్రవహించిన శాశ్వతమైన నిరంతర ధార ఏదైతే ఉన్నదో అది బాబూజీతో యోగించి ఉన్న సహజమార్గ సాధనా పద్ధతిలో, అభ్యాసుల శ్రేయస్సుకొరకు దివ్య సౌందర్యంతో నింపుకొని ప్రవహిస్తోంది అని. **నేను ఇప్పుడు ఇంకొక రహస్యం కూడా గ్రహించాను. అది ఏమిటంటే, ఈ సాధనా పద్ధతి ద్వారానే శ్రీ బాబూజీ నన్ను దైవంతో నిరంతర యోగం ప్రసాదించారు అని. దానితో నేను సహజధార రూపంలో సహజమార్గం యొక్క స్వచ్ఛమైన జ్ఞానాన్ని పొందాను.** సోదరీ సోదరులారా! నేను నా బాబూజీ యొక్క దివ్యశక్తి మీద ఆధిపత్యం కలిగి ఉన్న ఈ చిన్న పరిచయాన్ని మాత్రమే మీ సమక్షంలో ఉంచగలిగాను.

ఇప్పుడు ఒక యదార్థం స్పష్టమవుతుంది. అది ఏమిటంటే, దివ్యమైనది ఏదైనా సరే, అది అందరికీ సంబంధించి ఉంటుంది. ఎందుకంటే, 'అతడు' (All Pervading) సర్వవ్యాపి, (Omni Potent) సర్వశక్తివంతుడు మరియు (Omni-Present) సర్వాంతర్యామిగా ఉండి అందరి హృదయాల్లో విరాజిల్లుతున్నాడు. అందువలన సహజమార్గ సాధనా పద్ధతిలో ధ్యానమే కావచ్చు, నిర్మలీకరణమే కావచ్చు లేదా ప్రార్థనయే కావచ్చు, అన్నింటికి ఆధారం ఈశ్వరునితో యోగం చెందటానికే అవుతుంది. ఎప్పుడైతే నేను సహజమార్గ సాధనా పద్ధతిని అనుసరించి పూజ్య మాస్టర్ ఈశ్వర సహాయ్‌గారి నుంచి మూడు సిట్టింగ్‌లు తీసుకున్నానో అప్పుడు నా అంతరంగంలో ఏదో చైతన్యం, ఏదైతే అప్పటివరకు సుషుప్తావస్థ

(నిద్రావస్థ)లో ఉందో అది పూర్తిగా సచేతనమైంది. అప్పటి నుంచి నా ఆంతరిక మనస్సు ఎవ్వరినో అన్వేషించటంలో మగ్నమైపోవటానికి ఇదే కారణమని అనిపించింది. ఇంక అప్పుడే నా అంతరంగంలో తపన యొక్క జాడ లభించింది. ఈ దశను గురించి నేను శ్రీ బాబూజీ మహరాజ్‌కు వ్రాసిన మీదట **'వారు' మన సహజమార్గంలో ప్రాణాహుతి ప్రవాహంవలన నిద్రాణమై ఉన్న దివ్య చైతన్యం, దైవిక ప్రాణాహుతి శక్తిలో స్నానమాడి జాగృతమవుతుంది, అని వ్రాశారు. అప్పటి నుంచే ఈశ్వరునితో సంబంధం ఏర్పడుతుంది.** ఇంకా ఏమిటంటే, బుద్ధి వ్యర్థ విషయాలను గురించి ఆలోచించటం స్వతహాగానే తగ్గిపోతూ ఉంటుంది. ధ్యానంలో కూర్చున్నప్పుడు ఇతర ఆలోచనలు తలదూర్చే అవకాశం నిలిచిపోతుంది. అప్పుడింక దివ్య విషయాలను గురించి అవగాహన ఉత్పన్నమవుతుంది. ఇంతే కాకుండా, ప్రశిక్షకుని ద్వారా బాబూజీ నుంచి మన హృదయంలోకి నిరంతరం ఈశ్వరీయ ధారా ప్రవాహం పొందుతున్నందువలన మన ఆంతరికంలో దర్శనం (సాక్షాత్కారం) పొందాలను తపన ఏర్పడుతుంది. అది బుద్ధి యొక్క పరిపూర్ణ స్థాయిని చేరుకుంటుంది. దాని ఫలితంగా ఏ విధంగానైతే సాగరంలో వచ్చే తరంగాల నురుగు సాగరంలోని మురికిని బయటకు తోసివేస్తూ ఉంటుందో, అదే విధంగా ఈశ్వరీయ ధార (ప్రాణాహుతి) యొక్క తరంగాలు హృదయం మరియు బుద్ధిని అలముకున్న అవాంఛితాల నన్నింటినీ బయటకు నెట్టివేస్తూ వాటిని శుద్ధంగాను, తేజోమయంగాను చేస్తుంది. ఇంక అప్పటి నుంచే మన అంతరంగంలో విలసిల్లుతున్న ఈశ్వరీయ ప్రకాశం మన హృదయంతోపాటు పూర్తి వ్యవస్థలోను వ్యాపించటం మొదలవుతుంది. ఎక్కడైతే ఈశ్వరీయ ప్రకాశం వ్యాపిస్తుందో, అక్కడ భౌతికత యొక్క అంధకారం నిలువజాలదన్న రహస్యం నాకు ఇప్పుడు అవగాహనకు వచ్చింది. ఈ కారణంగానే, ఈశ్వరీయ సామీప్యతానుభూతి ద్వారా, స్మరణ, క్రమంగా అప్పటి నుంచే మనకు ఆనందమయంగా అనిపిస్తూ ఉంటుంది. అంతరిక శక్తి అనవసర ఆలోచనలను లోపలి నుంచి బయటకు నెట్టివేయటం వలన మన హృదయం స్వయంగా నిరంతర స్మరణలో మునిగి ఉంటుంది. మనస్సు గతి ఊర్ధ్వంగా అవుతుంది. మనస్సు, బుద్ధిల దైవిక కలయిక వలన అనవసరమైనవి అన్నీ వాటంతటవే మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతూ ఉంటాయి. అప్పటి నుంచే మన బాబూజీ మనల్ని అహంభావ స్పర్శ నుంచి కూడా విముక్తం చేస్తూ ఉంటారని నేను అనుభూతి చెందాను. ఇటువంటి ఆంతరిక విశుద్ధ అవస్థను పొందిన తర్వాతనే నా గీతంలోని ఈ పంక్తి గళమెత్తింది. అది ఏమిటంటే,

**"హమ్ కొ పరమానంద మేఁ రఖా హై తుమ్‌నె కిస్ కదర్,**
**హెూష్ వీరానా మగర్ థే గీత్ గాయె కిస్ కదర్,**
**దేశ్ జబ్ ప్రియ్ కా థా ఆయా, ఢూండ్ తె ఖుద్ కొ రహె।"**

"పరమానందంలో నీవు నన్ను ముంచిన వేళ
పరవశించి మత్తులో గానంచేసిన వేళ
ప్రియుని దేశం రాగానే వెదుక్కుంటున్నాను నన్ను నేనే"

అనగా నీవు పరమానందంలో నన్ను ముంచిన వేళ నన్ను నేనే మరిచాను, నీ దేశం చేరగానే నన్ను నేనే వెదుక్కుంటున్నాను (మరపుస్థితి) అని అర్థం.

శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసీకి ధ్యానంలో నిలుపుకోవాల్సిన లక్ష్యం ఏమి చెప్పారంటే, "హృదయంలోనే ఈశ్వరుడు ఉన్నాడు" అని. నిరంతర స్మరణ ద్వారా ఎప్పుడైతే హృదయంలో ఈ లక్ష్యం లోతుగా నాటుకుపోతుందో, అప్పటినుంచి ఈ అనుభూతియే మన స్వరూపంగా మారిపోతుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఆ అనుభూతియే అభ్యాసీగా మారిపోతుంది. ధ్యానంలో నిమగ్నమైన హృదయం మరియు 'వారి' సాన్నిధ్యం యొక్క అనుభూతి, అభ్యాసీ యొక్క ప్రాణంగా అయిపోయి ఈశ్వరప్రాప్తి అను లక్ష్యానికి హత్తుకుపోతుంది. ఇప్పుడింక నా కలానికి –"నేను ఉన్నప్పుడు నీవు లేవు. ఇప్పుడు నీవు ఉంటే నేను లేను" అని వ్రాయకతప్పటం లేదు. ఈ దశను సహజమార్గం యొక్క దివ్య అద్భుతం (Divine Miracle) అని అనాలా లేక దివ్య ప్రేమ అని అనాలా! ఎవరో కవి నా ఈ దశ యొక్క రూపాన్ని తన కవితలో వర్ణించి నా కలానికి చేకూర్చారు.

**"బల్ న ఛుటె కాలే బాలోంసే అరువై (ఓఢ్) సె ఫరియాద్।**

**పల్ భర్ మణి న ఛుటె కాలే (నాగ్) సె ముఝ్‌సే తేరీ యాద్॥"**

అనగా నల్లని కురులు ముడి నుండి తొలగవు, పెదవుల నుండి విన్నపం వీడదు, సర్పం నుండి మణి వీడదు క్షణమైనా, అలాగే నా నుండి నీ జ్ఞాపకం వీడదు అని అర్థం.

ధ్యానం తన లక్ష్యమైన ఈశ్వరునిలోనే మమేకమై ఉండగా పాపం అనుభూతి ఏం చేస్తుంది! అప్పుడే "జ్ఞాపకం ఎలా ఉండాలి అంటే, ఎప్పుడూ తిరిగిరానంతగా" అని శ్రీ బాబూజీ చెప్పిన మాట దశ రూపంలో మనలోపల అవతరిస్తుంది. ధ్యానం హృదయంలోపలికి చొచ్చుకుపోయి ఈశ్వరునితో కలిసి ఉండగా అంతరంగంలో నిద్రించి ఉన్న తపన మేల్కొంటుంది. అప్పుడు అంతర్దశ ఏ విధంగా అయిపోయింది అంటే, నేను కూర్చున్నా, నిద్రిస్తున్నా, పండుకుని ఉన్నా, లేచి నిలబడినా, ఎప్పుడు చూసినా నేను ఆ నివాసం అనగా గమ్యాన్నే చూస్తున్నాను. ఇప్పుడు నేను ఎటువంటి దశను పొందాను అంటే, నా ధ్యానమైతే దాని గమ్యాన్ని చేరుకుంది. అనగా అది ఎవరి ధ్యానంలో ఉందో, వారిలోనే వ్యాపించి పోయింది. జ్ఞాపకం కూడా నన్ను విడిచిపోయింది. ఇప్పుడు ముందు ఉన్న దశ మారుతోంది. అది ఏమిటంటే, ఇది దృష్టికి రాగానే నా కలం తపనతో ఈ దశను గురించి–

**"తడప్ కొ దేఖా తడపతా, ప్యాస్ ఖుద్ కొ పీ గయీ"**

అనగా తపన తపిస్తూ ఉండటం చూసి దప్పిక దప్పికనే త్రాగేసింది, అని వ్రాసింది. ఇంకా ఏదైతే మిగిలి ఉన్నదో దానిని నా బాబూజీ దివ్య సౌందర్యంగా అలంకరించి తమ దివ్య దృష్టిలో నింపుకున్నారు. సోదరులారా! యదార్థం ఏమిటంటే, ప్రియతముని (దైవం) జ్ఞాపకాన్ని మరిచిన బాధనైతే నేను భరించగలిగాను. కాని దశ యొక్క సూక్ష్మత్వం నాకు ఏమి చెప్పింది అంటే, ఇప్పుడు దైవంతో కలయిక ఈ బాధను నా నుండి తొలగించింది. మరి ఇప్పుడు అది (బాధ) ఎక్కడికి పోవాలి, ఏమి చేయాలి. ఎందుకంటే, జ్ఞాపకం కూడా దీనిని వదిలేసి సాక్షాత్కారం యొక్క దివ్యత్వంలో మునిగిపోయింది ఎందుకో తెలుసా? ఎందుకంటే, ఇక్కడి నుండే దానికి (బాధకి) దివ్యత్వంతో వియోగం (Separation) కలిగింది. శ్రీ బాబూజీ యొక్క ప్రాణాహుతి శక్తి సహాయంతో ఈశ్వరుని కొరకు వెతుకుతున్న మనస్సు వెదికి పట్టుకొంది. ఈశ్వరుని కొరకు విరహ వేదన అనే ఈ దివ్య కృపా రత్నానికి దైవ సాక్షాత్కారం కొరకు సాధన చేస్తున్న ప్రతి అభ్యాసీ హృదయంలోను స్థానం కల్పించాలని నేను నా బాబూజీ మహరాజ్‌ని ప్రార్థిస్తున్నాను.

"నిర్మలీకరణ" అనేది ఈ సాధన యొక్క మహనీయమైన రెండవ భాగంగా ఉంది. ప్రాపంచికంగా శుభ్రత పాటించటం కోసం మనకు అనేక బాహ్యాచరణలు ఉన్నాయి. అయితే ఆంతరిక నిర్మలీకరణ కోసం కేవలం ఆధ్యాత్మికంగా మాత్రమే ఉంది. సహజమార్గ సాధనా పద్ధతిలో ఈ ఆంతరిక నిర్మలీకరణ విధానం ఏమిటో చూద్దాం. సహజమార్గాన్ని అనుసరించిన మొదటి రోజు నుండే "ఈశ్వరుడు హృదయంలో ఉన్నాడు" అను ధ్యాసను నిలుపుకోవటంవలన ఆంతరిక దృష్టి క్రమక్రమంగా హృదయంలో ఈశ్వరునితోనే సంబంధం కలిగి ఉన్న ఆనందాన్ని పొందుతూ ఉంటుంది. దీనివల్లనే మన హృదయం నిరంతరం నిర్మలంగా అవుతూ ఉంటుంది. సాయంత్రం వేళ చేసే నిర్మలీకరణ విధానం ఏమంటే, మన సమక్షంలో విరాజిల్లుతూ ఉన్న బాబూజీ ద్వారా ప్రాణాహుతిని పొందుతూ అభ్యాసులమైన మనం "సాక్షాత్కారం పొందటంలో ఏవైతే ఆటంకాలు ఉన్నాయో అవన్నీ వెనుక నుండి బయటకు వెళ్ళిపోతున్నాయి. ఇంక మన హృదయం పరమ శుద్ధంగా అవుతోంది" అని భావిస్తాము. ఆంతరిక శుద్ధికైన కోర్కె మరియు సంకల్పం, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సంకల్పానికి చెందిన దివ్యశక్తితో అనుసంధానం కావటంచేత వెంటనే హృదయం శుద్ధి అవుతున్న అనుభూతి మనకు కలుగుతంది. ఈ సందర్భంలో మన ఆధ్యాత్మికోన్నతి కొరకు ఒక ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. అది ఏమిటంటే, మన వలన ఎటువంటి చెడు కలగకుండా మన ప్రయత్నం నిరంతరం కొనసాగుతూ ఉండాలి. ప్రయత్నం, కోరిక, వీటికి తోడుగా దైవ సంకల్ప శక్తి యొక్క ఆధారం మనకు లభించినట్లయితే నిర్మలీకరణ యొక్క అనుభూతి మనకు కలుగుతూనే ఉంటుంది. ఇంకా ఏమిటంటే, సాక్షాత్కారం పొందే దివ్య దశ, భక్తిని సరళంగాను, సహజంగాను మరియు సులభంగాను చేస్తుంది. ప్రాణాహుతి శక్తి ద్వారా పరిశుద్ధమైన హృదయం వాస్తవంగా దానిలో ఈశ్వరుడు ఉన్నాడను అనుభూతికి వాస్తవిక దశ యొక్క రూపాన్ని కల్పిస్తుంది. దానితో క్రమంగా హృదయం ఈశ్వరీయ అనుభూతి యొక్క దివ్యానందంలో తన్మయం చెందుతూ ఉంటుంది. ఈ తన్మయత్వం యొక్క మధురానుభూతి హృదయంలో భక్తికి జన్మ నిస్తుంది. దీనివలన సహజమార్గ సాధన సరళంగాను, సులభంగాను అవుతుంది. క్రమంగా ధ్యానాన్ని నిలిపి ఉంచే స్మరణ, నిరంతర స్మరణ యొక్క పరమానందంలో మునిగి, ఇంక పైకి రావడానికి ప్రయత్నించదు. ఎందుకో తెలుసా? ఎందుకంటే, హృదయం అవధూత గతిని పొంది పరవశించిపోతూ ఉంటుంది. మళ్ళీ ఎప్పుడైతే మానసిక ప్రవృత్తికి ఈ అవధూత గతి యొక్క స్పర్శ కలుగుతుందో, అప్పుడు అది తరచుగా ప్రాపంచిక స్పృహను కోల్పోతుంది. ఇటువంటి దశలోనే బాబూజీ, 'వారు' ఎక్కడ ఉన్నా సరే, నా చెంతనే ఉన్నట్లుగా అనుభూతి చెందటమే కాకుండా, 'వారు' సమయోచితంగా నా స్పృహను చైతన్యపరుస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. అది ఎలాగంటే, ఎప్పుడైనా నేను స్పృహలేక వస్త్రధారణలో నిర్లక్ష్యం వహించినా కూడా నా కుటుంబ సభ్యులు ఎవ్వరూ ఆ లోపాన్ని గుర్తించటం జరగలేదు. ఇంకా ఏమి జరిగేది అంటే, ఈ దశ ఇంకా తీవ్రంగా ఉన్నప్పుడు బాబూజీ తమ చేతితో నన్ను తట్టి, చైతన్యపరిచినట్లుగా కూడా నేను అనుభూతి చెందాను. అయితే మూడు రోజులు మాత్రమే నన్ను ఈ పరమానంద దశలో నిలిపి, తర్వాత నన్ను ముందుకు తీసుకు వెళ్ళారు. ప్రతి ఆధ్యాత్మిక దశలోను 'వారి' సంరక్షణ ఈ విధంగా ఉండి అభ్యాసీని అదుపులో పెట్టుతూ ఉంటుంది.

## 6. ప్రశిక్షకుడు

నేను గమనించినది ఏమిటంటే, సహజమార్గంలో శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసీని ప్రశిక్షకుని రూపంలో, అభ్యాసీ సోదర సోదరీల ఆత్మిక సేవకోసం తయారుచేస్తారు, అని. నిజానికి ప్రపంచంలో ఇది ఒక సాటిలేని దివ్య కార్యానికి నిదర్శనంగా ఉంటుంది. శ్రీ బాబూజీ యొక్క దైవిక ఇచ్ఛా ఫలితంగా ఎప్పుడైతే అభ్యాసీ ఎవరైన సరే, అతని హృదయంలో ప్రేమ, భక్తి తత్పరత యొక్క సంబంధం ఈశ్వరీయ ధార (ప్రాణాహుతి) యొక్క నిరంతర ప్రవాహాన్ని పొందటానికి యోగ్యంగా అవుతుందో, అప్పుడు ఆ అభ్యాసీ యొక్క హృదయ సంబంధాన్ని, వాతావరణంలోనే ఉంచి, వాతావరణాన్ని (Nature) ప్రకృతిని అనుసరించి పరిశుద్ధం చేస్తూ ఉండే ఈశ్వరీయ శక్తి కేంద్రంతో యోగం కల్పించి దానిమీద తమ ఆజ్ఞ యొక్క ముద్రను వేసేవారు. అనగా ప్రశిక్షకునిగా (ప్రిసెప్టర్‌గా) అనుమతించేవారు. ఎందుకో తెలుసా? ఇది కూడా 'వారి' దివ్య మహిమయే అని చెప్పాలి. అయితే వినండి. అలా ఎందుకంటే, అభ్యాసీ హృదయం ఈశ్వరీయ శక్తి ప్రవాహాన్ని పొందాలి, కాని ప్రశిక్షకునిలో ఉన్న మానవ సహజమైన లోపాలు అక్కడే ఉండిపోవాలి మరియు అభ్యాసీ హృదయం పరిశుద్ధతవైపుగానే ముందుకు పురోగమించాలి. ప్రశిక్షకుడు, ధ్యానంలో నిమగ్నమై లేదా హృదయంలో 'వారి' జ్ఞాపకంలో మునిగి ఉండగా, ఈశ్వరీయ ధారా ప్రవాహం (ప్రాణాహుతి) అభ్యాసీ హృదయంలోకి ప్రవేశిస్తుంది, దాని వలన అభ్యాసీ హృదయంలో సాక్షాత్కారం పొందటంలో ఏవైతే అడ్డంకులు ఉన్నాయో అవి అన్నీ కూడా నిర్మూలించబడి బయటకు పోతున్నట్లుగా భావించుకోమని చెప్పేవారు. ఆ తర్వాత పరిశుద్ధం కాబడిన అభ్యాసీ హృదయం ప్రాణాహుతి ప్రభావంతో భక్తి మరియు ప్రేమలో మునిగి ఉంటున్నట్లుగా ప్రశిక్షకుడు భావించుకోవాలి. ఇటువంటి ప్రశిక్షణ చాలా ఫలప్రదంగా ఉంటుంది అని నేను గ్రహించాను. ప్రేమ మరియు భక్తిలో మునిగి పరస్పర సంభాషణలు, వార్తలు చేసుకుంటూ ఉంటే, మనలో పవిత్ర సోదరభావం యొక్క సహజ యోగం ప్రసాదించబడుతుంది అని 'వారి' పాదాలను ఆశ్రయించి ఉన్న నేను గ్రహించాను. ఇంతే కాకుండా, మనం బాబూజీ చరణాలవద్ద ఎన్ని రోజులు ఉన్నప్పటికీ కూడా ఈ ఆత్మిక యోగం మనల్ని మరపుస్థితి నుంచి బయటకు రానివ్వదు. **దివ్యశక్తిమీద 'వారి' ఆధిపత్యం ఎటువంటిది అంటే, ఇంటికి తిరిగి వెళ్ళినప్పుడు, అనుభూతి చెందిన దశతోపాటు 'వారి'ని కూడా వెంట తీసుకొని వెళ్ళినట్లుగా అనిపించేది.** వాస్తవంగా సహజమార్గ సాధనా పద్ధతి శ్రీరామచంద్ర మిషన్ యొక్క పావన, (Divine symbol) దైవిక ప్రతీకగా రూపొంది, మానవ మాత్రులకు ఈశ్వర సాక్షాత్కారం యొక్క దివ్య సందేశాన్ని ఇస్తూ ఉంటుంది. 'వారి' దివ్య శక్తితో రూపొందించబడిన ప్రశిక్షకులు, మానవ హృదయాలలో ఈశ్వర ప్రాప్తి కొరకైన కోరికను అధికం చేస్తూ ఉంటారు. ఇక్కడ ఒక విషయం తప్పనిసరిగా చెప్పాలి. అది ఏమిటంటే, వాస్తవంగా మన లయ-అవస్థ ప్రారంభమైనమీదట స్వతహాగానే అటువంటి దశ వస్తుంది. అప్పుడు శ్రీ బాబూజీకి అభ్యాసులకు ఆధ్యాత్మిక సేవ చేసేందుకు మనకు అనుమతి ఇవ్వటం గురించిన ఆలోచన కలిగి సంతోషించేవారు. కాని ఇలా ఎప్పుడు జరిగింది అంటే, నేను 'వారి'కి నా దశను గురించి -"బాబూజీ! భక్తి యొక్క తన్మయత్వం ఎలా

ఉందంటే, భక్తియే స్వయంగా భగవంతునిలో మునిగి తన్మయమైపోయి స్పృహ కోల్పోయినట్లుగా అనిపిస్తోంది. నేను ఎక్కడ కూర్చున్నా సరే, ఎక్కడికి వెళ్ళినా సరే, నా నాలుగువైపులా శక్తి ప్రవాహం నా నుండి వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది" అని వ్రాశాను. అప్పుడు దానికి సమాధానంగా బాబూజీ ఇలా వ్రాశారు: "వాస్తవంగా ఇప్పుడు నీవు స్వయంగా ప్రశిక్షకురాలి దశలో ఉన్నావు. ఎందుకంటే, ఎప్పుడైతే శక్తి ప్రవాహం నీ నుండి వ్యాపిస్తూ ఉందో అప్పుడు ఇతరులకు ఆధ్యాత్మిక వికాసం నిమిత్తం నీ ద్వారా పని జరిపించటంకోసం ఇప్పుడు ఆజ్ఞ ఇవ్వవలిసి ఉంటుంది. అప్పుడు ఆ శక్తి సద్వినియోగమవుతుంది" అని. ఇంకా ఏమి వ్రాశారంటే, "ఈ శక్తి నీవు లయ-అవస్థలో ఉన్న కారణంగా నీలో ఉన్నది. ఎప్పుడైతే ఈ శక్తి కూడా నీలో లయమైపోతుందో అప్పుడు నీకు ఈ శక్తిమీద ఆధిపత్యం కలుగుతుంది. నా నిస్సహాయత ఏమిటంటే, ప్రశిక్షకుడు ఈ స్థాయికి చేరేవరకు ఆజ్ఞ ఇవ్వకుండా నిరీక్షించలేను. ఇలా నిరీక్షించినట్లయితే, నేను నా జీవిత కాలంలో బహుశా నేను ఒకరు లేక ఇద్దరు అభ్యాసులకు మాత్రమే ప్రశిక్షణ కార్యం నిర్వహించేందుకు ఆజ్ఞ ఇవ్వగలుగుతాను. నా ముందు మిషన్ యొక్క పని మరియు మానవ మాత్రుల హితం కొరకు దివ్య సంకల్పాన్ని పూర్తి చేయాల్సి ఉంది. నేను నా లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞుడను. ఎందుకంటే, వారు నీలో ఆ శ్రేష్ట స్థితిని చూడగల అదృష్టాన్ని నాకు ప్రసాదించారు" అని. మానవ మాత్రుల శీఘ్ర ఆధ్యాత్మికోన్నతి కొరకు ఈశ్వరీయ శక్తి యొక్క పరిమిత వలయాలతో అభ్యాసీ హృదయాన్ని అనుసంధానంచేసి ఇతర అభ్యాసుల సేవ కొరకు తయారుచేసే బాధ్యతను కూడా చేపట్టారో, అటువంటి దివ్య పురుషుడు ఈ పృథ్విపై ఎప్పుడైనా అవతరించారేమో మీరే చెప్పండి! 'వారి' ద్వారా తయారుకాబడిన ప్రశిక్షకులు ఎవ్వరైనా "ఈశ్వరీయ ధారా ప్రవాహం, ఎదుట కూర్చుండి ఉన్న అభ్యాసుల హృదయంలోకి ప్రవహిస్తున్నది" అను ఆలోచన చేస్తారో అప్పుడు ఆ దివ్య శక్తి యొక్క నియమిత కేంద్రం నుంచి ప్రాణాహుతి ప్రవాహం ప్రారంభమవుతుంది. శక్తి నుండి పని తీసుకోవటం అనేది ప్రశిక్షకుని కర్తవ్యంగా ఉంటుంది. బహుశా అందుకే బాబూజీ చెప్పిన ఈ మాట- "నేను నిన్ను రోజంతా (24 గంటలు) ప్రిసెప్టరుగా తయారుచేయలేదు. పనిచేసే సమయంలోనే నీవు ప్రశిక్షకునివి. మిగతా సమయంలో నీవు భక్తిలో తన్మయం చెందే ప్రయత్నంలో నిమగ్నమై ఉండే అభ్యాసీవి మాత్రమే" అనేది యదార్థమవుతుంది. 'వారి' ఈ మాటల్లో ఒక చాతుర్యం దాగి ఉంది. అది ఏమిటంటే, 'వారి' ప్రశిక్షకుల్లో అహం ఉత్పన్నం కాకూడదు అని.

# 7. శ్రీ బాబూజీ దైవిక శిక్షణ

సహజమార్గంలో శ్రీ బాబూజీ యొక్క దైవిక శిక్షణ అని చెప్పుదునా లేక 'వారి' దివ్య సంకల్పం నెరవేరటానికని అభ్యాసీపట్ల వారికిగల ప్రేమ అని చెప్పుదునా! ఏమైనాగాని అది అద్భుతమైనది. అవధూత గతి (స్వంత మరుపుస్థితి) నుంచి ఉన్నతంగా తీసుకువెళ్ళిన తర్వాత నేను గ్రహించింది ఏమిటంటే, సహజమార్గ సాధనా పద్ధతిలో 'వారి' దైవిక శిక్షణ ప్రారంభమైంది, అని. వాస్తవానికి 'వారి' ద్వారా స్వయంగా 'వారి' ధ్యానంలోనే మునిగిన నా హృదయం, ధ్యానపు లోతులను ఎప్పుడైతే స్పర్శించటం జరిగిందో, అప్పటినుంచే నేను 'వారి' దివ్య దేశపు దశల పరిశోధన (Research) వివరాలు లభిస్తూ ఉండటం నేను గమనించాను. ఇప్పుడింక సహజమార్గ పద్ధతి ద్వారా సాధన సమాప్తమైపోయింది. ఇంక ధ్యానం యొక్క కేంద్రం స్వయంగా 'వారు'గానే అయిపోయారు. ఇప్పుడు శిక్షణా పద్ధతి దివ్యమైపోయింది. సహజమార్గ సాధన, 'వారి' చరణాలను ముద్దాడి నన్ను దైవిక శిక్షణ నిమిత్తం 'వారి' చరణాలకే సమర్పితం చేసి, సహజమార్గం యొక్క (Naturalness) సహజత్వానికి స్వయంగా వారే ప్రతీక అని నాకు చెప్పింది. ఇప్పుడింక నా కలం 'వారి' చరణ స్పర్శను పొంది వారికే సమర్పితమైపోయింది.

ధ్యానం యొక్క లోతులో పూర్తిగా మునిగి ఉన్న (నిమగ్నత) ధ్యాస (Concentration), భక్తిలో తన్మయమైన హృదయం ఎప్పుడైతే (Divine fomentation) దివ్య వెచ్చదనాన్ని నిరంతరం పొందుతూ ఉందో, అప్పుడు బాబూజీ నా ఉత్తరానికి జవాబుగా "నేను చాలా సంతోషిస్తున్నాను. ఎందుకంటే, లాలాజీ సాహెబ్ కృపవలన నీ లయ-అవస్థ ప్రారంభమైపోయింది" అని వ్రాశారు. శ్రీ బాబూజీ ద్వారా చెప్పబడిన లయ-అవస్థ మనకు ఎప్పటి నుంచి అనుభవం అవుతుందో ఇప్పుడు మీరు తెలుసుకొని ఉంటారు. అందుకనే ఇంత గాఢంగా ఉంటుంది దీని మహాత్మ్యం. శ్రీ బాబూజీ ద్వారా చెప్పబడిన ఈ అమూల్యమైన స్థితి ప్రారంభం కావటం, ఇప్పుడు నేను ఈశ్వర ప్రాప్తి కొరకు (గాడ్లీ రీజియన్) ఈశ్వరీయ దేశంలో నా స్థానాన్ని పొందాను అని చెప్పినట్లు అవుతుంది. ఇంతేకాదు, 'వారు' చెప్పిన ఈ మాటల యొక్క అద్భుత దర్శనం మరియు భూమా శక్తి మీద 'వారి'కి ఉన్న ఆధిపత్యం మనకు ఎప్పుడు తెలుస్తాయి అంటే, దివ్య సాక్షాత్కారం యొక్క పవిత్ర సమయం వచ్చినప్పుడు 'వారి' దివ్య ఇచ్ఛాశక్తిలో బంధించబడిన అహం యొక్క పదహారు వృత్తాలను కూడా విముక్తంచేసి, నాకు దివ్య సాక్షాత్కారం కల్పించి, ఈశ్వరీయ దేశంలో ఈశ్వరీయ శక్తి యొక్క ముఖ్య కేంద్రంలో లయం చేసినప్పుడు తెలుస్తుంది. ఇంతేకాదు, 'వారి' దైవిక శిక్షణ యొక్క పరాకాష్ఠతో కూడిన దర్శనం, ఏదైతే తమ పరిశోధన గురించి నాకు అనుభూతుల ద్వారా వ్రాయటానికని నాలో కల్పించారో, అది మరియు దివ్యదృష్టి, ఏదైతే సాక్షాత్కారం తర్వాత రాబోతున్న వాటి దర్శనం కొరకని నాకు ప్రసాదించారో -అవి ఇప్పుడు ఏమి చెబుతున్నాయో చూడండి! ఇంక దివ్య విభూతి, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క మహిమ ఏమిటో చూద్దాం! నన్ను ఈశ్వరీయ శక్తి యొక్క కేంద్ర బిందువులో మునక వేయించి, మానవ లక్ష్యం అయిన 'సాక్షాత్కారం' అనుగ్రహించి, ఆది-కేంద్రం అనగా అంతిమం దేశంలో ప్రవేశం కల్పించటానికి ముందు 'వారి' అనగా దివ్య విభూతి యొక్క అనంత క్షేత్రం అనగా కేంద్ర

మండలం (సెంటర్ రీజియన్) యొక్క ప్రవేశ ద్వారమైన సత్యపద్ మీద నన్ను ప్రతిష్టించారు. అప్పుడు ఇంకొక రహస్యం కూడా నాకు వెల్లడయ్యింది. అది ఏమిటంటే, సాధన మొదలుకొని క్రమంగా సూక్ష్మ మరియు సూక్ష్మాతి సూక్ష్మమైన అహంను కూడా 'వారు' నా నుండి తీసేసుకుంటూ ఈశ్వరీయ దేశం వరకుగల పదహారు వృత్తాలలో బంధించివేసి నాకు ఈ అహం నుండి పరమ విముక్తిని ప్రదానం చేస్తూ, ఈశ్వరీయ శక్తి యొక్క ముఖ్య కేంద్రంలో మునక వేయించారు. అప్పుడు అహం అక్కడే ఉండిపోయింది. ఇంక దానిని అనగా అహంను ఎక్కడ, ఎప్పుడు కలుస్తాను? అప్పుడు 'వారు' నన్ను అంతిమ సత్యం (అల్టిమేట్) యొక్క ఒడిలో సమర్పించటానికని నా అస్తిత్వాన్ని (ఐడెంటిటీ) స్వీకరించి తమ దివ్య సంకల్పంలో ప్రవేశపెట్టి కేంద్ర మండలం (సెంటర్ రీజియన్) యొక్క మహనీయ దేశంలో ఈదటం (స్విమ్మింగ్) ప్రారంభింపజేశారు. ఇప్పుడు ఈ దైవిక దృశ్యం చూసి నా కలం విస్మృతావస్థలో ఉండిపోయింది. ఆ దృశ్యం గురించి నేను శ్రీ బాబూజీ మహరాజ్‌కు ఇలా వ్రాశాను: "నాపైన పుష్పవర్షం కురుస్తోంది. అయితే ఆ పుష్పాల స్పర్శ నేను పొందలేకపోతున్నాను. కాని నాలో మెల్లమెల్లగా దివ్యశక్తి ప్రవేశిస్తున్నట్లుగా అనిపిస్తోంది" అని. దానికి జవాబుగా బాబూజీ ఇలా వ్రాశారు: "అవి దైవిక శక్తికి చిహ్నాలు కనుక నీవు ఆ పుష్పాలను స్పర్శించలేకపోతున్నావు. నేను చాలా సంతోషంగా ఉన్నాను. నా లాలాజీ సాహెబ్ నీకు అంతిమ సత్యపు 'సత్య దర్శనం' యొక్క దివ్య దశను ప్రసాదించుగాక!" అని. ఏ చిత్రకారుడైనా ఈ అద్భుత దివ్య చిత్రాన్ని ఎప్పుడైనా చిత్రించగలడా? 'వారు' ఈ కుమార్తె కోసమని ఈ దృశ్యాన్ని మళ్ళీ చూపించి ఉండకపోయినా గాని, ఈ కలాన్ని పట్టి ఉండకపోయినా గాని, అభ్యాసులు మరియు మానవ మాత్రులపట్ల 'వారి' ప్రేమను మరియు 'వారి' దివ్య కార్యాన్ని రచన ద్వారా వెల్లడించటం సాధ్యపడేది కాదు.

ఇటువంటి దివ్య అవతరణ ఈ ధరణి మీద ఎప్పుడూ జరిగి ఉండలేదు, మరి ఎప్పుడూ జరగబోదు. సాధనలో ఆది నుంచి అనంతం వరకు నాపైన పరిశోధన పూర్తిచేసి మానవ కళ్యాణం కోసం 'వారు' ఇంకేమీ పరిశోధన యొక్క అవసరం లేకుండా చేశారు. సాధనతోపాటుగా ప్రాణాహుతి శక్తి ప్రవాహాన్ని ఒక హృదయం నుంచి మరొక హృదయంలోకి ప్రవహింపజేసినటువంటి దైవిక శిక్షణ యొక్క అధిపతి ఎవ్వరైనా ఇంతకు ముందు ఎప్పుడైనా దిగి వచ్చారా? ఇటువంటి దివ్య మహిమ ఎన్నడైనా జరిగిందా అంటే లేదనే చెప్పాలి. ఎవ్వరికైతే ఆది–శక్తి మీద ఆధిపత్యం ప్రాప్తిస్తుందో అట్టివారే ప్రశిక్షణకు 'మాలిక్' అవుతారు. నేను నా ప్రతి పుస్తకంలోను ఇందుకు ప్రత్యక్ష ప్రమాణాలు ఇచ్చాను. బహుశా ఆదిశక్తి మీద ఆధిపత్యం పొందిన కారణంగానే ఇప్పుడు సహజమార్గ పద్ధతిలో (Method of training) ప్రశిక్షణ యొక్క ప్రక్రియ 'వారి' కృప మూలంగా మాత్రమే ప్రసాదించబడింది. మొట్టమొదటగా ఏ ఏ (Bondages) బంధనాలు (మాయ యొక్క పొర, అహం యొక్క అడ్డంకులు మొదలైనవి) ఈశ్వర సాక్షాత్కారం పొందటంలో అభ్యాసీ ఉన్నతికి అవరోధం కాగలవాటిని 'వారు' తొలగించి నిర్మలం చేశారు. ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ అందరి హితం కొరకు శాశ్వతంగా సమాప్తమైపోయాయి అని 'వారి' పరిశోధన ధృవపరిచింది. 'వారి' ఆధిపత్యం, తమ దివ్య ఇచ్ఛాశక్తి ద్వారా, దేని నుంచి అయితే విముక్తి చెందటం అసంభవంగా ఉండేదో, ఆ అహంను పదహారు వృత్తాలలో బంధించివేసి, మన అభ్యాసులకు సాధ్యంకానటువంటి దానిని 'వారే' స్వయంగా తమ

ఇచ్ఛాశక్తి ద్వారా బంధించివేసి మానవ మాత్రులకు విముక్తి కలిగించే బాధ్యతను తీసుకొన్నారనే ప్రమాణాన్ని ఇస్తోంది. ఇంకా ముందుకు వెళ్తే, సాక్షాత్కారం తర్వాత సత్యపద్ మీద ప్రతిష్ఠించి అభ్యాసీని అంతిమం యొక్క వైభవ కేంద్రమైన కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్)లో ప్రవేశింపజేయటం నేను గమనించాను. ఇంకా 'వారి' కృపకు నిదర్శనం ఏమిటంటే, 'వారు' తమ దివ్య సంకల్పం అను నావలోకి ఎక్కించి ఆ వైభవ ప్రాంతంలో ఈత (స్విమ్మింగ్)ను కూడా 'వారే' స్వయంగా చేయిస్తారు.

ఇప్పుడు ఇంకను ముందున్న దశ మరియు 'వారి' దైవిక శిక్షణ యొక్క చరమాంకంలోకి చేరి మన ఎదుట 'వారి' దివ్య మహిమ ఎలా చిత్రీకరించబడిందో చూద్దాం! ముందుగా తమ కుమార్తె అయిన కస్తూరీని ఈ భూమిమీద సాధారణమైనదిగా సంచరింపజేస్తూ, ప్రాపంచిక కార్యకలాపాలు, కర్తవ్యాలు, వ్యవహారాల్లో నిమగ్నమై ఉండునట్లుగా చేశారు. ఇది ఎటువంటి దివ్య అద్భుతమో చూడండి! అలా ఉంచుతూ కూడా నా అస్తిత్వానికి (ఐడెంటిటీకి) తమ దివ్య సంకల్పంలో ప్రవేశం కల్పించి కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్)లో ఈదించుతూ (స్విమ్మింగ్ చేయిస్తూ) తమ ప్రియమైన అనంత దేశపు యాత్రలోకి కూడా తీసుకు వెళ్తున్నారు. కేవలం 'వారు' ఇచ్చిన దివ్య దృష్టి ద్వారా మాత్రమే, నలభై సంవత్సరాలకు పూర్వం పొందిన దశలను మానవులందరి ప్రయోజనం కొరకు మీ అందరి సమక్షంలో వ్యక్తం చేయగలుగుతున్నాను. శ్రీ బాబూజీ యొక్క విశిష్ట దైవిక వ్యక్తిత్వం మన మధ్యన ఉంటూనే తమ ముఖ్య కేంద్రంతోనే అనుసంధానమై ఉండేది అనే ఈ దివ్య రహస్యాన్ని కూడా ఇప్పుడు నా రచన ద్వారా సమస్త మానవుల హితంకోరి వెల్లడి చేస్తున్నాను. 'వారు' ప్రసాదించిన దివ్య దృష్టితో ఆ సమయంలో నేను గ్రహించింది ఏమిటంటే, 'వారు' తమ నివాసం అనగా భూమా కేంద్రంలో ఉంటూనే, నన్ను తమ వెంటబెట్టుకుని తమ నివాసానికి తీసుకు వెళ్ళుతున్నారు.

నా ఎదుట వ్యాపించి ఉన్న ఈ దివ్య రహస్యాన్ని కూడా అందరి కోసం 'వారి' దివ్య దృష్టియే విశదం చేయాలనుకుంటోంది. అది ఏమిటంటే, 'వారు' మనల్ని భూమా ద్వారం వరకుగల యాత్రలో వెలుగులు నింపుతూ, దానిలో ఎలా ప్రవేశం కల్పిస్తారు, అని. ఈ అద్భుత దివ్య రహస్యాన్ని నా రచన ద్వారా వారే బహిర్గతం చేస్తున్నారు. ఇప్పుడు సమక్షంలో ఉన్నది (సెంటర్ రీజియన్) కేంద్ర మండలం యొక్క ముఖ్య కేంద్ర బిందువు, దానిని గురించి నా కలం ఏమీ మాటలు వ్రాయటం లేదు. అయితే యదార్థం ఏమిటంటే, ఈ దృశ్యం స్వయంగా నా కలంలోకి దిగి వచ్చింది. ఇప్పుడింక దానిని వర్ణించటానికి నా కలం సిద్ధమైంది. దైవిక ఆశ్చర్యం ఏమిటంటే, ఇక్కడి శబ్దాలు కూడా వాటంతటి అవే పలుకుతున్నాయి. అంతేకాదు, ఆ శబ్దాల క్రమబద్ధీకరణ కూడా దానంతట అదే జరిగిపోతోంది. మరి నా మాట ఏమంటారా? నేను కూర్చుండి ఈ అద్భుతాన్ని చూస్తున్నాను. ఇప్పుడు భూమా యొక్క ఈ వైభవ దేశం అనగా సెంట్రల్ రీజియన్ యొక్క ముఖ్య కేంద్రంలోకి బాబూజీ ఎలా తీసుకు వచ్చారు అనేది చూద్దాం! నేను అకస్మాత్తుగా గమనించింది ఏమిటంటే, నా అస్థిత్వం (Identity) కూడా ఈ ముఖ్య కేంద్ర బిందువులో ఎప్పుడైతే కలిసిపోయిందో అనగా శేషం యొక్క శేషం కూడా అంతరించిపోయిందో అప్పుడింక మిగిలే శేషం ఏమిటి? బాబూజీ మాటలనుబట్టి "లేదు అన్న దానిని ఉన్నది" అని చెప్పినట్లవుతుంది. అనగా అస్థిత్వం

తననే గుర్తించలేకపోతుంది (Identity cannot identify itself) అన్నట్లుగాను, ఇంకొక రకంగా చెప్పాలంటే, స్వయంగా తనకే తెలియనటువంటి గుర్తింపు (ఉనికి)ని తమ కృపలో లయం చేసుకుంటారు. ఆ తర్వాత ఎక్కడైతే శక్తి యొక్క జాడ కూడా ఉండదో, అటువంటి దానిలో మౌన యాత్ర చేయటానికి తీసుకు వెళ్లారు. నా బాబూజీ తమ దివ్య గ్రంథమైన "రాజయోగ ప్రభావం (Efficacy of Raj Yoga)"లో వ్రాసిన భూమా యొక్క ముఖ్య కేంద్రంలోకి చేర్చటానికని సప్త వలయాలు అనగా భూమా యొక్క సప్త ద్వారాలులో నాకు ప్రవేశం కల్పిస్తున్నారు అనేది చెప్పకుండా, ఇది తెలియజేయకుండా నా కలం మౌనంగా ఎలా ఉండగలదో మీరే చెప్పండి! ప్రథమ వలయంలో లేదా ద్వారంలో 'వారు' నాకు ప్రవేశం కల్పించినప్పుడు ఈ వలయాల నుంచే సృష్టి రచనా శక్తి వెలువడిందని గ్రహించాను. ఎలాగో తెలుసా? ఎలా అంటే, ఆదిశక్తి అనగా భూమా క్షేత్రంతో సంబంధించి ఉన్న ప్రథమ వలయం, అది ఆకారంలో అన్నింటి కంటె చిన్నదిగా ఉన్నప్పటికీ, అనంత శక్తితో కలయిక ఉన్నందువలన (Indication of Infinity) అనంతతను సూచిస్తుంది. దీనినిబట్టి ఏమి అర్థం అవుతుంది అంటే, సృష్టి శక్తి (Power of Creation) ఏదైతే విడుదలైందో అది వృత్తాలుగా రూపుదిద్దుకుంది, అని. ఇలా ఎందుకంటే, ఆ శక్తిలో సాంద్రత (Density) ఎక్కువుగా ఉంది కనుక. ఆ తర్వాత శక్తి యొక్క దిశ దిగువకు ప్రవహిస్తూ ఉంటూ ఒక్కొక్క వృత్తంగా రూపుదిద్దుకుంటూ పోయింది. అనగా దివ్య ఆది ప్రకృతియే శక్తిని క్రమబద్ధం చేసుకుంటూ పోయింది. శక్తిలో సాంద్రతకు కారణం ఏమై ఉన్నదంటే, శక్తి యొక్క కేంద్రంలో 'సృష్టి' యొక్క తలంపు కావచ్చు. ఈ దివ్య ఇచ్ఛా (తలంపు) యొక్క స్పందన కలగగానే సృష్టి కోసం ఎంత శక్తి అవుసరమై ఉందో, అది ముఖ్య కేంద్రం నుంచి బయటకు వచ్చి వృత్తాల రూపం దాల్చి, తర్వాత అది దిగువ ముఖంగా (అధోముఖంగా) ప్రయాణిస్తూ పోయింది. క్రమంగా శక్తి క్రియాన్వితం కావటం మూలంగా సృష్టి వెలుగులోకి రాజొచ్చింది అనగా సృష్టి వెలువడటం నారంభమైంది. ఇదే విధంగా దైవేచ్ఛ ద్వారానే "మానవ మాత్రుల హృదయాలు ఏవైతే ఈశ్వరీయ శక్తిని మరిచి, స్వంత పోకడలతో ఉన్నాయో, వాటిలో ఆ ఆదమరచి ఉన్న ఈశ్వరీయ శక్తిని జాగృతంచేసి, మానవ హృదయాలలో ఈశ్వర ప్రాప్తికైన కోరికను పునరుద్దరింపజేయాలి" అను ఒక సంకల్పం, ఈ పృథ్విలో మహాశక్తి అవతరించాలి అని తలపెట్టింది. ఈ దైవేచ్ఛను నిర్వహించటానికే సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ సంకల్పించి తన ఏడు నెలల అకుంఠిత దీక్షతో తన ప్రార్థన యొక్క స్పందన ద్వారా ఆదిశక్తి యొక్క ఆది కేంద్రమైన భూమా అంశ రూపంగా శ్రీ బాబూజీ మహరాజ్ అనగా శ్రీ రామచంద్రజీ మహరాజ్ (షాజహాన్‌పూర్, ఉ.ప్ర.)ను ఈ అవనిపై అవతరింపజేశారు. శ్రీ బాబూజీ మహరాజ్ తమ పరిపూర్ణ దివ్య పరిశోధన (Divine Research) ద్వారా నన్ను ఈ శ్రేష్ట దశకు చేర్చకపోతే ఈ మహత్తరమైన దివ్య రహస్యం, రహస్యంగానే దాగి ఉండేది. శ్రీ బాబూజీ మహరాజ్ రచనల ద్వారా మనకు ఈ మాత్రం జాడైనా తెలిసింది. ఏమంటే, సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్, ఫతేగఢ్, ఉ.ప్ర. ఒక ఆధ్యాత్మిక మహాబలుడు (Spiritual Giant) అని. **వారు** ఏడు నెలల్లో తమ సాధనను పూర్తి చేశారు; అయితే **వారి** సాధన ఏమిటి? ఆ సాధన గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. **వారు** వ్రాసిన దానినిబట్టి వారిది 'సంత్-మత్' అని మాత్రమే ఉంది. చివరకు ఈ దివ్య రహస్యాన్ని, దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్ నా పుస్తక

రచనల్లో నాకు ప్రత్యక్షంచేసి, సమర్థుని సమర్థతను నాకు పరిచయంచేసి వైభవోపేతంగా వివరించారు. భూమా శక్తి యొక్క ముఖ్య కేంద్రం తలుపుతట్టి తమ ప్రార్థనను ఆలకింపజేసినట్టి **వారు** నిజంగా (Spiritual Giant) ఆధ్యాత్మిక మహాబలుడే కదా! సమర్థునికి (లాలాజీ) 'ఆది' అను రత్నం దొరికింది. దానితోపాటు మానవ మాత్రులకు సృష్టి శక్తి రూపుదైన మన శ్రీ బాబూజీ ద్వారా భక్తిని పునరుద్ధరింపజేయు ఆధ్యాత్మిక సౌభాగ్యం కలిగింది. ఈ ధరణితోపాటు ఈ యుగం కూడా సమర్థ సద్గురునికి ఋణపడి ఉంటాయి. రానున్న తరాలవారు శిరస్సు వంచి మన బాబూజీ మహరాజ్‌కు అర్పితమైపోయి పరమానందభరితులవుదురు గాక!

## 8. శ్రీ బాబూజీ యొక్క అనుపమానమైన కృప మరియు అద్వితీయమైన దివ్యశక్తి

ఇప్పుడు దైవిక లయ-అవస్థలో విలీనం చేస్తూనే శ్రీ బాబూజీ మహరాజ్ దైవిక సాక్షాత్కారం కల్పించిన తర్వాత ఇంకొక దివ్య సత్యం నాకు ప్రత్యక్షం చేశారు. ఆ దివ్య సత్యమే నేడు తనను గురించి చెప్పాలని ఆరాటపడుతోంది. అది ఏమిటంటే, ఆ పారస్ లేదా పరశువేది లేదా చింతామణి (ఈశ్వరుడు)లో ఇనుము (అభ్యాసీ), అనగా అభ్యాసీ ఈశ్వరునిలో లయమైపోయిన తర్వాత కొంతవరకు అర్థమవుతుంది. ఎందుకంటే, అక్కడివరకు చేరడమనేది మానవుని గమ్యంగా ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, పారస్ అనగా పరశువేది యొక్క స్పర్శతో ఇనుము బంగారంగా మారటమనేది అందరూ వినే ఉంటారు. ఎందుకంటే, అది ప్రకృతి యొక్క ఒక మహిమ. కాని శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క మహత్తర శక్తి ఘనతకు ఈ పరిచయం అలౌకికమైనది. ఎందుకంటే, సాక్షాత్కారం పొందినమీదట భక్తుడు దివ్య సౌందర్యంతో మెరిసిపోతూ ఉంటాడు. ఇంకా ఈ దైవిక సత్యం దశ రూపంలో మన ఎదుట ఎలా నిలుస్తుంది అంటే, "ఇనుమును బంగారంగా మార్చేది సామాన్యమైన పరశువేది. ఇనుమును పరశువేదిగా మార్చేది అసలైన పరశువేది." అనగా అభ్యాసీ ద్వారా అందరి మేలుకొరకు ఈశ్వరీయ శక్తి ప్రవాహం ఇప్పుడు మన నుండి దానంతట అదే ప్రవహిస్తూ ఉంటుంది. శ్రీ బాబూజీ యొక్క ఈ దివ్య ఘనతను నా దశ రూపంలో ఎప్పుడైతే నేను లేఖలో వ్రాసి తెలిపానో, అప్పుడు 'వారు' జవాబుగా నాకు ఇలా వ్రాశారు: "ఈ స్థితిలో అభ్యాసీ ఇతరుల ఆధ్యాత్మిక సేవా నిమిత్తం పూర్ణ శక్తి మరియు సామర్థ్యంతో తయారవుతాడు. నాకు చాలా సంతోషంగా ఉంది. నీకు మన లాలాజీ యొక్క ఆశీస్సులు తోడుగా ఉన్నాయి. అది ఎలాగంటే, నీవు అభ్యాసీని ఆధ్యాత్మిక క్షేత్రం యొక్క శ్రేష్ఠ దశల వరకూ తీసుకువెళ్ళగల సామర్థ్యంతో ప్రిసెప్టర్‌గా పని చేయటానికి యోగ్యురాలవయ్యావు. నేను ఈ దశ కలిగేంతవరకూ నిరీక్షించలేకపోతున్నాను. ఈ కారణంగానే ప్రజలకు మిషన్ గురించి చెప్పటానికి నేను దివ్య శక్తి యొక్క లఘు-కేంద్రంతో అభ్యాసీ హృదయాన్ని అనుసంధానంచేసి ప్రశిక్షణ ఇవ్వడం కోసమని వారిని ప్రిసెప్టర్‌గా తయారుచేస్తాను" అని. సోదరులారా! శ్రీ బాబూజీ మహరాజ్‌గారి సహజమార్గ విధానం యొక్క గొప్పదనం గురించి నేను ఏమి చెప్పగలను, ఎలా వ్రాయగలను! ఈశ్వర సాక్షాత్కారం యొక్క దివ్యదశను పొందిన తర్వాత ఎప్పుడైతే తపన, భక్తి మరియు ప్రేమ సహితంగా

సంపూర్ణ అహంను కూడా తనలో లయం చేసుకున్నదో, అప్పుడు ఈ దైవిక సత్య కథనాన్ని నేను అనుభూతి చెందాను. అది ఏమిటంటే, శ్రీ బాబూజీ నాకు సాక్షాత్కారం అనుగ్రహించిన తర్వాత నన్ను ఈశ్వరీయ క్షేత్రం యొక్క ముఖ్య కేంద్రంలో మునక వేయించి, అనగా ఈశ్వరీయ శక్తితో స్నానమాడించి, ఆ శక్తి సహితంగా ఈశ్వరీయ సౌందర్యంతో అలంకరించి సత్యపద్ మీద ప్రతిష్ఠించారు. అప్పుడు పొందిన దశను గురించి ఎవరు మాత్రం ఏమి వ్రాయగలరు? దానిని ఇప్పుడు ఆ దివ్య దశయే చెప్పగలదు. నా బాబూజీ నన్ను దివ్య పరశువేదిగా తయారుచేసి సత్యపద్ మీద ప్రతిష్ఠించారు అని మాత్రం నేను చెప్పగలను. ఇప్పుడు మీరు ఏమంటారు? “ఈ ధరణిమీద నివసించే ప్రాణులారా! మీరు ఏదైనా కోరుకోవాలని అనుకుంటే, భూమాను కోరుకోండి– అని చెప్పిన దివ్య ఋషి యొక్క వాణి యదార్థమయ్యే సమయమాసన్నమైంది” అని వ్రాసిన నా కలం యొక్క ఈ ఆహ్వానం వంక మీ దృష్టి సారించండి. ఇప్పుడు శ్రీ బాబూజీగారి సహజమార్గ సాధనలో అంతర్గతంగా ఉన్న ఈశ్వరీయ ప్రాణాహుతి శక్తి యొక్క ప్రవాహాన్ని హృదయంలో పొంది, ఆ ఆదిశక్తికి చెందిన మూలం యొక్క కృపలో తడిసి, (Alert) అప్రమత్తతో ఆ వాణి యదార్థమై నిలిచింది. ఈ యుగం, సత్యయుగం అనగా ఈశ్వరీయ యుగం యొక్క సౌందర్యంతో పరిపూర్ణం చేయటానికే దివ్య విభూతి, శ్రీ బాబూజీ మహరాజ్ చరణాలకు అర్పితమైపోయింది. ధరణి, ఈ ఆది యుగపురుషుని చరణ స్పర్శను పొంది, తనను పావనం చేసుకొని ధన్యమైంది. సమర్థ సద్గురువు తన ప్రార్థన సార్థకమై దైవిక ఫలస్వరూపంగా, భూమా యొక్క ఈ దివ్య రత్నాన్ని (బాబూజీ) అంతిమ సత్యం యొక్క ద్వారం నుంచి రప్పించి ఈ ధరణిమీద అవతరింపజేశారు. ఇప్పుడు మానవుడు కేవలం అంతిమం (అల్టిమేట్) పేరుతో పరిచితుడై ఉండటమే కాకుండా ఈశ్వర సాక్షాత్కారం కంటె కూడా శ్రేష్ఠమైన దివ్య దశలతోపాటు ఇప్పటివరకూ అపరిచితంగా ఉన్న భూమా (అల్టిమేట్) యొక్క పరిచయంతో అందరికీ తెలియజేయటమే కాదు, అక్కడివరకు ఉన్న దివ్య, అద్వితీయమైన దశల దివ్యానుభూతులను కూడా శబ్దాలలో కూర్చి వ్రాయగల సామర్థ్యాన్ని కూడా నేడు ‘వారి’ ఈ కుమార్తెకు అనుగ్రహించారు. ఇంతేకాదు, తల్లి ఎదుట కూర్చున్న బాలుడు, తల్లి ముఖారవిందాన్ని చూస్తూ ఎలా వ్రాస్తూ ఉంటాడో, అలాగే అటువంటి దశలలో నా కలం ఇప్పుడు ఏమేమి వ్రాస్తూ ఉందో, అది చివరకు చదివిన తర్వాతనే తెలుస్తుంది. నిజం చెప్పాలంటే, అపరిచితమైన భూమా లేదా అల్టిమేట్ యొక్క విశిష్టతను దివ్య దశల సౌందర్యంతో అలంకరించి, ఉద్ధరించే సాహసం శ్రీ బాబూజీకితప్ప మరెవ్వరికి సాధ్యపడుతుంది? అపరిచితుని గురించి పరిచయం చేయగల వారు ఎవ్వరైనా మనకు లభించినప్పుడు, క్రమంగా ‘వారి’ గుర్తింపు (Acknowledge) మరియు ‘వారి’ ప్రాముఖ్యత (Importance) ప్రతి ఒక్కరికీ ప్రకాశవంతమవుతూ ఉంటుంది అనే సత్యవాక్కు నేడు ప్రత్యక్షంగా ఉంది. నేడు భూమా శక్తికి ప్రతీకగా ఉన్న మన శ్రీ బాబూజీ మహరాజ్, ఆ అదృశ్యంగా ఉన్న దివ్యశక్తిని ఈ భూమి మీద మానవ మాత్రుల హితంకొరకు ప్రత్యక్షం చేశారు. ‘వారు’ అనంత ఆది శక్తి యొక్క ఆధిపత్యం పొంది ఉన్నందునే మానవ మాత్రుల హృదయాల్లో దివ్య ప్రాణాహుతి శక్తి ప్రవాహం కల్పించి హృదయానికి దివ్య పవిత్రతను సమకూర్చారు. ఇంకా ఏమిటంటే, మానవ హితార్థం ఆత్మోద్ధరణతోపాటుగానే వారిలో ఆధ్యాత్మిక శక్తిని కూడా జాగృతం చేశారు. నేనయితే, శ్రీ బాబూజీ

మహరాజ్ యొక్క దైవిక మహిమను పూర్తిగా తెలుసుకోవటానికి మరియు భూమా యొక్క పరిచయంతో మనల్ని మనం అలంకరించుకోవటానికి అభ్యాసులమైన మనకు మొట్టమొదట దివ్య విరాట్‌లో లయ–అవస్థను ప్రాప్తం చేసుకోవటంవలన మాత్రమే భూమా వైభవ కేంద్రమైన సెంటర్ రీజియన్ (కేంద్రమండలం)లో ప్రవేశం లభిస్తుంది అను ఈ వాస్తవ విషయాన్ని కూడా ఈరోజు వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. ఈ ధృవసత్యాన్ని నేను సహజమార్గ సాధనలో ప్రవేశించిన తర్వాత స్వయంగా ఈ దశను అనుభూతి చెందుతూ గమనించాను. ఈ అనంత యాత్ర యొక్క దివ్యానుభూతులను పుస్తకం రూపంలో అందరి ప్రయోజనం కొరకు ఉంచటంలో, నా ఎదుట 'వారి' ప్రత్యక్షతను పొందటం ద్వారానే సాఫల్యత సాధించాను.

## 9. భూమా

ఎవరిది, ఎటువంటి దివ్య అనుపమానమైనదో కదా ఈ పరిచయం! ఎందుకంటే, ఈ పరిచయాన్ని ప్రత్యక్షపరచటానికి ఆ పరమ శక్తి ఏకంగా ఈ ధరణిమీదకు వచ్చి ప్రకటించుకోవలసి వచ్చింది. నేను పొందిన పరిచయం మరల మరల పిలుస్తూ, "సముద్రాలకు సముద్రాలనే త్రాగివేసినా కూడా, నోటి నుండి 'ఇంకా కావాలి, ఇంకా కావాలి' అను మాట ఆర్తితో వెలువడాలి" అని తెలియజెప్పే శ్రీ బాబూజీ యొక్క అంతులేని ప్రేమది. ఆ అలౌకిక పరిచయమే ఆరంభం నుంచి (ఆది–నేచర్) ఆది ప్రకృతి యొక్క సౌందర్యాన్ని మనలో విస్తరింపజేస్తూ, భౌతిక ప్రపంచానికి అతీతంగా ఉన్న అనుపమ సౌందర్యంలో మనల్ని విలీనంచేసి, ఈ జగతిని కేవలం దివ్య దరహాస రూపంలో మాత్రమే మన సమక్షంలో ఉంచుతుంది. ఒక అలౌకిక ఆశ్చర్యాన్ని నేను ఇప్పుడు గమనిస్తున్నది ఏమిటంటే, జనులు ఇప్పుడు బ్రహ్మాండ మండలం, పరబ్రహ్మాండ మండలం, హిరణ్యగర్భ దేశం మరియు సెంటర్ రీజియన్ అనగా కేంద్రమండలం వరకుగల దశల గురించి ఎలా మాట్లాడుతున్నారు అంటే, వీటి అన్నింటితోనూ వారికి పరిచయం ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. అలా ఎందుకో తెలుసా? సమస్త దైవిక పరిచయం మరియు అనంతం యొక్క అనంత తత్వపు సౌందర్యాన్ని వెదజల్లేవారు, అనంత దివ్యశక్తికి ప్రతిరూపమైనవారు అయిన శ్రీ బాబూజీ పవిత్ర పాదాల స్పర్శను ఈ ధరణి పొందటంవల్లనే. ఈరోజు నేను గమనించింది ఏమిటంటే, ఇప్పటివరకు తెలియకుండా ఉన్న భూమా, దాని దశలతోపాటు మరియు అక్కడ ఉన్న శక్తి గురించి కూడా నా శ్రీ బాబూజీ మహరాజ్ కృపతోనే నా రచన ద్వారా కొంత వివరించగలిగాను, అని. ప్రతి మండలం, ప్రతి వాతావరణం గురించి వ్రాయటం అనేది కేవలం 'వారు' పట్టుకున్న కలం ద్వారానే సంభవమైంది. అయితే ఇప్పుడు మీరు నా బాబూజీ గురించి అడిగినట్లయితే నేను ఏమి చెప్పగలుగుతాను, ఎలా చెప్పగలుగుతాను? ఎందుకో తెలుసా! ఎందుకంటే, వేరే ఎవరైనా అయితే అతని పరిచయం ఎంతోకొంత ఉంటుంది, కాని స్వయంగా భిన్నత్వం లేనివారైనప్పుడు, మరి 'వారి' పరిచయం ఏమి ఉంటుంది, ఆ పరిచయం ఎలా ఇవ్వబడుతుంది. సర్వవ్యాపి యొక్క సాక్షాత్కారమైతే పొందవచ్చు; కాని పరిచయానికి 'వారు' అతీతులైనందున 'వారి' పరిచయం కలిగించటం అసంభవం. సంత్ కబీర్ వాణి కూడా

**"హద్, అన్‌హద్ కె బీచ్ మెం రహా కబీరా సోయ్"**

అనగా హద్దు హద్దులేమి మధ్య కబీరు ఆదమరచి ఉన్నాడు అని చెప్పి మౌనంగా ఉండిపోయింది. దీని అర్థం ఏమిటంటే, ఈశ్వరుని సాక్షాత్కారం అయితే పొందారు, కాని దానికి అవతల, వారికి అనంతత్వం యొక్క మహత్తర అనుభూతి కలుగుతూ ఉన్న దానిని తెలుసుకోవటం సంభవం కాలేదు. ఎందుకంటే, వారు సాక్షాత్కారం యొక్క పరమానందంలో మునిగి తనను తాను కోల్పోయారు. మరి ఎవరు ఆ స్థితులను వ్రాయగలరు? ఎప్పుడైతే సాక్షాత్కార సౌభాగ్యంతో నన్ను అలంకరించి తమ దివ్య పరిశోధనను పూర్తి చేయటానికని భూమా శక్తి మీద ఆధిపత్యం కలిగి ఉన్న నా బాబూజీ తమ దైవిక సంకల్పంలోకి నా శేష అస్తిత్వానికి ప్రవేశం కల్పించి భూమా వైభవ కేంద్రమైన సెంటర్ రీజియన్ (కేంద్ర మండలం)లో ప్రవేశపెట్టారో, అప్పుడు ఈ రహస్యమయ దృశ్యాన్ని తేజోవంతంగా నేను ఆ సమయంలో ప్రత్యక్షంగా చూశాను. ఇంతేకాదు, ఆ హద్దులేమి యొక్క ద్వారాన్ని (కేంద్రమండలం యొక్క ప్రవేశ ద్వారం) సమస్త మానవాళి ప్రయోజనం కోసం శాశ్వతంగా తెరచి ఉంచేశారు. బహుశా ఈ కారణంగానే నా ప్రతి పుస్తకంలోను బాబూజీ స్వయంగా అది వ్రాయించారు, ఏమని అంటే, ఇప్పుడింక మరొక కబీరు ఎవ్వరైనాగాని (ఆ స్థితికి చేరిన అభ్యాసీ) హద్దుకి అవతల ఉన్న దానిని అనగా అనంత క్షేత్రంలో ప్రవేశం పొందటం కోసమని "రహా కబీరా సోయ్" అనగా "కబీరు ఆదమరచి ఉండిపోయాడు" అని వ్రాయలేడు. ఈ విధంగా కబీరు చెప్పిన దాని దశ యొక్క పరిచయం కూడా మనం పొందాము.

ఇంకా వినండి! శ్రీ బాబూజీ సెంటర్ రీజియన్ యొక్క ప్రవేశ ద్వారానికి ఎంతటి యదార్థమైన పేరు పెట్టారో కదా! 'పార్షద్' అనగా రక్షక ద్వారం. ఇక్కడే ప్రథమ మానవుడు తనను గురించి కూడా ఏమీ తెలియకుండానే ప్రతిష్ఠించబడ్డాడు; అనగా 'సత్యపద్'. ఇది మానవుడు కూర్చుండటానికి స్వచ్ఛమైన ఆది-పదం అనగా తొలి స్థానం. ఈ కలం తన స్పృహలో ఉండి, ఇలా వ్రాయడం ఎలా సంభవమైంది అనేది ఎంత ఆశ్చర్యమో కదా! అయితే, అకస్మాత్తుగా దైవిక చిరునగవు నాలో ఒక మెరుపులాగా స్పృహ కలిగించింది. అప్పుడు నా కలం, 'వారి' దివ్య చరణాల స్పర్శను పొందటానికి అన్నట్లు వంగిపోయింది. మరి ఎప్పుడైతే దైవిక స్పృహ నన్ను ప్రోత్సహించిందో, అప్పుడు నాకు స్వయంగా నేను వ్రాసిన దానిని చదివే అదృష్టం కలిగింది. నేను ఆనందంతో ఉప్పొంగిపోయాను. మీరు ఇది కూడా చదివితే ఒక అలౌకిక ఆశ్చర్యం కలుగుతుంది. అది ఏమిటంటే, ఏ విధంగా 'వారు' నా అస్తిత్వాన్ని (Identity) తమ దివ్య సంకల్పంలోకి తీసుకుని సెంటర్ రీజియన్‌లో ఈత (స్విమ్మింగ్)ను ప్రసాదించారో, అది దివ్య దృష్టి పొందకుండా ఇటువంటి దృశ్యం యొక్క సత్యత (Truth) వెల్లడి కావటమనేది అసంభవం. ఇప్పుడు మన సౌభాగ్యం ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రకాశవంతంగా ఎందుకు మందహాసం చేస్తోంది అంటే, నా గుర్తింపును (ఐడెంటిటీ) కూడా పరిచయంచేసి 'వారు' నా కలాన్ని దివ్య సౌందర్యంతో అలంకరించారు. 'వారు' నాకు ఎటువంటి దివ్యానుభూతిని ప్రసాదించారు అంటే, అహం యొక్క పదహారు వృత్తాలను 'వారు' ఈశ్వరీయ శక్తి యొక్క ముఖ్య కేంద్రంలో మునక వేయించటంతోపాటు దానిలోనే (అనగా ముఖ్య కేంద్రంలోనే) లయం చేసేశారు. అంతే కాకుండా, శేషించిన గుర్తింపును (అహం యొక్క అతిస్వల్ప భావాన్ని) తమ దివ్య సంకల్పంలో

లయంచేసివేశారు. ఇది ఎలా సంభవమైందో తెలుసుకోవాలని అనుకుంటున్నారా! అయితే వినండి! దివ్య విభూతి అయిన నా బాబూజీ మహరాజ్ తమ దివ్య సంకల్పం ద్వారానే ప్రతి శ్రేష్టదశను మరియు ఇటువంటి దివ్య దశలను నాలో కల్పించారు. ఇంతేకాదు, ఇంకా ఏమిటంటే, వాటిలో లయ–అవస్థను అనుగ్రహిస్తూ అనుభూతి రూపంలో అందరి ప్రయోజనార్థం దివ్య సందేశ రూపంలో నేడు భూమా స్వయంగా తన దివ్య పురుషుడే అయిన 'వారి' పరిచయాన్ని మనకు ప్రత్యక్షం చేస్తోంది. **వాస్తవానికి శ్రీరామచంద్ర మిషన్‌కు అంతర్గతంగా ఉన్న సహజమార్గ సాధనా పద్ధతి యొక్క దివ్య రత్నాలు భక్తి రసంలో మునిగి ఉన్న అభ్యాసీకి మాత్రమే లభిస్తాయి అని నేను గ్రహించాను.** భక్తి యొక్క పీఠాన్ని దాటిన తర్వాత సాక్షాత్కారపు దశల ముఖ్య అంతస్తుల పరిశోధనలో 'వారు' 'A' నుంచి 'Z' వరకు లెక్కించి మరల వాటినే తిరగరాస్తూ అనగా '$A_1$' నుంచి '$Z_1$' వరకు 52 పాయింట్లు లెక్కించి, "ఇప్పుడు లెక్కించటం అసంభవమై పోయింది" అని నాకు వ్రాశారు. ఆ తర్వాత నిరంతరం 'వారి' దివ్య చరణాల స్పర్శను తన హృదయానికి హత్తుకొని ఉన్న నా కలం, ఎల్లప్పుడు ఏవో కొన్ని దివ్యగతుల పరిచయాన్ని తన అనుభూతిలో నింపుకొని నాకు అర్పించటం కోసం ఆతృతతో సదా సిద్ధంగా ఉంది, ఉంటుంది కూడా.

**నిజం చెప్పాలంటే, సహజమార్గ సాధన అనేది మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సంకల్పం (Divine Will) మాత్రమే. మన అభ్యాసులను ఆ దివ్య సంకల్పం ద్వారానే శ్రేష్ట దశల యోగ్యతను కల్పిస్తూ మనల్ని అంతిమ సత్యం వరకు తీసుకు వెళ్తోంది.** బహుశా ఈ కారణంగానే నేను అభ్యాస కాలం నుండి ఇప్పటివరకు 'వారి' సామీప్యత యొక్క సహజ ఆశ్రయాన్ని పొందాను. ఇప్పుడు **శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన మాట –"సహజమార్గం అనేది పై నుంచి దిగి వచ్చిందే కాని తయారు చేయబడింది కాదు" అన్నది నా గ్రహింపుకు వచ్చింది.** నేను ఇప్పుడు సమస్త మానవాళి హితంకోసం 'వారి' ప్రేమతో నిండిన సహజమార్గం యొక్క ఈ దివ్య ప్రసాదాన్ని పంచిపెట్టాలని కోరుకుంటున్నాను. అది ఏమిటంటే, "భూమా యొక్క దివ్యాంశ రూపంలో మనకు ఇప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ పవిత్ర పాదాల ఆశ్రయం, సహకారమూ లభించాయి" అని. దాని ఫలితంగానే నేడు 'వారి' దివ్య ప్రేమ మరియు వర్ణింపనలవికాని దివ్య పరిశోధన (Divine Research), సాధనలో ఆరంభం నుంచి అనంతం వరకుగల యాత్రలోని ప్రతిదశ యొక్క అలౌకికమైన అనుభూతికే 'సహజమార్గం' అని పేరు పెట్టినట్లు అనిపిస్తోంది. బహుశా దీని మూలంగానే, **వాస్తవిక సహజమార్గం మన మిషన్ ఎంబ్లమ్ మధ్యలో ఏదైతే చూపబడిందో, అక్కడ నుంచే ప్రారంభమవుతుంది అనే సత్యం కూడా నేను ప్రత్యక్షంగా చూశాను. సహజమార్గ విధానంలో సాధన ప్రారంభించిన తర్వాత, ఈ చిహ్నంలో మధ్యన ఉన్న సహజ ధారలో ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ నాకు ప్రవేశం కల్పించారో, అప్పుడు నిరంతరంగా ఈ దివ్యశక్తి ప్రవాహం ప్రవహిస్తున్నట్లుగా నేను గ్రహించాను. ఇది అసలైన సహజమార్గం. సహజమార్గ విధానం మరియు ముఖ్య దైవీయ సహజమార్గం యొక్క నిగూఢ రహస్యాన్ని నేడు గ్రహించగలిగాను. "ఇప్పుడు మన సహజమార్గం ఏమిటి?" అని మీరు ఎలా ప్రశ్నించగలరు!**

ఇప్పుడు సమస్త దైవిక నిగూఢ రహస్యాలను అందరి మేలుకొరకు శ్రీ బాబూజీ మహరాజ్ ప్రకాశవంతం చేయాలని కోరుకోంటున్నారు. కనుక నేను, ఒక డేనిష్ (డెన్మార్క్ నుండి వచ్చిన) అభ్యాసీ అడిగిన ప్రశ్నకు జవాబుగా ఈ రహస్యాన్ని కూడా అతడి ఎదుట ఉంచుతున్నాను. మన ఎంబ్లమ్ యొక్క ఆరంభంలో దిగువన ఉన్న ఈ స్వస్తిక్ ( 卐 ) చిహ్నాం ఉంచటంలో అర్థం ఏమిటి? అనేది అతడి ప్రశ్న. నిజానికి ఈ సత్యాన్ని ప్రకాశవంతం చేయటం కూడా అవసరమే. ఇంక అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ దీని వివరణ కూడా నాకు ప్రత్యక్షం చేశారు. అది ఏమిటో గమనించండి. ఈ స్వస్తిక్ చిహ్నాం నాలుగు గీతల ముఖం నాలుగు దిశలలోను ఉంది. అంటే ఈ విధానం (సిస్టమ్) నాలుగుదిశలా వ్యాపిస్తుందని అనటానికి సంకేతం. ప్రతి ప్రాపంచిక శుభకార్యంలోను ఈ చిహ్నాంతో ప్రారంభించటం ప్రాచీనకాలం నుండి అమలవుతోంది. బహుశా మునులు, ఋషులు, ఆ శుభకార్యం యొక్క సుగంధంతో నాలుగు దిశలూ పరిమళింపజేసే ఆత్మిక శక్తిని కలిగి ఉండేవారు. నా ఆంతర్యంలోని దృఢత ఎలుగెత్తి ఏమి చెప్తుతోంది అంటే, ఇది మన శ్రీ బాబూజీగారి పరమ శక్తి యొక్క పిలుపు. అది ఏమిటంటే, "మన సహజమార్గం సమస్త ప్రపంచాన్ని పరిపాలిస్తుంది. అనగా ఈ దివ్యశక్తితో సమస్త ప్రపంచమూ స్నానమాడే సమయమాసన్నమైంది. మన మిషన్ యొక్క ఈ స్వస్తిక్ చిహ్నామే దీనికి సజీవ నిదర్శనంగా ఉంది. ఈ చిహ్నాం సామాజిక శుభకార్యాల సూచికగా ఉండటమే కాకుండా, సహజమార్గ విధానం ద్వారా దివ్యశక్తి యొక్క సహజం మరియు నిరంతర ధార ఇప్పుడు భూమా యొక్క దివ్య ప్రసాదంతో ఈ పుడమిని పరిపుష్టం చేస్తోంది" అని. నా గీతం బహుశా ఈ భావంలోనే విలీనమైపోయి ఏమని పాడింది అంటే,

**"శ్రీ లాలాజీ సమర్థ-గురు కీ హమ్ శరణ్-చరణ్ బలిహారీహై।**

**జిన్ (బాబూజీ) కొ మిలాయ్ దియా అబ్ రామ్ కా నామ్ లియా న లియా॥"**

సమర్థ గురు శ్రీ లాలాజీ చరణాలకు మనం ఇప్పుడు శరణుజొచ్చాము,

ఎవ్వరైతే బాబూజీని కలియజేశారో, ఇప్పుడు రామనామం స్మరించిన, స్మరించకున్ననేమి.

దీని అర్థం ఏమిటంటే, ఇప్పుడు మనం సమర్థగురు శ్రీ లాలాజీ పాదపద్మాల శరణు పొంది సమర్పితమైపోయాము. **వారు** బాబూజీని భూమిపై అవతరింపజేసి మనకు యోగం కలిగించారు. ఇప్పుడింక రామనామం స్మరించినా, స్మరించకున్నా ఫరవాలేదు, అని.

నేను ఇప్పటివరకు మన మిషన్ చిహ్నాం మరియు సహజమార్గం యొక్క గొప్పదనం గురించిన కొద్దిపాటి పరిచయాన్ని మాత్రమే వ్రాయగలిగాను. ముమ్ముందు ఇది ఎంతగా వ్యాపించి నాకు తన పరిచయంతో అవగాహన చేస్తుందో అది నా బాబూజీకే తెలుసు. అందరి శ్రేయస్సు కొరకు నేను సమర్పించిన ఇతర పుస్తకాలతోపాటు ఈ పుస్తకం కూడా పరమానందం విషయంలో మాత్రమే కాకుండా ఇంకా దాని తర్వాత దివ్యానందం మరియు శూన్యానందం అనగా బాబూజీ లేఖల్లో వ్రాయబడిన 'జీరో' శూన్యావస్థ, తర్వాత సాటిలేని అనన్య అవస్థలో పొందిన దివ్యానుభూతుల ప్రాప్తంతో అలంకరించి, 'వారి' దివ్య తేజస్సుతో మునిగి ఉండి, ఇప్పుడు 'వారి' దివ్య చరణాలకే సమర్పితమయ్యింది. ప్రాణిమాత్రులు ఈ దివ్య తేజస్సుతో తేజోవంతులై అనంత యాత్రలో అనన్య గతులను ప్రాప్తం చేసుకోవాలనీ, ఇంకా మనమంతా ఈశ్వరీయ అంశీయులమే కనుక సహజమార్గ సాధన ద్వారా తమ యొక్క వాస్తవిక పరిచయాన్ని ప్రాప్తించుకోగలగాలని నేను ప్రార్థిస్తున్నాను.

# 10. నిరాడంబరత మాటున

నేడు అకస్మాత్తుగా నిరాడంబరతయే నన్ను– "ఇంతకూ నేను ఎవ్వరి ముసుగుగా (పర్దాగా) తయారై ఉన్నాను" అని అడిగేసింది. నేను ఉలిక్కిపడి జాగురూకతతో ఆలోచించటం మొదలుపెట్టాను. అది ఏమంటే, దైవం (డివైన్) ఈ ప్రశ్న ద్వారా నన్ను ఈ నిజాన్ని కూడా అందరికి ప్రకాశవంతం చేయాలని కోరుకుంటున్నదా! అని. నా కలం నా చేతివ్రేళ్ళలో చిక్కుకుని, శిరస్సు వంచి, ఆది–ప్రకృతి బహుశా, "నిరాడంబరతయే బాబూజీకి ఆవరణగా (ముసుగుగా) అయిపోయింది" అనే ఈ రహస్యాన్ని కూడా బహిర్గతం చేయాలని అనుకుంటున్నదా అని వ్రాయటానికి సిద్ధమై ఎదురు చూస్తున్నట్లుగా ఉండిపోయింది. జనులు అనుకునే ఈ మాట నిరాడంబరతకు సరైనదిగా లేదనిపించటంతో తానే స్వయంగా "అసలీయత్ అనగా సత్యత్వంపై ఎవరైనా ముసుగు వేయగలరా?" అని చెప్పడం మొదలుపెట్టింది. ఇంకొక రకంగా చెప్పాలంటే, సత్యత్వం (రియాలిటీ) అనేది ఎప్పుడైనా ముసుగు మాటున ఉండగలదా? జనుల బుద్ధిమీద ఆవరించిన ఆవరణలు (పొరలు) సహజమార్గ సాధన ద్వారా ఎంతెంతగా పలుచనైపోతూ ఉంటాయో, అంతంతగానే ప్రాణిమాత్రుల రాకకోసం ఇప్పటివరకు ఎదురుచూస్తున్న ఆ సత్యత్వం యొక్క దర్శనం ప్రత్యక్షంకాసాగుతుంది. ఈ నిజమైన సాధన అనగా సహజమార్గ సాధన యొక్క యోగం కూడా శ్రీ బాబూజీ మహరాజ్, అభ్యాసీలని సత్యపద్ వరకు చేర్చటానికి ఆధ్యాత్మిక ఉన్నతికొరకు సహజంగానే చేసేశారు. బహుశా అప్పుడే ఈ సాధనకు (నేచర్) ప్రకృతి **"సహజమార్గం"** అని పేరుపెట్టింది. అప్పుడే "ఆ ముసుగు ఎలా ఏర్పడింది" అను నిరాడంబరత యొక్క ప్రశ్న నాకు బాగా నచ్చింది. ఎప్పుడైతే అంతర్ దృష్టి ఈశ్వరీయ ప్రకాశంతో దేదీప్యమానమవుతుందో అప్పుడే నిజంగా మన బాబూజీ యొక్క వాస్తవిక సౌందర్యం దర్శనాన్ని పొందగలుగుతాము. ఈ దశను ప్రాప్తం చేసుకున్నాక నాకు నిరాడంబరత యొక్క ప్రశ్న గురించిన వాస్తవిక సమాధానం లభించింది ఏమిటంటే, "వాస్తవికత అనగా సత్యత్వం మీద ఎటువంటి ముసుగు ఉండదు. అది ప్రకాశవంతంగానే ఉండేది, ఉన్నది, ఉంటుంది కూడ" అని. ఇప్పుడు నా కలం నా జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ యొక్క దైవిక అక్షరాలలోనే నిరాడంబరత యొక్క ప్రశ్నకు జవాబుగా "మానవుని వాస్తవిక అస్తిత్వం (Identity) పొరలకు పొరల మాటున దాగబడి ఉంది" అని ఇస్తోంది. ఈ కారణంగానే నేను సహజమార్గ సాధన యొక్క సిద్ధించిన స్థితులను దాటిన తర్వాత "ఎన్ని వస్త్రాలు ధరించినా కూడా నేను నగ్నంగానే ఉన్నట్లు భావన కలుగుతోంది" అని శ్రీ బాబూజీకి నా ఉత్తరంలో వ్రాశాను. కాని ఈ వాక్యం నా వాస్తవిక ఆధ్యాత్మిక దశను సూచిస్తుంది. ఎందుకంటే, శ్రీ బాబూజీ నాకు జవాబుగా "నీ స్థితిని గురించి ఏమని చెప్పాలి! శ్రీ లాలాజీ కృపతో నీకు (Self Realisation) ఆత్మ సాక్షాత్కారపు దశ సంప్రాప్తమయ్యింది. పొరలకు పొరల మాటున మరుగునపడి ఉన్న నీ అస్తిత్వం ఇప్పుడు ప్రకాశవంతంగా అయ్యింది" అని వ్రాశారు. ఇప్పుడు చెప్పండి మరి. మానవుని ఉనికి యొక్క వాస్తవికతయే అతనికి తెలియనప్పుడు ఇంక సత్యత్వం (రియాలిటీ), దానికి అదే 'వాస్తవికత' అవుతుందని ఎవరు మాత్రం అర్థం చేసుకోగలరు. ఇంకేముంది, తన ఉనికి యొక్క ముసుగు లేదా తెర తొలగుతూనే, మన ఆత్మోన్నతి సహజసిద్ధంగానే

సహజ గతిని సంతరించుకున్నదై ఆధ్యాత్మికతకు చెందిన (రియాలిటీ) సత్యత్వపు దశవైపుగా పయనం సాగిస్తుంది. అంతే, ఒక రోజున శ్రీ బాబూజీ మహరాజ్ మనకు ఆ (రియాలిటీ) సత్యత్వం యొక్క దర్శన సౌభాగ్యం అనుగ్రహిస్తారు. ఈ దశలో లయ-అవస్థ ప్రాప్తించిన తర్వాతనే, నేను నా శ్రీ బాబూజీలోనే విలీనం (లేక లయం) అయిపోతున్న యదార్థం ప్రకాశవంతమవుతూ ఉండటం గమనించాను. ఈ లయ-అవస్థలో ప్రవేశం పొందగానే నా గీతంలోని ఈ పంక్తి స్వయంగానే ఈ విధంగా పాడ సాగింది.

**"మాపీ జాసక్తీ హై సాగర్ కీ గహన్‌తా భీ కభీ।**

**పర్ న మాపీ జాసకె ఇస్ ప్యార్ కీ ఛల్‌కన్ కభీ।।**

కొలవశక్యం ఎన్నడైనా సాగరపు లోతును.

కొలవనశక్యం ఎన్నడైనా ఈ ప్రేమ పొంగును.

అనగా, "సాగరపు లోతును ఎన్నడైనా కొలువ సాధ్యమగును, కాని 'ఈ ప్రేమ' యొక్క పొంగును కొలువ సాధ్యపడదు ఎన్నడునూ"అని అర్థం.

అప్పుడే నా కలం నా పుస్తకాలలో సర్వవ్యాపి, సర్వశక్తిమంతుని గురించి, ఆ తర్వాత 'అనంతం' క్షేత్రం యొక్క ప్రతి మర్మమైన దశ యొక్క వివరణ కూడా ఇవ్వగలిగింది. అది కూడా నా పాటలోని ఈ పంక్తులలో ఇలా గానం చేసింది-

**జనక్ (పితా) లాలాజీ థె ఉన్ కె, ఆది శక్తి మాతా ఉన్ కీ,**

**సృజన్ హారా కౌన్ థా బస్ యే హీ జానే మర్జీ ఉన్ కీ,**

**కుతుబ్ (శ్రేష్ట -దశ యాని ఈశ్వరయదేశ్‌మేఁ) పై**

**చఢ్ కె (పహుంచ్ కర్) పుకారా, తబ్ యే సమఝె కౌన్ థె.**

దీని అర్థం ఏమిటంటే, సమర్థ లాలాజీ సాహెబ్ 'వారి' జనకుడు, ఆదిశక్తి 'వారి' జనని, కాని సృష్టికర్త ఎవ్వరో 'వారి'కే తెలుసు. కుతుబ్ (ఈశ్వరీయ దేశంలో శ్రేష్ఠ దశ)ను చేరాక వారెవ్వరో నాకు తెలిసింది.

ప్రియమైన సోదరులారా! ఎక్కడ మూడు ధారలు (అనగా ప్రవాహాలు) కలుస్తాయో, దానినే భౌతికంగా సంగమం (లేదా త్రివేణీ సంగమం) అంటారు అని జనులందరికి తెలిసిందే. అదే విధంగా నేను సహజమార్గంలో ఈ విషయాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందాను. అదేమంటే, సాధన యొక్క మూడు అంశలైన ధ్యానం, నిర్మలీకరణ మరియు ప్రార్థన ద్వారా పొందిన ఆధ్యాత్మిక దశల ప్రాప్తి అనంతరం, అన్నింటి సారం కలిపి ఒక్కటిగా అయిపోయినప్పుడు అనగా దశలు మనలో జీర్ణించుకుపోయినప్పుడు లేదా లయమైపోయినప్పుడే ఈశ్వరీయ సాగరంలో మన లయ-అవస్థ ప్రారంభమవుతుంది. అప్పుడే నేను ఈ నానుడి -"నీటిలోతులోకి చొరబడినప్పుడే స్వచ్ఛమైన ముత్యం దొరుకుతుంది" అను దానిని ప్రత్యక్షంగా గ్రహించాను. అనగా దైవీయ లయ-అవస్థలో మునిగిన తర్వాత విరాట్-అవస్థలో లయ-అవస్థ పొందినమీదట 'సాక్షాత్కారం' మన సమక్షంలో వ్యాపిస్తుంది. ధ్యానపు లోతు ఎప్పుడైతే దాని సరిహద్దును తాకుతుందో, అప్పుడు దైవ ద్వారంమీద మన హాజరు నమోదైనట్లుగా అయి ద్వారం తలుపుతట్టినట్లు అవుతుంది. రెండవ విషయం ఏమిటంటే,

నిర్మలీకరణ విధానపు వాస్తవికత ఎప్పుడైతే దాని హద్దును తాకుతుందో, అప్పుడే మనకు మరియు ఈశ్వరునికి మధ్యనున్న పరదా (ముసుగు) తొలగిపోతుంది. ఎప్పుడైతే అహం యొక్క సమర్పణ ఈశ్వరీయ ముఖ్య కేంద్రపు ద్వారంవద్ద తల వంచి శాశ్వతంగా తన గుర్తింపును కోల్పోతుందో, అప్పుడు ప్రార్థన యొక్క సంపూర్ణతను నేను అనుభూతి చెందాను. కాని, ఇంకా కొంత శేషం మిగిలి ఉంది. అది ఏమిటో తెలుసా? ఎవ్వరైనా 'వారి' వరకూ మనం ఉన్నామనే వార్త తెలియజేయాలి కదా! అనగా అవచేతనా మనస్సు (Super conscious-mind)కు మన స్పృహను సరిదిద్ది ఎవ్వరో నీ గుమ్మంవద్దకు వచ్చారు అని తెలియజేయాలి. నేను గ్రహించింది ఏమిటంటే, నన్ను ఆ దివ్య ద్వారం వద్దకు చేర్చింది నా బాబూజీయే అని. నా కలం వ్రాయటానికి తన స్పృహను సంభాళించుకుంటుంది. ఎందుకంటే, తన సమక్షంలోని దివ్య దృశ్యం ఏదో చెప్తుతోంది. అది ఎటువంటి దృశ్యమో కదా! ఆ దృశ్యమే తన గురించి వ్రాయిస్తోంది. ఏమని అంటే, ఈశ్వరీయ కేంద్రం యొక్క ముఖ్య కేంద్రపు తలుపు తెరచి నా బాబూజీ "ఎవ్వరో 'వారి' సాక్షాత్కారం పొందటం కోసమని ఆర్తితో (దప్పికతో) వారి ఎదుట నిలబడి ఉన్నారు" అని చెప్తుతున్నట్లుగా అనిపించింది. ఈ (Splendid Divine Vision) అద్భుతమైన దివ్య దృశ్యం ఏ చిత్రకారుడు చిత్రించి మానవులకు ప్రదర్శించగలడు! **అభ్యాసీపట్లగల శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క (Unlimited Love) హద్దులులేని (అంతులేని) ప్రేమను వర్ణించగల సాహసం ఎవరు చేయగలరు!**

శ్రీ బాబూజీ, తమ దివ్యమైన అనంత ప్రేమ నీడలో సహజమార్గ సాధనా పద్ధతి ద్వారా హృదయానికి హత్తుకుని నా వంటి అల్పురాలైన కుమార్తెకు మొట్టమొదట ఆత్మ సాక్షాత్కారం (Self Realisation) అను దివ్య దశను ప్రసాదించారు. ఆ తర్వాత ఈశ్వరీయ సాక్షాత్కారంలో ప్రవేశం కల్పించి, ప్రథమ మానవుడ్ని స్థాపించిన సత్యపద్ మీద నన్ను ప్రతిష్టించారు. ఆ తర్వాత భూమా (అల్టిమేట్)కు చెందిన విశిష్టాత్మకమైన వైభవ దేశం అనగా సెంటర్ రీజియన్‌లో ప్రవేశింపజేసి ఈదించుతూ (స్విమ్మింగ్ చేయిస్తూ) తీసుకు వెళ్ళారు. ఇంతేకాదు, 'వారి' అనన్య ప్రేమ యొక్క అనంతత్వాన్ని చూసినట్లయితే, అక్కడ (సెంటర్ రీజియన్‌లో) కూడా ఎవరో నన్ను విశ్రాంతి తీసుకోనివ్వకుండా చేస్తున్నారు. ఎందుకంటే, 'వారి' దివ్య సంకల్పంలో ఆదమరచిన నా ఉనికికి స్పందన కలిగించి, ఈతలో పొందిన ప్రతిస్థితియొక్క దివ్యానుభవం స్వయంగా మరపుకు గురికాబడినవి అన్నింటినీ మరల మరల జాగృతంచేసి పూర్తి అనుభూతి యొక్క పరిచయంతో నింపాలని అనుకొన్నది. స్వయంగా (Divine) దైవమే, నా బాబూజీ మహరాజ్ యొక్క దివ్య మూర్తిమత్వం (Divine Personality) యొక్క పరిచయాన్ని అందరి కొరకు ప్రత్యక్షపర్చటానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది. ఈ (Divine Will) దివ్యేచ్ఛయే (దివ్య సంకల్పమే) నా పుస్తకాల రచనకు ఆధారమైంది. చివరకు భూమా (అల్టిమేట్) యొక్క అనంత వ్యాప్తి దర్శనం కలిగింది. దీనిలో అనగా ఈ దర్శనంలో మనం భూమా యొక్క ద్వారంలో ప్రవేశించటానికి మొదటిగా దాని సప్త ద్వారాలలో ప్రవేశం పొంది, దానిలో వ్యాపించి ఉన్న ఆదిశక్తిని తనదిగా చేసుకుంటూనే పురోగమించాల్సి ఉంటుంది. ఇది శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క పరమ కృప మరియు అందరిపట్లగల 'వారి' దివ్య ప్రేమ ద్వారానే సంభవమవుతుంది. నేను ఈ విధంగానే పొందగలిగాను. శ్రీ బాబూజీ మహరాజ్ తమ మహత్తర గ్రంథం

“రాజయోగ ప్రభావం (Efficacy of Rajyoga)”లో సప్త వలయాల గురించి వ్రాశారు. భూమా యొక్క ద్వారంలో ప్రవేశిస్తూనే, నేను గమనించింది ఏమిటంటే, దీనిని దర్శనం అని చెప్పాలో లేక దివ్య పరిచయం అని చెప్పాలో తెలియటం లేదు. అది నా సమక్షంలోకి వచ్చిన వెంటనే ఆ దర్శనం శాశ్వతంగా భూమా యొక్క అనంతత్వంలో విలీనమైపోయి తన జాతి గురించి చెబుతోంది. అది ఏమిటంటే, దీని ఆధారం లేదా పరిచయం అంతిమ సత్యం యొక్క అనంతత్వంలోనే ఇమిడి ఉంది. నేడు నా బాబూజీ చేతుల్లో ఉన్న నా కలం యొక్క ప్రవాహం మీ అందరినీ ఎంతవరకు తీసుకువెళ్తుందో నేను చెప్పలేను.

ప్రథమ వలయంలో ప్రవేశింపజేయటానికి ‘వారు’ ద్వారం వద్దనే ‘మహాపార్షద్’ యొక్క అత్యుత్తమ స్థితితో మనకు దైవిక–అలంకరణ చేస్తారు. ప్రథమ వలయంలో ప్రవేశించాక అక్కడ, శక్తి చేరటంగాని, సంకల్పం యొక్క స్పర్శగాని లేనట్లు నేను గ్రహించాను. అక్కడి వాస్తవికత (రియాలిటీ) నాకు ఏమి చెప్పింది అంటే, ఇక్కడ భూమా (అనగా ఆదిశక్తి) యొక్క ఆకర్షణయే వ్యాపించి ఉంది, అది మనల్ని సప్త ద్వారాలు లేదా సప్త వలయాల నుండి ‘తన దేశం’కు అనగా భూమా కేంద్రంకు తీసుకువెళ్ళుతుంది, అని.

ఓ! ఈ దివ్యాకర్షణ ఎటువంటిదో చూడండి! అది అక్కడి అనంతత్వానికి కూడా అతీతంగా ఉండి, శ్రీ బాబూజీ మహరాజ్ వ్రాసిన తమ్–అవస్థను కూడా మన ఎదుట ప్రకాశింపజేస్తుంది. ఈ దివ్యాకర్షణ అనేది భూమా దేశపు సంపూర్ణ సౌందర్యాన్ని సూచిస్తుంది. ఈ దివ్యమైన, కాని (Silent attraction) మౌన ఆకర్షణయే అభ్యాసీల పురోగతికి (Reality of 'Ultimate Truth') అంతిమ సత్యం యొక్క యదార్థతను ప్రకటిస్తున్నట్లుగా నేను గ్రహించాను. భూమా యొక్క ఈ దివ్యమైన, కాని సహజమైన ఆకర్షణ, దివ్య విభూతియైన మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క యదార్థ సౌందర్యాన్ని పరిచయం చేస్తోంది. బహుశా ఇప్పుడు భూమా యొక్క ఆది క్షేత్రం (Divine source of Bhuma) కూడా నేడు తన సాటిలేని అపరిచిత పరిచయాన్ని పొంది మందహాసం చేస్తోంది. ఇంకా ఏమి అనిపిస్తోంది అంటే, ఈ సహజమైన దివ్య ఆకర్షణ, ఆ దివ్య విభూతి మందహాసంతో నిండిపోయి, బహుశా తన గుర్తింపు లేదా పరిచయం పొందింది, అని. అంతిమం (భూమా) యొక్క దివ్యమైన అనంత ఆకర్షణ యొక్క దివ్య మందహాసపు కిరణాలు, నేడు మానవ మాత్రుల ఉద్ధరణ కోసం, దివ్య ఆహ్వాన రూపంలో శ్రీ బాబూజీ యొక్క దివ్య సంకల్పం ద్వారా ఈ భువిని స్పర్శిస్తున్నాయి. ఎందుకో తెలుసా? ఎప్పుడు, ఏ దైవిక క్షేత్రం నుండి అవతార పురుషులు ఈ ధరిత్రిపై అవతరించినా, ఆ దైవిక క్షేత్రం యొక్క శక్తి మరియు ఆకర్షణ ఆ దివ్య సౌందర్యం లేదా దివ్య విభూతి ద్వారా ఈ పృథ్వీమీద వ్యాప్తమైపోతుంది. అవి మానవుని ఆత్మతో సంబంధం కల్పించుకుని హృదయాంతరాల్లో దివ్య చైతన్యం కలిగించటానికి నాట్యం చేస్తాయి. ఆది నుంచి ఇప్పటివరకు అపరిచితంగా ఉన్న భూమా పరిచయ ప్రసాదాన్ని మానవ మాత్రుల హితంకొరకు పంచిపెట్టి, నేడు నా కలం ధన్యమైంది. ఈరోజు నా కలం, “ఓ భూమా అంశయైన శ్రీ బాబూజీ! తమ దివ్య విభూతి యొక్క ఆకర్షణ మరియు శక్తిలో మునిగి ఉన్న తమ సహజమార్గం అందరినీ హృదయానికి హత్తుకుని కేవలం అనంతం యొక్క దివ్య పరిచయాన్ని కల్పించటం మాత్రమే కాకుండా దీనిలో ప్రవేశం పొందే జగతికి దివ్య కాంతిని కూర్చి ఆధ్యాత్మిక సౌందర్యంతో కాంతు లీనునట్లుగా చేస్తోంది” అని ప్రార్థన చేస్తోంది. నేను చూస్తున్నది ఏమిటంటే,

నా రచనకు నా బాబూజీ యొక్క ఆశీర్వచనం 'తథాస్తు' అను ముద్ర కూడా లభించింది. అప్పుడింక ధన్యమైన నా కలం చిందులేస్తూ ఇలా గానం చేస్తూ ఉంది –"సంధ్యా! ఇలాంటి రోజు అందరికీ వచ్చి తీరాలి" అని. ప్రియ సోదరులారా! మీరు ఇది కూడా తెలుసుకోవాలని అనుకుంటూ ఉంటారు; ఏమిటంటే, ఈ 'దివ్య ఆకర్షణ' అంటే ఏమిటి? అని. అయితే వినండి. కాంతి చక్రం (Halo) అనేది మానవుని పవిత్రతను సూచిస్తుంది, కాని ఈ దివ్య ఆకర్షణ (Divine Power) దివ్యశక్తిని సూచిస్తుంది.

కాల మహిమ చూడండి! ఏ శ్రేష్ట దైవిక దర్శనం (Divine Philosophy) ఇప్పటివరకు పరదా మాటున ఉందో, అది ఇప్పుడు స్పష్టమైపోయింది. భూమా లేదా అల్టిమేట్ గురించి విన్నప్పుడు మనం దాని గురించి తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా మరియు ఆత్రుతగా ఉంటాము. కాని ఇప్పుడు దివ్య విభూతి శ్రీ బాబూజీని పొందిన తర్వాత మనం దానిని బాగా (Familier) తెలిసినవారమయ్యాము. శ్రీ రామచంద్ర మిషన్‌కు చెందిన సహజమార్గ సాధనా పద్ధతి, నిగూఢమైన దివ్య దశల యొక్క దివ్య రహస్యాలను అందరి హితవు కొరకు ప్రత్యక్షం చేసింది. ఇంతే కాకుండా, మానవ హృదయాలను తమ దివ్య సంకల్పంతో అనుసంధానం చేసి, దివ్య శక్తిని కూడా జతపరుస్తూ, సహజమార్గ సాధనా పద్ధతి యొక్క దివ్య ఫిలాసఫీ (తాత్వికత)కి 'వారు' స్పష్టతను ప్రదానం చేశారు. నేను ఇంకా ఏమి అనుభూతి చెందాను అంటే, ఆధ్యాత్మిక క్షేత్రం యొక్క సంపూర్ణ యాత్రను తమ దివ్య పరిశోధనతో పూర్తిచేసి అందరిపట్ల తమ దివ్య ప్రేమ యొక్క విశిష్టతను మందహాసంతో వెల్లడించారు. ఈ మందహాసం అలౌకికమైనది కావటంతోపాటు దానిలో నా పుస్తకం **"అనంత యాత్ర"** యొక్క ఐదు భాగాలు ఇమిడి ఉన్నాయి. ఇంతేకాదు, నేను వ్రాయటంలో మరువజాలనిది ఇంకొకటి ఉంది. ఏమిటంటే, అది 'అనంతం' యొక్క పరిచయాన్ని కూడా నా కలం ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఆదిశక్తి (Source) యొక్క దివ్యాకర్షణ భూమా దేశపు వాస్తవికతగా ఉంది. అలా కానట్లయితే, ఇక్కడ అంతా మౌనం, అంధకారం మాత్రమే వ్యాపించి ఉండేవి. నా రచన ఈ సత్యాన్ని వెల్లడించటానికి కూడా వెనుకాడదు. అది ఏమిటంటే, ఈ తమ్ అనే అనన్యగతి విషయంలో అనగా (Divine) దైవం యొక్క ఈ రహస్యాన్ని, ఏదైతే ఇప్పటివరకు తమ్ అసస్థకు చాటుగా ఉందో, దానిని కూడా అందరికోసం వెలుగులోకి తీసుకు రాగలిగే సామర్థ్యం శ్రీ బాబూజీ మహరాజ్ ద్వారానే సాధ్యమైంది.

ప్రియమైన పాఠకులారా! **"నిరాడంబరత మాటున"** అనేది వాస్తవంగా ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆది నుంచి 'అనంతం' వరకుగల దివ్య దశలతో కూడిన దివ్య రత్నగర్భం అని మీరు ఇప్పటికే గ్రహించి ఉంటారు. ఈ "నిరాడంబరత మాటున" యొక్క మహత్యం ఏమిటో చూడండి! అది (నిరాడంబరత మాటున) స్వయంగా తెరచాటున ఉంటూనే భూమా దేశపు సమస్త రహస్యాలను అందరి హితం కొరకు ప్రకటించి వేసింది. మీరు ఇంకేమి వింటారో, వినండి. ఈ నిరాడంబరత మాటున మనకు ఇచ్చిన సందేశం ఏమిటంటే, అంతిమం (అల్టిమేట్) యొక్క దివ్య రహస్యాలను బహిర్గతం చేసేవారు నా చాటునే ఉన్నారు. కాని ఈ ప్రపంచాన్ని ఈశ్వరీయ ప్రకాశంతో నింపివేయటానికి 'వారు' వెదజల్లే దివ్య మందహాసపు పరిమళం చాలు. ఇంకా చెప్పాలంటే, సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్, శ్రీ బాబూజీ మహరాజ్ గురించి చెప్పిన వాస్తవమైన మాట– "నీవు ప్రపంచంలోని జనులందరి హృదయాలలో ఈశ్వరీయతను నింపి

ఈశ్వరీయమయంగా మార్చగలవు. కాని నీవు నీ ప్రత్యామ్నాయాన్ని (Substitute) తయారుజేయలేవు" అని. ఎందుకో తెలుసా? ఎందుకంటే, "ఈశ్వరుడు స్వయంగా తన దర్శనాన్ని తాను పొందలేకపోయాడు." ప్రియమైన సోదరులారా! నిరాడంబరత మాటున నుంచి వస్తున్న దివ్య దరహాసపు పరిచయం ఇంత మాత్రమే లభ్యమైంది. ఈ అల్ప పరిచయం కూడా నేను వారిదే అయిన 'జాత్' నుంచి, నిరాడంబరత మాటున నుండియే పొందగలిగాను. **భూమా అయితే తన "గోపాలుడు" (పుత్రుడు) అని చెప్పి నిరాడంబరత మాటున వైపుకు సంకేతం ఇచ్చింది. అంతిమం (అల్టిమేట్) తన 'అంశ'యే అని చెప్పి 'వారి' మీద ప్రేమజల్లును కురిపించింది. ఇంక ఆదిశక్తి అయితే మానవ మాత్రుల హితం కొరకు తన దివ్య సంపద అంతా 'నిరాడంబరత మాటున'కు సమర్పించి వేసింది. ఈ యుగం 'వారి'ని సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ 'ముద్దుబిడ్డ'గా పిలిచి, 'వారి' దివ్య ప్రేమ యొక్క ఆశ్రయంలోనే వర్ధిల్లుతోంది.**

ఈ సమయపు ఘనత ఏమిటో చూడండి! అది ఈ యుగాన్ని పూర్తిగా 'వారి' ప్రేమాంచలంలో పోషించబడటానికి విడిచిపెట్టింది అనగా సమర్పితం చేసింది. ఇప్పుడు, ఆ (Divine Covering) దివ్య ఆవరణ 'వారి'ని (Cover) ముసుగులో ఉంచటం అనగా దాచి ఉంచటం సాధ్యం కాదు. అందుకని అది షాజహాన్‌పూర్ (యు.పి)లో 'వారి'ని మన 'బాబూజీ' రూపంలో మనకు ప్రసాదించింది. నిరాడంబరత మాటు, తన పరదాను (ముసుగును) తొలగించినప్పుడు మన జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ గారి ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశితమైన సహజమార్గ రూపంలో ఉన్న దీపపు దివ్య ప్రకాశంతో ఈ జగత్తులో కాంతిని వ్యాపింపజేస్తోంది. ఇంక ముగింపు ఏమిటంటే, ఈ 'నిరాడంబరత మాటున' నుంచి ఉద్భవించే దైవిక ప్రవాహం, సమస్త మానవాళి యొక్క ఉద్ధరణ కోసం శాశ్వతంగా ప్రవహిస్తూ, అంతిమ సత్యం యొక్క సరళమైన మరియు సహజమైన మార్గాన్ని సర్వదా అలంకరిస్తూనే ఉంటుంది.

## 11. అభ్యాసుల ప్రశ్నలు - బాబూజీ జవాబులు

**ప్రశ్న -1: భగవంతుడు (ఈశ్వరుడు) ఎవ్వరు?**

**జవాబు:** ఎవరైతే స్వయంగా ఆవిర్భవించారో వారే.

**ప్రశ్న -2: భగవంతుడు మనలోపల ఉన్నాడా?**

**జవాబు:** ప్రతి ఒక్కదానిలోను, మీలోనూ భగవంతుడు ఉన్నాడు. కాని ప్రశ్న ఏమిటంటే, మీరు భగవంతునిలో ఉన్నారా? అని.

**ప్రశ్న-3: బాబూజీ! భగవంతుని గురించి ఎలా వ్యాఖ్య చేయవచ్చు?**

**జవాబు:** ఈ ప్రాపంచిక విశేషణాలన్నీ తొలగించినట్లయితే ఏది మిగిలి ఉంటుందో అదే భగవంతుడు. మీరు కనుక కోపంలో భగవంతునికి విరుద్ధంగా నిందాపూర్వక భాష ప్రయోగం చేయాలనుకుంటే, మీరు ఎంతగా ప్రయత్నించినా ఫలితం ఉండదు.

**ప్రశ్న-4: ఇన్ని కష్టాలు, ఇంత దుఃఖం ఉన్న ఈ ప్రపంచాన్ని భగవంతుడు ఎందుకు సృష్టించాడు?**

**జవాబు:** లక్షల సంవత్సరాలవరకు శక్తి తనకు తాను ప్రకటించుకొనకపోతే అది స్థూలంగా అయిపోతుంది. అందువలన 'వాని' (దైవం) అస్తిత్వాన్ని నిలుపుకోవటానికి శక్తిని పంపగా, దాని పరిణామమే ఈ ప్రపంచంగా ఏర్పడింది.

**ప్రశ్న -5: భగవంతుడు చాలా నిర్దయుడు. ఎందుకంటే, 'అతడు' మనం బాధపడుతుంటే చూస్తూ ఉన్నాడు, వాటిని తొలగించటం లేదు.**

**జవాబు:** ఎప్పుడైతే మూల కేంద్రం నుంచి శక్తి దిగువ దిశగా వచ్చిందో అప్పుడు దాని పరిణామంగా 'సృష్టి' జరిగింది. ఎప్పుడైతే ఇది (శక్తి) కేంద్రాన్ని వదలి దాని బయటకు వచ్చిందో, అప్పుడు వస్తు సముదాయం యొక్క నిర్మాణం ప్రారంభమైంది. మన వెంట తెచ్చుకున్న మనస్సు మనల్ని తయారుచేయ సాగింది. దానితో ఇప్పుడు మనం ఉన్న భౌతిక రూపంలోకి వచ్చాము. మనం ఏమి చేస్తున్నామంటే, మనం మనస్సును సరైన పద్ధతిలో ప్రయోగించటం లేదు. అందుకనే ఈ దుఃఖం పరిణామంగా అయ్యింది. కనుక అన్ని కష్టాలకు, బాధలకు స్వయంగా మనమే కారకులం.

శరీరంలో విషం ఉత్పన్నమైనప్పుడు, జ్వరం వస్తుంది. అప్పుడు మనలో యదార్థ శక్తి అనగా అసలు శక్తి ఏదైతే లోపల క్రియాత్మకంగా ఉందో, అది అనవసరమైన వాటిని బయటకు నెట్టివేయాలని అనుకుంటుంది. నేను మీకు ఇవన్నీ చెబుతున్నాను కాని అది ఎంతవరకు సహేతుకమో నేను చెప్పలేను. ఎక్కడైతే క,ఖ,గ,ఘ,ఙ లు ఉండవో అటువంటి విశ్వవిద్యాలయంలోనే నేను శిక్షణ పొందాను.

**ప్రశ్న -6: ఈశ్వరానుభూతి అంటే ఏమిటి?**

**జవాబు:** మీరు ఏమిటో మీకు తెలుసు. కాని 'అతడు' ఎవ్వరో మీకు తెలియదు. ఎప్పుడైతే మీరు ఇది తెలుసుకుంటారో అనగా మీలో 'అతడు' ఏమిటో అన్న అనుభూతి చెందుతారో, అదే ఈశ్వరానుభూతి అవుతుంది.

**ప్రశ్న -7: భావనలు ఈశ్వరానుభూతిలో అడ్డంకులను ఉత్పన్నం చేస్తాయా?**

**జవాబు:** భావనలు (ఆలోచనలు) ఎక్కడ ఉన్నాయి, అవి మీ ఇంటిలోనా లేక ఇంకెక్కడైనానా. నాకయితే భావన యొక్క అర్థం కూడా తెలియదు. అందువలన దానిని గురించి నేను ఏమి చెప్పగలను? అనుభూతులు అనేవి యదార్థం, భావనలు అనేవి అవాస్తవం.

**ప్రశ్న -8: సత్యత్వం అంటే ఏమిటి?**

**జవాబు:** సత్యత్వం అనేది ఆధార రహిత ఆధారం.

**ప్రశ్న -9: పరిపూర్ణత్వం అంటే ఏమిటి?**

**జవాబు:** నిరంతరం (Balanced) సమతుల్యంగా ఉండటానికి శక్తులన్నీ వికసించినప్పుడు పరిపూర్ణత సంభవమవుతుంది.

**ప్రశ్న -10: ఒక నవజాత శిశువు (అప్పుడే జన్మించిన బిడ్డ) పూర్ణత్వం కలిగి ఉన్నట్లేనా?**

**జవాబు:** అది ఒక సుషుప్తావస్థలో (నిద్రావస్థలో) ఉన్నట్లు. ఇప్పుడు దీనిని మీరు పూర్ణమంటారా, అపూర్ణమంటారా!

**ప్రశ్న -11: బాబూజీ! 'స్వత్వము' అంటే ఏమిటో మీరు వ్యాఖ్యానిస్తారా? 'స్వత్వము' అని ఋషులు చెప్పటంలో దాని అర్థంగా వారు ఏమి గ్రహించారు? వారి ఉద్దేశ్యం 'భగవంతుడు' అని అనుకోవాలా?**

**జవాబు:** భగవంతుడు కాదు. ఇది భగవంతునికి భిన్నంగా ఉంటుంది. వ్యక్తిగత భావమే 'స్వత్వము' అవుతుంది. ఇది అహంకారం యొక్క పరిణామం.

**ప్రశ్న-12: పరిపక్వ ఆలోచన అంటే ఏమిటి?**

**జవాబు:** ఒకే లక్ష్యం, ఒకే గురువు, ఒకే పద్ధతిగా నిర్ణయించుకోవటం.

**ప్రశ్న -13: మస్తిష్కంలో (మెదడులో) ఆలోచనలు ఎందుకు ఉత్పన్నమవుతాయి?**

**జవాబు:** మస్తిష్కంలో ఏమీ ఆలోచనలు లేనట్లయితే మనం పూర్ణ సమతుల్య స్థితికి వచ్చామని అర్థం చేసుకోవాలి. అది వెంటనే ఛిన్నాభిన్నమవుతుంది (అనగా మరణం సంభవిస్తుంది).

**ప్రశ్న -14: ఆలోచనలు ఏ విధంగా ఏర్పడతాయి?**

**జవాబు:** మన మనస్సు బృహత్ (దివ్య) మనస్సు నుంచి వచ్చింది. అది ఎంతగా చెడిపోయినప్పటికీ, దానిలో పవిత్రత సదా నెలకొని ఉంటుంది. ఎందుకంటే, ఈ పవిత్రత యొక్క సంబంధం దివ్య మనస్సుతో ఉంటుంది. అది దాని మీద ఎటువంటి అపవిత్రతను స్వీకరించుకోవటానికి ఇష్టపడదు. ఈ విధంగా అపవిత్రత అనేది నిరంతరం బయటకు నెట్టబడుతూ ఉంటుంది. ఇలా బయటకు నెట్టివేయబడిన అపవిత్రత, ఆలోచన రూపందాల్చి మనకు అనుభవంలోకి వస్తుంది.

**ప్రశ్న -15: ఆలోచనకు మరియు అంతర్ జ్ఞానానికి ఉన్న భేదం ఏమిటి?**

**జవాబు:** కల్పన యొక్క ఉన్నత స్థితి ఆలోచన. ఆ ఆలోచన ఎప్పుడైతే దాని హద్దును దాటుతుందో, అది అంతర్ జ్ఞానంగా మారుతుంది.

**ప్రశ్న -16: మనం ఆలోచనా రహిత స్థితిలో ఉన్నప్పుడు చైతన్యం ఉంటుందా?**

**జవాబు:** అవును. ఇది దాదాపు ఒక పశువు స్థితిలాగా ఉంటుంది. ఈ ప్రవృత్తిలో కేవలం ఎదురు జవాబు మాత్రమే ఉంటుంది. నేను మీకు చెబుతున్నాను, పూర్తిగా ఆలోచనా రహితంగా ఉండటం అసంభవం, అప్పుడు జీవనం ఉండదు (అనగా మరణం సంభవిస్తుంది). మన ఆలోచనా ధోరణిలో మార్పు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకసారి ఒక వ్యక్తి నావద్దకు వచ్చి తనను ఆలోచనా రహితంగా చేయమని నన్ను అడిగాడు. నేను దానిని నవ్వులాటగా తీసుకుని, నేనొక షరతుతో అలా చేయగలనని చెప్పాను. అది ఏమిటంటే, అతడు నన్ను పూర్తిగా ఆలోచనా స్థితిలో ఉంచగలిగితే అప్పుడు అతడ్ని ఆలోచనా రహిత స్థితికి తెస్తానని చెప్పాను.

**ప్రశ్న -17: భగవంతుని సాన్నిధ్యం పొందాలంటే బాధలు ఉండటం అవుసరమా?**

**జవాబు:** అది అవుసరం లేదు. అది కేవలం నాకు మాత్రమే. నా గురువుగారు తీవ్రమైన బాధాగ్రస్తుడై ఉండేవారు. వారి కాలేయంలో బాధ ఉండి చాలా తీవ్రంగా బాధపడేవారు. అలా తీవ్ర బాధలో ఉన్నప్పుడు వారు పాటలు పాడేవారు. అలా ఎందుకు చేస్తున్నారని నేను ప్రశ్నించాను. వారు నాకు ఏమి చెప్పారంటే, ఏ వ్యక్తి అయినా తీవ్రంగా బాధపడుతున్నప్పుడు అతనికి మూలగాల్సిన స్థితి కలుగుతుంది.

దానికి బదులుగా పాటలు పాడుకొనవచ్చును కదా! అని అన్నారు. ఒకసారి వారు నాతో ఇది కూడా చెప్పారు. ఏమిటంటే, వారు ఈ బాధను ఒక్క నిమిషంలో సునాయాసంగా నివారించుకోగలరు అని. కాని వారు అలా చేయలేదు. ఎందుకంటే, అది భగవంతుని ద్వారా ప్రసాదించబడింది కనుక, దానిని అనుభవించారు. భగవంతుడు దీనిని ఎందుకు ప్రసాదించాడో ఎవ్వరికి తెలుసు? వారు అనుభవించారు అంటే దానికి ఏదో కారణం ఉంటుంది తప్పనిసరిగా. ఇది దైవేచ్ఛపట్ల నా గురువుగారి సమర్పణ.

**ప్రశ్న –18: మతం అంటే ఏమిటి?**

**జవాబు:** కొన్ని సిద్ధాంతాలు ఒకేచోట సమీకరించటం లేదా సంగ్రహించటమే మతం.

**ప్రశ్న –19: మతం మరియు ఆధ్యాత్మికతలో గల భేదం ఏమిటి?**

**జవాబు:** మతం బాహ్య జగత్తులో ప్రసన్నతను ప్రసాదిస్తుంది. కాని నేను హృదయంలో ప్రసన్నతను ప్రసాదిస్తాను. దర్శనానికి సంబంధించి సంభాషణల ద్వారా కూడా నేను బాహ్య ప్రసన్నత లేదా బాహ్యానందాన్ని సమకూర్చుతాను. కనుక మీరు గ్రహించాల్సింది ఏమిటంటే, నేను బాహ్యాంతరాలు రెండింటిలోను ప్రసన్నం చేస్తాను, అని.

**ప్రశ్న –20: రాజయోగం అంటే ఏమిటి?**

**జవాబు:** ఇది ఈశ్వరానుభూతికి చెందిన ఒక ప్రాచీన పద్ధతి.

**ప్రశ్న –21: బాబూజీ! తమ సందేశం ఏమిటి?**

**జవాబు:** అంతట శాంతి మరియు ఆలోచనల్లో విరోధభావం లేకుండా ఉండటం.

**ప్రశ్న –22: దీనిని ప్రాప్తించుకోవటం ఎలా?**

**జవాబు:** ప్రాణాహుతి మరియు ప్రార్థన ద్వారా.

**ప్రశ్న –23: సహజమార్గం, రాజయోగం యొక్క పునరుద్ధరింపబడిన పద్ధతి, అని మీరు చెప్పారు కదా! ఇది రాజయోగానికి ఏ విధంగా భిన్నమైనది?**

**జవాబు:** ఇది భిన్నమైనది కాదు. ఇది నా గురువుగారి యొక్క అనుభవాల మీద ఆధారపడిన పద్ధతి. "క్రొత్త సీసాలో పాత మధువు" అను నానుడిలాగా ఉంది.

**ప్రశ్న –24: గృహస్థ జీవితంలో ఉన్న వారెవరైనా దీనిని పాటించవచ్చునా?**

**జవాబు:** అవును. ఇది సామాన్య గృహస్థుల కోసమే. ఇతరులు కూడా అభ్యసించి దీనితో లబ్ధిపొందవచ్చు. నా గురువర్యులు గృహస్థ జీవనానికి వ్యతిరేకులు కారు.

**ప్రశ్న –25: మీరు శిక్షణ నిస్తున్న ఈ పద్ధతి భౌతిక ప్రపంచం నుంచి సన్యసించటమేనా? ఇలా కాదంటారా?**

**జవాబు:** కాదు. దీనికి విరుద్ధంగా మీరు సన్యసించాల్సి ఉంటుంది. (అనగా ఈ భావాన్ని మీరు వదలిపెట్టాల్సి ఉంటుంది.) మీరు గృహస్థ జీవనం ఆచరిస్తూనే, మీ వృత్తిని యధాప్రకారం అనుసరిస్తూనే మరియు సామాన్య జీవనాన్ని గడుపుతూనే దీనిని ఆచరించవచ్చు.

**ప్రశ్న –26: ధ్యానం కొరకు ఎంత సమయం కేటాయించాలి?**

**జవాబు:** మీరు 20 నిమిషాలతో ప్రారంభించి ఒక గంటవరకూ చేయవచ్చు.

**ప్రశ్న –27: మీవద్ద ఏమైనా మహిమలు ఉన్నాయా?**

**జవాబు:** మహిమలు ఉండాల్సిన అవసరం లేదు. రాజయోగాన్ని అనుసరిస్తే శీఘ్రంగానే మహిమలు కలుగుతాయి. అయితే మనం వీటికోసం ప్రయత్నించకూడదు. అద్భుతం అనేది మానవాళికి ఉపయోగపడే వస్తువు కాదు. అది ఒక వేరే విషయం. మహిమలు చేసేవారికి (లేదా ప్రదర్శించేవారికి)– వారికి తప్పకుండా ఖ్యాతి వస్తుంది.

**ప్రశ్న –28: మంత్రాలకు ఏమైనా శక్తి ఉన్నదా?**

**జవాబు:** సహజమార్గంలో మనం మంత్రాలు జపించటాన్ని సమర్థించము. అనేకమంది దీనికి శిక్షణ ఇచ్చారు కనుక మంత్రాలకు శక్తి ఉన్నదని చెప్పబడుతుంది. కాని నా స్వంత ఆలోచన ప్రకారం ధ్యానం మాత్రమే యదార్థ లక్ష్యం. అది వాస్తవిక గమ్యానికి చేర్చగలదు. మంత్ర యోగ ప్రయోగంలో సరైన విధానం ఏమిటంటే, ముందుగా దాని అర్థంపైన దృష్టి నిలిపి ధ్యానం చేయాలి. అలా చేయకపోతే, దీనివలన ఫలితం ఉండదని వైదిక సూత్రాలు చెబుతున్నాయి. ఒకవేళ మీరు ఏ మంత్రమైనా దాని భావం మీద ధ్యాస నిలపకుండా కేవలం ఉచ్చరించినట్లయితే దానివలన మంచి ప్రభావం కనిపించదు. మంత్రాల గురించి అయితే మీరు శ్రీ పతంజలి సూత్రాలను చదవాల్సి ఉంటుంది. ఏదైనా మంత్రం జపించాలనుకుంటే కేవలం దాని అర్థం యొక్క భావం మీదనే మననం చేయాలని వారు స్పష్టంగా చెప్పారు.

**ప్రశ్న –29: నేను ఒక ఇతర గురువును అనుసరిస్తున్నాను. వారు నాకు ఒక మంత్రం చెప్పారు. నేను వారి మంత్రాన్ని సాధన చేస్తూనే మీ పద్ధతిని కూడా స్వీకరించవచ్చునా?**

**జవాబు:** నేను మీకు సహజ రూపంలో చెప్పాల్సి ఉంటుంది. అది ఏమిటంటే, ఎక్కడికైనా తీసుకు వెళ్ళటానికి రెండు సాధనలు ఉండవు. ఒక సాధన మరో సాధనలో వైరుధ్యం కల్పిస్తూ ఉంటుంది. మీరు కొంత సమయం ఒక దానిని వాయిదావేసి రెండవ దాని అనుసరణ చేయండి. అప్పుడు దేనిని అనుసరించాలని అనుకుంటున్నారో మీరే నిశ్చయించుకోవచ్చు. **గురువును మార్చుకోవటంలో జనం ఎందుకు వెనుకాడతున్నారో నాకు అర్థం కావటం లేదు. మీ ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు గురువును ఆశ్రయించటం జరుగుతుంది. మీరు కోరుకుంటున్నది ఆ గురువు ఇవ్వలేకపోతే, అప్పుడు మీరు మరో గురువును తప్పకుండా ఆశ్రయించాల్సి ఉంటుంది. కాని మీరు వారితో తను కావాలనుకుంటున్నది వారు ఇవ్వలేకపోతున్నారని, అందుచేత వేరొక గురువు దగ్గరకు వెళ్తున్నానని వారికి చెప్పాల్సి ఉంటుంది.**

**ప్రశ్న –30: ప్రాణాహుతి అనేది సహజమార్గం యొక్క విశేషమైన భాగంగా మీరు చెప్పారు. అసలు అది ఏమిటి? ఎలా పని చేస్తుంది?**

**జవాబు:** అది ఒక దైవీయ శక్తి. మానవుని రూపాంతరీకరించటం (మార్పు) కోసం ప్రయోగించబడుతుంది. రూపాంతరీకరణ (మార్పు) అనేది ప్రాణాహుతి యొక్క ప్రతిఫలం.

**ప్రశ్న –31: మీరు మిషన్‌లో ఎక్కువమంది సభ్యులను ఎందుకు కోరుకుంటున్నారు? 6 లేక 7 మంది వ్యక్తులు ఉంటే సరిపోదా?**

**జవాబు:** చూడండి, నేను అనంతం నుంచి వచ్చాను. ఆ అనంతం యొక్క బీజం నా లోపల ఉంది. నేను చేస్తున్నది ఏదైతే ఉందో, దానిలో నేను ప్రకృతి రూపంలో (సహజంగానే) ఉండాలని కోరుకుంటాను.

అనగా అనంతం నాతో ఉండాలి మరియు అందరితోపాటు ఆ అనంతం ఉండాలనీ కోరుకుంటాను. ఒక దొంగ కూడా తనతోపాటు చాలా మంది ఉండాలని కోరుకుంటాడు. ఇది ఆ అనంతం యొక్క ప్రభావమే కాని అనుచిత దిశలో ఉంది. నేను ఇంకొక విషయం చెబుతాను. అది ఏమిటంటే, మనం దేవుని (ఈశ్వర) పాక్షిక శక్తిని ఉపయోగించకూడదు. కానీ 'అతని' సంపూర్ణ శక్తిని ఉపయోగించాలి. కాని ఎప్పుడైతే 'నేను' యొక్క ప్రాబల్యం ఉంటుందో, అప్పుడు పూర్ణశక్తి రాదు. అందువలన 'నేను' (అనగా స్వ)ను వదలిపెట్టితే శక్తి వస్తుంది. అయితే ఆ శక్తి యొక్క ప్రయోగాన్ని నియంత్రించాల్సి ఉంటుంది. అట్టి వ్యక్తికి ఈ దిశలో అత్యధిక జగరూకత (Alert) ఉండాలి.

**ప్రశ్న –32: బాబూజీ! ఇంత సమయం మా మీద పని చేస్తున్నారు, మరి మేము కూడా తమకు సహకారం ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాము. ఈ కార్యానికి సంబంధించిన శ్రమను –మీది, మాది కూడా తగ్గించుకునే మార్గం ఏమీ లేదా?**

**జవాబు:** దీనికి సంబంధించినది లాలాజీ ఇలా చెప్పారు: "ఎంత సమయంలో ఒక అశ్రుకణం నేత్రం నుంచి వెలువడుతుందో, అంత సమయంలో మాత్రమే పరిపూర్ణత ప్రసాదించబడగలదు, కాని అలా జరిగితే నాడీ మండలం అంతా తునాతునకలై చెదరిపోతుంది" అని.

ఒకవేళ నేను వేగవంతం చేసినట్లయితే, వాస్తవంగా అలా చేయవచ్చును కాని, ఆ వ్యక్తి మాత్రం ఎంత మాత్రం అనుభవం పొందలేడు. దాని ఫలితంగా అతడు తనకు ప్రాప్తమైనదాని విలువను గ్రహించలేడు.

**ప్రశ్న –33: బాబూజీ! తమరు 'సత్యోదయం' అనేక సంవత్సరాలకు పూర్వం రచించారు. తమ ఇతర పుస్తకాలైన 'రాజయోగ ప్రభావం', 'సహజమార్గ దర్శనం', 'అనంతంవైపు' మరియు 'దశ నియమాలపై వ్యాఖ్యానం' వంటివి కూడా అటువంటివే. తమరు ఎప్పుడైనా సంస్కరిస్తారా? బహుశా ఈ పుస్తకాలలో తమ ద్వారా ప్రకటించబడిన కొన్ని సూత్రాలు ఇప్పుడు అంతగా ప్రభావం చూపలేవేమో?**

**జవాబు: ఈ పుస్తకాలు కేవలం ప్రస్తుత కాలానికిగాని లేదా నూరు సంవత్సరాలకుగాని ఉద్దేశించి వ్రాయబడలేదు. వాటిలో వ్రాయబడినవి శాశ్వత ప్రయోజనం కోసమే. అవి భవిష్యత్తు కొరకే. అవి సరళంగానే ఉన్నప్పటికీ, అత్యధిక జనం వాటిని అర్థం చేసుకోవటానికి చాలా కష్టపడుతున్నారు.**

**ప్రశ్న –34: బాబూజీ! అవి సరళంగా ఉంటే వాటిని తెలుసుకోవటం సహజంగానే ఉండాలి కదా! మరి ఈ విధంగా ఎందుకు ఉంటుంది?**

**జవాబు:** నేను మీకు వేదాలు ఉదహరణగా చెబుతున్నాను. నా ఆలోచన ప్రకారం, ప్రాచీన కాలంలో ఋషుల ద్వారా అవి (వేదాలు) రచించబడినప్పుడు, ఆ కాలంలో ఏ కొద్దిమంది మాత్రమే వాటిని అర్థం చేసుకోగలిగారు. ఇప్పుడు వాటి అర్థం తెలుసుకోవటం ఎంతో సహజమైపోయింది. ఇదే సహజమార్గ శిక్షణ విషయంలో కూడా. భవిష్యత్ కోసం ఈ బోధనలు. భవిష్యత్తులో జనం వాటిని సహజంగానే అర్థం చేసుకుంటారు.

**ప్రశ్న –35: నేను అంతా తెలుసుకోవాలనుకుంటున్నాను, అది ఎలా?**

**జవాబు:** పారసీ భాషలో ఒక ద్విపద (రెండు పాదాలు ఉన్నవి) ఉంది. దానిలో సంత్ ఏమి చెప్పారంటే, "నేను తెలుసుకున్నది అంతా ఒక్కటే అది ఏమిటంటే, నాకేమి తెలియదు అని."

**ప్రశ్న -36: మీరు హృదయంమీద ధ్యానం చేయమని చెప్పారు. అయితే మేము మాకు ఇష్టమైన ఏ ఇతర వస్తువు (విషయం)పైన అయినా ధ్యానం చేయవచ్చునా? నేను సాగరం మీద ధ్యానం చేయటం శ్రేష్టమైనదిగా భావిస్తున్నాను. నాకు ఇది అనంతం యొక్క యధార్థ భావాన్ని కలిగిస్తోంది.**

**జవాబు:** సోదరా! దీనిని మీరు స్వయంగా నిర్ణయించుకోవచ్చు. నా గురువు ద్వారా వికసించిన పద్ధతిలో మేము హృదయంలో ప్రకాశం మీద ధ్యానం చేస్తున్నాము. నా అభిప్రాయం ఏమిటంటే, మీరు ఏదైనా పదార్థం మీద ధ్యానం చేస్తున్నారు అంటే అందుకు ప్రతిఫలంగా మీకు దాని తత్వం ప్రాప్తిస్తుంది. ఈ కారణంగా ఒకవేళ మీరు సాగరం మీద ధ్యానంచేస్తే మీకు లవణమే (ఉప్పు) ప్రాప్తమవుతుంది.

**ప్రశ్న -37: ఒక అభ్యాసీ అనేక సంవత్సరాల నుండి ధ్యానం చేస్తూ ఉన్నట్లయితే సాధన సులభమవుతుందా లేక ఆలోచనలు వస్తూనే ఉంటాయా?**

**జవాబు:** ఆలోచనల తీవ్రత తగ్గుముఖం పడుతుంది. అయితే అది ఒక్క రోజులో కాదు. ధ్యాన సమయాన్ని పెంచి ఒక గంటసేపు వరకు కొనసాగించాలి. అలా చేసి మార్పును గమనించండి.

**ప్రశ్న -38: బాబూజీ! ఇది చాలా కష్టం.**

**జవాబు:** కేవలం మీరు చెయ్యరు కాబట్టి మీకు అలా అనిపిస్తుంది. నేను ఎంతో సులభంగా దానిని చేస్తున్నాను. నేను చేయగలుగుతున్నాను అంటే, మీరు కూడా చేయగలరు.

**ప్రశ్న -39: బాబూజీ! ప్రకాశం గురించి మీరు ఏమి చెబుతారు? మేము ప్రకాశం చూడాల్సి ఉంటుందా?**

**జవాబు:** నేను మీకు చెబుతున్నాను. హృదయంలో ప్రకాశం ఉన్నది అనేది ఒక కల్పన (ఆలోచన) మాత్రమే. ఇది ఒక ప్రస్తావన (Supposition). నేను ఎక్కడో వ్రాశాను, ఏమని అంటే, ప్రారంభ స్థితిలో ప్రకాశం ఉండదు, అంధకారమూ ఉండదు. ఇది ప్రభాత సమయంలోని రంగులాగా ఉంటుంది. నారద సూక్తి కూడా ఇదే చెబుతోంది.

**ప్రశ్న -40: ధ్యానం నిశ్చేష్టగా (పని లేకుండా) ఉంటుంది. మనం ఏమీ చేయనప్పుడు, ఇది పరిణామం ఎలా ఇవ్వగలదు?**

**జవాబు:** మనం హృదయంలో ఈశ్వరీయ ప్రకాశం ఉందనుకొని ధ్యానం చేస్తాము. మీరు ధ్యానం చేస్తున్నారంటే, దాని అర్థం మీరు ఏదో చేస్తున్నారు అని. ఇంకా చెప్పాలంటే, ఆ స్థానం, మీరు ఎక్కడైతే ఏదో చేస్తున్నారో, అక్కడ హృదయం కూడా ఉంది అని మీకు తెలుసు. మీరు మీ లక్ష్యం వరకు చేరాలను ఆలోచన కూడా నెలకొని ఉంది. మీరు అర్థచైతన్యరూపంలో అక్కడ ఏదో వస్తువు కోసం నిరీక్షిస్తూ ఉంటారు కూడా. దీని అర్థం ఏమిటంటే, మీరు జడం (Inert) కాదు. మీరు ఎంతగా (Busy) నిమగ్నమై ఉంటారు అంటే, ఒకే సమయంలో పని చేస్తున్నారు. ఈ విధంగా ప్రత్యక్ష రూపంలో కనిపిస్తున్న నిష్క్రియత (పనిలేకుండా ఉండటం) అనేది కార్యశీలతలో (పనిలో) నిమగ్నమైపోతుంది.

**ప్రశ్న -41: ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు కష్టాలు అవుసరమా?**

**జవాబు:** అవసరం లేదు. నేను మీకు ఒక విషయం చెబుతున్నాను. భారతదేశంలో అనేకమంది ఋషులు ఎటువంటివారు ఉన్నారంటే, వారు భగవంతుని సమక్షంలో విశ్వంలో ఉండే కష్టాలన్నీ తమకే ప్రసాదించాలని

విన్నపంతో ప్రార్థన చేసేవారు. నేను ఇలా చెప్పినందుకు నన్ను క్షమించండి. కాని మీరు వారితో పోల్చుకొని చూడండి.

**ప్రశ్న –42: నిరంతర స్మరణ అనేది స్వతస్సిద్ధంగా కలుగుతుందా లేకపోతే ఎవ్వరికైనా దీని కోసం సాధన చేయాల్సి ఉంటుందా?**

**జవాబు:** ప్రేమ అధికంగా ఉన్నట్లయితే అది స్వయంగానే వికసిస్తుంది.

**ప్రశ్న –43: నిరంతర స్మరణను ఏ విధంగా వికసింపజేసుకోవాలి, దానికి ఏదైనా మార్గం ఉందా?**

**జవాబు:** మనం ఒక్క ఆలోచన మీద దృష్టి నిలుపుకోవాలి. కేవలం ఆ ఒక్క ఆలోచన మీద హృదయంలో దాని భావన మళ్ళీ మళ్ళీ చేసుకోవటం తప్పనిసరిగా ఉంటుంది. దీనిని మంత్రంలాగా వల్లించకూడదు.

**ప్రశ్న –44: ఆధ్యాత్మిక వికాసం కోసం సమాధి అవసరమా?**

**జవాబు:** ప్రతి వ్యక్తి సమాధి కొరకు ప్రాకులాడతూ ఉంటాడు. కాని వికాసం కొరకు దాని అవసరం ఎంత మాత్రమూ లేదు. నేను చెబుతున్నది ఆధ్యాత్మిక వికాసం గురించి. నేను ఎల్లప్పుడు ఆధారం మీదనే ఏదైనా చెబుతాను.

**ప్రశ్న –45: బాబూజీ! మీరు సమాధి గురించి ఏదైనా చెబుతారా? అది ఏమిటి?**

**జవాబు:** పారంపర్యంగా వస్తున్న యోగ సాధనలో 'సమాధి' అనేది యోగానికి చివరి స్థితిగా చెప్పబడింది. అది స్వతహాగా వచ్చినట్లయితే చెడుకాదు. అయితే దానిలో దైవ చైతన్యం తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా, దాని సహాయంతో మీరు ఉన్నతి చెందాల్సి ఉంటుంది. ఒకవేళ దివ్య చైతన్యం లేకపోతే అది నిరర్థకం. ఎప్పుడైతే ధ్యానం ('ఓమ్' అని పలకటం ద్వారా) నిలుపమని చెప్పబడుతుందో, వెంటనే ఈ దివ్య చైతన్యం కారణంగా మీకు తెలుస్తుంది. ఒకవేళ అది పారంపర్యమైన రెండవ రకపు సమాధి అయినట్లయితే, అప్పుడు మిమ్మల్ని బలవంతంగా మేల్కొల్పవలసి ఉంటుంది.

**ప్రశ్న –46: శ్రద్ధ అనేది ఎలా ప్రాప్తం చేసుకోవాలి లేదా మనలో ఎలా వికసింపజేసుకోవాలి?**

**జవాబు:** మనం చేయవలసింది ఏమిటంటే, ఎవరి మీదైనా విశ్వాసం ఉంచి ఆరంభించాలి. అప్పుడింక మీరు మీ ప్రగతి చెందుతున్నట్లుగా గమనిస్తే, శ్రద్ధ స్వయంగా ఉత్పన్నమవుతుంది. జనం అంతఃకరణ గురించి మాటలు ఎన్నో చెబుతూ ఉంటారు. అంతఃకరణ వలన మనకు మార్గదర్శనం జరగాలి కాని, మనమే మన ఇష్టప్రకారం అంతఃకరణకే మార్గం చూపిస్తున్నాము. అంతఃకరణ అంటే ఏమిటి? వాస్తవంగా దీనికి నాలుగు అంతస్తులు ఉన్నాయి. మనస్సు, బుద్ధి, చిత్తం మరియు అహంకారం అనునటువంటివి. ఎక్కడైతే ఇవన్నీ (Balanced) సమతుల్యంగా అయి, ఒక మూల ఆలోచనతో కలగలిపి ఉంటాయో, అప్పుడు అది నిజమైన అంతఃకరణమవుతుంది.

**ప్రశ్న –47: శ్రద్ధను ఏమని చెప్పాలి? అది ఒక వరమా లేదా ఇచ్ఛాశక్తి యొక్క పనియా?**

**జవాబు:** రెండు సరైనవే.

**ప్రశ్న –48: మీరు లక్ష్యం చేరటం గురించి చెప్పేటప్పుడు, శ్రద్ధ మరియు ధృఢ సంకల్పం ఉండాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అలాగే సమర్పణ కూడా అవసరం అని అంటున్నారు. అయితే ఇప్పుడు**

**ధృఢ సంకల్పం మరియు సమర్పణ– ఈ రెండింటిలో ఏది ముందుగా ఉంటుంది? అవి ఒక దాని వెనుక ఒకటిగా వస్తాయా లేక రెండూ తోడుగా వస్తాయా?**

**జవాబు:** లక్ష్యం చేరటానికి సమర్పణ అవసరం, కాని సంకల్పం మొదటిదిగా ఉండాలి. నా దృష్టిలో నిజం ఏమిటంటే, ఇవి రెండూ ఒకే తత్వానికి చెందినవే కాని రంగులు వేరుగా ఉంటాయి.

**ప్రశ్న –49: బాబూజీ! ప్రేమను గురించి మీరు ఏమి నిర్వచిస్తారు? ఇది అవసరమంటారా?**

**జవాబు:** ప్రేమ చాలా అవసరం. గురువుపట్ల, ఈశ్వరునిపట్ల ప్రేమ కలిగి ఉండటం తప్పనిసరిగా అవసరమై ఉంది. కాని ఆధ్యాత్మిక ప్రగతిలో ప్రేమ కూడా విలీనమైపోయే ఒక స్థాయి లేదా అంతస్తు వస్తుంది. దీని భావం ఏమిటంటే, ఎప్పుడైతే ప్రేమ ఒక నిశ్చిత స్థాయికి చేరుతుందో, అప్పుడు ఆ అభ్యాసీకి అతడు ఎవరిని ప్రేమిస్తున్నాడో కూడా అనుభవంలోకి రాదు లేదా ఎవరు ప్రేమిస్తున్నారు అనేది కూడా అనుభవంలోకి రాదు. ఇటువంటి ఈ స్థితినే ఆఖరికి ప్రేమ కూడా 'వారి'లో విలీనమైపోతుంది అని చెప్పబడుతుంది.

**ప్రశ్న –50: సమర్పణ అంటే ఏమిటి?**

**జవాబు:** 'నేను' అనేది లేకుండా ఉండటమే సమర్పణ అవుతుంది. ఇందులో మొదటి విషయం ఈశ్వరునిపట్ల భక్తి, రెండవది సదా ఆధారపడి ఉండే అనుభవం పొందటం. మీరు ఈశ్వరునికి సమర్పితమైపోయారని అనుకోండి. ఆ సమర్పణ యదార్థమైతే, ఆ సమర్పణ సంపూర్ణ మానవత్వంపట్ల సమర్పణమవుతుంది.

**ప్రశ్న –51: ప్రాణాహుతి అంటే ఏమిటి? ఈ తెలుపబడిన శక్తి స్థూలమైనదా?**

**జవాబు:** మానవుని రూపాంతీకరణ చేయటంలో ఉపయోగించే దైవీయ శక్తియే ప్రాణాహుతి. ఇది ఎటువంటి స్థూలమైన శక్తి కాదు. ఇది అనంతం యొక్క శక్తి, అది స్థూలమూ కాదు, రసాయనికమూ కాదు.

**ప్రశ్న –52: బాబూజీ! ప్రాణాహుతి అభ్యాసీ మీద ఏ విధంగా పని చేస్తుంది? దీని గురించి కొంచెం వివరణ ఇవ్వగలరా?**

**జవాబు:** ఇది దైవీయ శక్తిని గుంజుకొచ్చి అభ్యాసీలో ప్రవేశపెట్టుంది. అప్పుడు అది క్రియాశీలకమవుతుంది. ఎప్పుడైతే ఈ దైవీయ శక్తి మీలోకి వస్తుందో, అప్పుడది పనిచేయ నారంభిస్తుంది. ఇది అభ్యాసీని సంతులిత్ అనగా సమతుల్య (Balanced) స్థితిలోకి తీసుకు వస్తుంది. (Unbalanced) అసమతుల్య ప్రకృతి లేకుండాపోతుంది. ప్రాణాహుతి ప్రభావం ఇదే.

**ప్రశ్న–53: దీనిని అనుభవించగలమా?**

**జవాబు:** అవును. మనం సంవేదనశీలురమైనప్పుడు (అనగా సూక్ష్మ అనుభవ శక్తి ఉంటే) అనుభవం చెందగలము. ఒకవేళ మీరు అనుభవం చెందలేదనుకోండి, పరివర్తనం ఏదైతే ఉందో అది మీకు ప్రాణాహుతి ప్రభావం యొక్క విశ్వాసాన్ని కల్పిస్తుంది.

**ప్రశ్న –54: బాబూజీ! నిర్మలీకరణకు ముఖ్యంగా సరైన సమయం ఏది?**

**జవాబు:** రోజువారీ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక ఉన్న ఆ సమయం అందుకు ఉపయోగంగా ఉంటుంది.

**ప్రశ్న –55: అహంకారం అంటే ఏమిటి?**

**జవాబు:** అహంకారం అనేది చెడువస్తువు ఏమీ కాదు. నిజం చెప్పాలంటే, ఇది ఒక సూచన. ఇది ఏదైనా ఒక వస్తువును సంకేతపరుస్తుంది. "ఇది ఒక బల్ల, నేను దీనిని పైకెత్తగలను. ఎందుకంటే, నాలో విరాజిల్లే

అహంకారం యొక్క శక్తి నేను దీనిని పైకి ఎత్తగలను" అని సంకేతాన్ని ఇస్తుంది. అందువలన అహంకారం అనేది చెడ్డదికాదని మీరు గ్రహించండి. కాని అది ఎప్పుడు తప్పు అవుతుంది అంటే, అంతరాత్మ ఇచ్చే, నేను ఈ బల్లను లేవనెత్తగలను అనే జ్ఞానాన్ని ఈ శరీరంతో సంబంధం కల్పిస్తున్నాము. స్వయానికి తన జ్ఞానం ఏదైతే ఉందో అది శరీరానికి ఆపాదిస్తున్నాము. అహంకారమైతే వాస్తవంగా 'స్వ' అనగా తన యొక్క శక్తిని గుర్తించే ఒక అనుసంధాన సూత్రం. నేనయితే 'స్వ' (Self) అనగా అహంను సంపూర్ణ వినాశానికి వ్యతిరేకిస్తాను. ఎందుకంటే, ఒకవేళ దీనిని నశింపు చేసినట్లయితే మనం ఏ పనీ చేయలేము. భారతదేశానికి చెందిన దాదాపు అందరు ఋషులు (సంత్‌లు), దానిని సంపూర్ణంగా నశింపజేయాల్సిన అవసరం ఉంది అని చెప్పారు. కాని నేను అందుకు వ్యతిరేకిని.

**ప్రశ్న -56: బాబూజీ! దయచేసి అహంకారం గురించి ఇంకా కొంచెం వివరణ ఇవ్వండి.**

**జవాబు:** అహంకారం గురించా! అదేమిటో మీకు చెబుతున్నాను. మానవుడు భగవంతుడు చేసే పనిని తాను తీసుకుంటాడు, తను చేయాల్సిన పనిని దైవంమీద మోపుతాడు. ఇదే వాస్తవిక ఇబ్బంది. అసలు విషయం ఏమిటంటే, మన పని మనం చేయాలి; అలాగే దైవం, తను చేయాల్సిన పనిని చేయనివ్వాలి.

**ప్రశ్న -57: దుష్టత్వం అంటే ఏమిటి మరియు దుష్టమార్గం ఎటువంటిది?**

**జవాబు:** అప్రాకృతిక కార్యాలు అనగా ప్రకృతికి విరుద్ధమైన కార్యాలు చెయ్యటమే దుష్టత్వం. ఏ కార్యాలైతే మానవుణ్ని ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను బలంగా చేస్తాయో, అవి మంచివి. అలాకాకుండా, ఏవైతే మానవుణ్ని మానసికంగాను, భౌతికంగాను దుర్బలంగా చేస్తాయో, అవి చెడ్డవి.

**ప్రశ్న -58: బాబూజీ! మీరు స్వార్థాన్ని సరిగ్గా ఎలా వివరిస్తారు?**

**జవాబు:** మీ హృదయం, మీకోసం చేయబడిన ఎవరి సేవకైనా కృతజ్ఞతా భావం లేకుండా ఉంటే, అది స్వార్థమవుతుంది.

**ప్రశ్న -59: బాబూజీ! భయం యొక్క ప్రకృతిని గురించి మీరు ఏమంటారు? మీ దృష్టిలో మతిభ్రమ అంటే మాయ అంటారా?**

**జవాబు:** భయం అనేది బుద్ధికి మతిభ్రమ. బుద్ధి సక్రమంగా ఉంటే, ఏ భయమూ ఉండలేదు. మతిభ్రమ అనేది మాయకాదు. సాధారణంగా మాయ అనేది ఒక మోసం అని చెప్పబడుతుంది, కాని నేను దానిని సమ్మతించను. మాయ అనేది ఈశ్వరుని శక్తిగా నేను భావిస్తాను. ఆ శక్తి ఏ విధంగా పనిచేస్తుందో తెలియనప్పుడు మనం భయపడిపోయి దానిని మాయగా వ్యవహరిస్తూ ఉంటాము. కాని మనకు ఈశ్వరీయ శక్తి ఏ విధంగా పనిచేస్తుందో, ఆ జ్ఞానం కలిగినప్పుడు మనకు యదార్థం స్పష్టమవుతుంది. కనుక నిజం చెప్పాలంటే, ఇది మన స్వంత అజ్ఞానం మాత్రమే. బుద్ధి జీవులు అనగా మేధస్సు కలిగినవారు జ్ఞానాన్ని అరువుగా తెచ్చుకుంటారు. అదే దివ్య పురుషులైతే జ్ఞానాన్ని ఉత్పన్నం చేస్తారు.

**ప్రశ్న -60: బాబూజీ! ప్రాచీన యుగాల్లో అవతారాల ద్వారా జరిగిన పనులను గురించి వ్యాఖ్యానిస్తారా?**

**జవాబు:** నా అభిప్రాయంలో శ్రీరామచంద్రుడు ఒక అవతారుడు. 'అతడు' సమాజం కోసం ఆచార వ్యవహారాల్ని, ఉత్తమ విధుల్ని నిర్మించాడు. శ్రీ కృష్ణుడు కూడా అదే పునాదులమీద భవన నిర్మాణం

చేశాడు. అంతే కాకుండా, సాధనలో భక్తిని సమకూర్చాడు. శ్రీకృష్ణునికి పూర్వం ఈ భక్తితత్వం లోపించి ఉండేది. ఈ విధంగా ప్రతి అవతారం తన పూర్వ అవతారపు పనుల్లో నిర్మాణాత్మక యోగం కల్పిస్తుంది. ఇదే ప్రకృతి నియమం. అందువలన ఒక విధంగా, తర్వాత వచ్చే ప్రతి అవతారం దానికి పూర్వం వచ్చిన అవతారం కంటె గొప్పదిగా భావించబడుతుంది. ఈ ఆలోచన ప్రకారం శ్రీకృష్ణుడు శ్రీరాముని కంటె మహిమావంతుడుగా సామాన్యంగా భావించబడుతుంది. అయితే గొప్పదనం, నిమ్నతనం అను ఆలోచన అనుచితమైంది. ప్రతి అవతారం యొక్క ఉత్పత్తి (ఆవిర్భావం) ఆ కాలానికి అవసరమైన దాన్ని పూర్తి చేయటానికని సంభవించటం జరుగుతుంది. అందుచేత ఏ అవతారమైనా ఒక దాని కంటె గొప్పది, అల్పమైంది ఎలా అవుతుంది! అవతారం యొక్క ప్రయోజనమే విలువైనదో లేక అల్పమైనదో అవుతుంది కాని అవతారానికి కాదు.

**ప్రశ్న -61: బాబూజీ! మీరు గురువుగారా?**

**జవాబు:** కాదు. నా గురించి నాకు ఈ మాత్రమే తెలుసు. అది ఏమిటంటే, నా సహయోగులందరి మధ్య ఒక సహయోగిని. అంతిమ గురువు లేదా స్వామి (ప్రభువు) ఈశ్వరుడు మాత్రమే. ఇతరు లందరూ వారి మార్గదర్శకత్వంలోను మరియు నిర్దేశం ప్రకారంగాను పని చేస్తున్నారు. నిజం చెప్పాలంటే, ఒకవేళ **ఎవ్వరైనా తాను గురువునని చెప్పారంటే, అతడు ఆధ్యాత్మికంగా ఇతరులకు శిక్షణ ఇవ్వటానికి అనర్హుడు. ఇటువంటి వ్యక్తి ఈశ్వరుని పదవిని అపహరిస్తున్నవాడుగా అవుతాడు.**

**ప్రశ్న -62: ఈ శరీరం నాది కాదు, కాని గురువుకు చెందిన శరీరం అని, నా పనులన్నీ, మిగతావన్నీ ఏవైతే నేను చేస్తానో అవన్నీ గురువుగారివి అని భావించుకోవాలని చెప్తుతూ ఉంటారు. ఇది మౌలికంగా సరియైనదేనా?**

**జవాబు:** ఈ విషయంలో నేను సలహా ఇవ్వను. ఇది ఎవరైతే స్వయంగానే సాంకేతిక (Technical) పద్ధతులను ప్రాప్తించుకోవటానికి ప్రయత్నం చేస్తూ, వాటితో సంబంధం కల్పించుకుంటారో, ఆ అత్యంత సమర్పితమైన వ్యక్తుల కోసమే. ఇది క్రొత్తగా నేర్చుకునే వారికి కాదు. దీనిలో బలప్రయోగం ఉండరాదు. ఇది సహజంగా రావాలి; లేకపోతే, ఇది కూడా మూర్తిపూజ (విగ్రహారాధన)గా అవుతుంది.

**ప్రశ్న -63: విశ్వాన్ని గురించి మీరు ఏమి వ్యాఖ్యానిస్తారు?**

**జవాబు:** విశ్వం అనేది సత్యత్వం యొక్క అతిశయోక్తి అని నేను అంటాను.

**ప్రశ్న -64: విశ్వప్రేమను ఎలా ప్రాప్తం చేసుకోవాలి?**

**జవాబు:** నిజమైన విషయం ఏమిటంటే, సంపూర్ణ ప్రేమ ఈశ్వరుని కదిలించటమవుతుంది. ఒకరి స్మరణ, సంపూర్ణం యొక్క స్మరణను తెస్తుంది. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అంటే మీ బిడ్డలను కూడా ప్రేమిస్తున్నాను. ఒక సంస్థ ఉంది. అది గత 40 సంవత్సరాల నుండి విశ్వప్రేమ యొక్క శిక్షణ నిస్తోంది. కాని ఫలితం శూన్యం. ఎందుకు? దీనికి కారణం ద్వేషం; హృదయంలో ద్వేషం ఉండటం. ద్వేషాన్ని తొలగించినట్లయితే ప్రేమ దానంతట అదే వికసిస్తుంది. అందువలన మీరు దీనిమీద పని చెయ్యకుండా దాని మూలంమీద పని చెయ్యండి.

**ప్రశ్న -65: మానవ జీవనం మరియు మానవుని ఉనికి (అస్తిత్వం) యొక్క ఉద్దేశ్యం ఏమిటి?**

**జవాబు:** ఉద్దేశ్యం ఈశ్వరానుభూతి మాత్రమే మరియు తన స్వ (సెల్ఫ్) యొక్క ఆత్మ యొక్క దైవీయ జ్ఞానం.

**ప్రశ్న -66: జీవనం అంటే ఏమిటి? స్వతంత్రత మరియు స్వతంత్రమవ్వటం అను మాటల అర్థం ఏమిటి?**

**జవాబు:** జీవనం అను దానికి అనేక పరిభాషలు ఉన్నాయి. అయితే నేను మీకు నా పరిభాష చెబుతున్నాను. (Life in life) జీవనంలో జీవించటమే నిజమైన జీవనం. ఎప్పుడైతే మీరు స్వతంత్రత నుంచి కూడా స్వతంత్రులవుతారో అప్పుడే నిజమైన స్వతంత్రత అవుతుంది.

**ప్రశ్న -67: మీరు స్వతంత్రత నుంచి కూడా స్వతంత్రం అని చెబుతున్నారు?**

**జవాబు:** అవును. స్వేచ్ఛ లేదా స్వతంత్రం (నేను స్వేచ్ఛగా ఉన్నాను అను భావం) నుంచి కూడా విముక్తి పొందటమే వాస్తవిక స్వేచ్ఛ లేదా స్వతంత్రం.

**ప్రశ్న -68: మానవునికి సదాచారం ఏమిటి?**

**జవాబు:** ఉన్నత శ్రేణికి చెందిన ఆలోచనల యొక్క చింతనయే మానవుని సదాచారం. ఎప్పుడైతే మీరు ఇలాంటి ఆలోచన చేస్తారో అప్పుడు దానిని మీరు పొందగలరు కూడ. దీని కోసం ప్రయత్నించాలి. 10 సంవత్సరాల లోపల అన్ని దేశాల సభ్యత గురించి పరిశీలన చేయాల్సి ఉంటుంది అని నేను భావిస్తున్నాను.

మానవుని అతిమూర్ఖత్వం ఏమిటో మీరు నాకు చెప్పగలరా? నేనే చెబుతున్నాను. మనం ఎప్పుడూ గతం గురించి ఆలోచన చేస్తూ ఉంటాము. కాని భవిష్యత్తు నిర్మాణం గురించి మరిచిపోతాము. అన్నింటికీ మించిన మూర్ఖత్వం ఇదే.

**ప్రశ్న -69: సంకల్పం మరియు కోరిక భిన్నమైనవా?**

**జవాబు:** కోరిక అనేది దాని సందర్భాన్నిబట్టి చెడ్డది. కాని దీనిని సక్రమమైనదిగా మార్చుకుంటే అది మంచిదే అవుతుంది. మనం కోరిక అనే దానిని అనుచితమైన విధంగా ప్రయోగిస్తున్నాము. సంకల్పం అనేది కోరిక యొక్క లక్ష్యాన్ని ప్రాప్తం చేసుకునే ప్రక్రియ.

**ప్రశ్న -70: బాబూజీ! విద్వత్తు (జ్ఞానం), వాస్తవిక లక్ష్యం మరియు సన్యాసంపట్ల మీ అభిప్రాయం ఏమిటి?**

**జవాబు:** ఈశ్వరీయ శక్తి యొక్క సదుపయోగమే విద్వత్తు (జ్ఞానం). ఈశ్వరుని పొందటమే వాస్తవిక లక్ష్యం. నిజం చెప్పాలంటే, సన్యాసం యొక్క అవసరం లేదు. ఎందుకంటే, ఎవ్వరైనా సన్యాసం తీసుకుని వనంలోకి వెళ్ళిన తర్వాత, బహుశా తన కుటుంబం, పిల్లలు మొదలైనవారి గురించి ఆలోచిస్తూ ఉంటాడు. కనుక గృహస్థుల మధ్యనే జీవించాలి, కాని సంఘటనలపట్ల నిర్లిప్తంగాను, నిరాసక్తంగాను ఉండాలి. ప్రపంచం అనగా ప్రాపంచికత్వం నుంచి పారిపోవాల్సిన అవుసరం లేదు. మనం దైవాన్ని తేలికగా పొందగలిగినప్పుడు ఈ కష్టాల్లో పడటం ఎందుకు?

**ప్రశ్న -71: నేను ఒక భ్రష్ట (అవినీతికి నిలయమైన) సంస్థలో పని చేస్తున్నాను. ఈ స్థానం భ్రష్టులతో నిండి ఉంది. ఇలాంటప్పుడు నేను ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎలా అనుసరించగలను?**

**జవాబు:** ఇది వ్యక్తిగత సమస్య. దీనికి వ్యక్తిగత కారణాలు వెదకాలి. నా అభిప్రాయంలో ఉన్నతమైన తత్వాలతో అనురక్తిని అనుభూతి చెందాలి. అప్పుడు నీచమైన విషయాలు వాటికవే క్షీణించిపోతాయి. మీ

ఇచ్ఛాశక్తిని ఉన్నతమైన దానిని ప్రాప్తించుకోవటంలో వినియోగించాలి. అప్పుడింక అథమస్థాయి నుంచి విముక్తి కలుగుతంది.

**ప్రశ్న -72: నేను రోజంతా భౌతికత్వంతో కూరుకుపోయి ఉంటాను. నేను ఉన్నతమైన ఆలోచనలవైపు నా మనస్సును కేంద్రీకరించలేకపోతున్నాను. నేను ఏమి చేయాలి?**

**జవాబు:** సంత్‌ల (ఋషుల) యొక్క సాంగత్యం చేయాలి. ఒకవేళ అది సంభవం కాకపోతే ఎవరికైతే వ్యక్తిత్వం (సెల్ఫ్) లేదో అటువంటి వ్యక్తితో సాంగత్యం చేయాలి.

**ప్రశ్న -73: అటువంటి వ్యక్తి ఈశ్వరానుగ్రహంతోనే దొరకుతారా?**

**జవాబు:** అప్పుడు దీనికోసం దైవాన్ని ప్రార్థించాలి. మీ ప్రశ్నకు సమాధానం మీరే స్వయంగా చెప్పారు.

**ప్రశ్న -74: నేను ఒక ప్రదేశంలో ఉన్నాను. అక్కడ భూతాలు ఉన్నాయని చెబుతుంటారు. నేను చాలా భయభ్రాంతుడనవుతున్నాను. ఈ భయం నుంచి ఎలా రక్షించుకోగలను?**

**జవాబు:** వాటికి అస్తిత్వం లేదనుకుంటే మీకు భయం ఉండదు.

**ప్రశ్న -75: కుండలిని గురించి మీరు ఏమి చెబుతారు? మీ యోగంలో దీని సహకారం ఏమైనా ఉన్నదా?**

**జవాబు:** కుండలిని అనేది ఒక శక్తి. ఒకవేళ దీనిని జాగృతం చేస్తే ఊర్ధ్వ జగత్తు యొక్క పనిలో ఇది లాభదాయకంగా ఉంటుంది. ప్రతి వ్యక్తికి ఊర్ధ్వ జగత్తు యొక్క పని అప్పగించబడదు. అందువలన ఈ శక్తి జనులందరికీ అవసరం లేదు. ఈ విధంగా ఊర్ధ్వ జగత్తు కార్యాల కొరకు కొద్దిగా లేక ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉంటారు. ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు దీని అవసరం కూడా లేదు.

**ప్రశ్న -76: బాబూజీ! విద్వాన్ (విద్వాంసుని) యొక్క గొప్పదనం ఏమిటి?**

**జవాబు:** ఎవ్వరైతే పుస్తకాలు తిని (చదివి) మౌనంగా ఉంటారో, అట్టి విద్వాంసుని కంటె పుస్తకాలు తిని నిశ్శబ్దంగా ఉండే పురుగులు (చెదలు) చాలా మంచివవుతాయి.

**ప్రశ్న -77: బాబూజీ! 'సాక్షాత్కారం' (Realisation) అంటే ఏమిటి?**

**జవాబు:** నీవు నీ గురించి నీవు ఎవ్వరివో తెలుసు, కాని 'అతని' గురించి, 'అతడు' ఏమిటో నీకు తెలియదు. ఎప్పుడైతే నీవు 'అతడి'ని గురించి తెలుసుకుంటావో, ఇంకా 'అతడి'ని నీ లోపల 'అతడు' ఏమిటో, ఎలా ఉంటాడో అనుభూతి చెందుతావో అదే 'సాక్షాత్కారం' (Realisation).

**ప్రశ్న -78: మనం అహం యొక్క బంధనాల నుంచి విముక్తి చెందుతున్నామని మనం ఎప్పుడు తెలుసుకుంటాము?**

**జవాబు:** 'నేను' అని చెబుతున్నప్పుడు, ఆ 'నేను' అనేది ఎవరికోసం చెప్పుతున్నామో తెలియనప్పుడు అహం యొక్క స్థూల బంధనం నుంచి మనకు విముక్తి కలిగినట్లు అర్థం చేసుకోవాలి.

**ప్రశ్న -79: సహజ-సమాధి అంటే ఏమిటి?**

**జవాబు:** సహజ-సమాధి స్థితిని నెగేషన్ (అస్థిత్వం లేకపోవటం) యొక్క ఉధృతి లేదా ఆధిక్యత అని చెప్పటం సబబుగా ఉంటుంది. సమత్వ స్థితి (State of Moderation) అనేది కూడా సరైన శబ్దమే. సహజ-సమాధిలో ఎరుక (దివ్య చైతన్యం) ఉంటుంది. నెగేషన్‌లో ఎరుక ఉండదు.

# PRAYER

O, Master!
Thou art the real goal of human life,
We are yet but slaves of wishes,
Putting bar to our advancement,
Thou art the only God and Power,
To bring us upto that stage.

# ప్రార్థన

ఓ నాధా !

నీవే మానవ జీవనమునకు యదార్థ లక్ష్యము,

మా కోరికలు ఆత్మోన్నతికి ప్రతి బంధకములై యున్నవి

నీవే మా ఏకైక స్వామివి - ఇష్టదైవమవు

నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.